సోమవారం
18-11-2024
హైదరాబాద్ ప్రచురణ
సంపుటి : 09, సంచిక : 57
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from Hyderabad,Vijayawada, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

నేడు కొలువుదీరనున్న శ్రీలంక కేబినెట్

కొలంబో: శ్రీలంకలో వామపక్ష సంఘటన విజయకేతం ఎగురవేసింది. అధ్యక్షుడు అనుర కుమార దిసనాయకే నేతృత్వ నేషనల్స్ పీపుల్స్ పవర్ (ఎన్‌పీపీ) సార్వత్రిక ఎన్నికల్లో ఘన విజయం అందుకుంది. 225కుగాను 159 పార్లమెంటు స్థానాలు కైవసం చేసుకుంది. 2/3 మెజారిటీ సాధించింది. ఈ గెలుపుతో దిసనాయకే నాయకత్వానికి మరింత బలం చేకూరింది. దీంతో నూతన కేబినెట్ కొలువుదీరబోతోంది. కొత్త మంత్రులంతా సోమవారం ప్రమాణ స్వీకారం చేస్తారు. దిసనాయకే సమయక్షంలో మంత్రులు, సహాయ మంత్రులు ప్రమాణం చేస్తారని అధ్యక్ష మీడియా విభాగం (పీఎండీ) ఆదివారం ప్రకటించింది. కాగా, కేబినెట్‌లో మొత్తం 23 మంది పేర్లను అధ్యక్షుడు ప్రకటిస్తారని స్థానిక మీడియా పేర్కొంది.

రాజకీయ జోక్యం గొడ్డలిపెట్టు

చెన్నై: న్యాయ వ్యవస్థ స్వతంత్రకు రాజకీయ జోక్యం గొడ్డలిపెట్టు వంటిదని సుప్రీంకోర్టు న్యాయమూర్తి, జస్టిస్ బీవీ నాగరత్న అన్నారు. ఆమె చెన్నైలో జస్టిస్ నటరాజన్ శతజయంతి సందర్భంగా స్మారకోపన్యాసమిచ్చారు. రాజకీయ లక్ష్యాలను గ్రహించడానికి కోర్టులు వేదికలు కారాదని, న్యాయపరమైన పాత్ర రాజకీయ వ్యవస్థ ప్రయోజనాలతో ముడిపడి ఉండరాదని జస్టిస్ నాగరత్న అన్నారు. రాజకీయ ప్రభావం కారణంగా జడ్జిలకు పదవీ కాలంలో భద్రత కల్పన, నియామక ప్రక్రియల్లో జరగాల్సిన

- మిగతా 2 లో

ప్రధాని మోదీకి నైజీరియా పురస్కారం

అబుజా: భారత ప్రధాని నరేంద్ర మోదీకి నైజీరియా ప్రభుత్వం తన రెండవ అత్యున్నత జాతీయ పురస్కారం ' గ్రాండ్ కమాండర్ ఆఫ్ ది ఆర్డర్ ఆఫ్ ది నైజర్' ప్రదానం చేసింది. నైజీరియా అధ్యక్షుడు బోలా అహ్మద్ టినుబు మోదీకి ఈ పురస్కారం అందజేసి సత్కరించారు. 1969లో క్వీన్ ఎలిజబెత్ కు నైజీరియా ఈ అవార్డును ప్రదానం చేసింది. అనంతరం ఈ గౌరవాన్ని అందుకున్న విదేశీ ప్రముఖుడిగా మోదీకి స్థానం దక్కింది. విదేశాల్లో మోదీ అందుకున్న అత్యున్నత అంతర్జాతీయ అవార్డుల్లో ఇది 17వది. ఈ సందర్భంగా

- మిగతా 2 లో

పాఠశాలల పనివేళల పొడిగింపు?

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల సమయం సాయంత్రం 5 గంటల వరకు పొడిగించేలా ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. ఇప్పటికే ప్రతి మండలంలో ఒక ఉన్నత పాఠశాలను పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసి సాయంత్రం 5 గంటల వరకు పని వేళలు కొనసాగేలా ప్రణాళిక రూపొందిస్తోంది. అన్నీ అనుకూలిస్తే ఈ నెల 25వ తేదీ నుంచి 30వ తేదీ వరకు ఈ సమయం అమలు చేసి చూడాలని పాఠశాల విద్యాశాఖ

- మిగతా 2 లో

ఖనిజ సంపదపైనే బీజేపీ కన్ను

అంబానీ, అదానీకి అప్పగించేందుకు యత్నం

దేశ సంపద పేదలకు పంచుతాం

'ఇండియా' అభ్యర్థుల గెలుపు తథ్యం: భట్టి

విశాలాంధ్ర- హైదరాబాద్: బీజేపీకి జార్ఖండ్ ప్రజలపై ప్రేమ లేదని, అక్కడి ఖనిజ సంపదపై కన్ను వేసిందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. జార్ఖండ్ రాష్ట్రం బొకారో నియోజకవర్గం శివండి, దుంది బజార్, ఆజాద్ నగర్ తదితర ప్రాంతాల్లో ఆదివారం ఇండియా కూటమి పక్షాన ఆయన ప్రచారం నిర్వహించారు. అపార ఖనిజ సంపదను అదానీ, అంబానీ లకు అప్పగించేందుకు బీజేపీ ప్రయత్నం చేస్తుందని అన్నారు. మీ బిడ్డల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని ఆ సహజ సంపద కాపాడాలంటే ఇండియా కూటమి అభ్యర్థులను గెలిపించాలని కోరారు. జనాభా నిష్పత్తి ప్రకారం దేశ సంపదను పంచాలని రాహుల్ గాంధీ దేశవ్యాప్తంగా ప్రచారం చేస్తున్నారని తెలిపారు. తెలంగాణలోనూ ఇదే ప్రధాన అస్త్రంగా ప్రచారం చేశామని, ప్రజలు గుర్తించి కాంగ్రెస్ పార్టీకి అధికారం అప్పగించారని పేర్కొన్నారు. జనాభా నిష్పత్తి ప్రకారం వనరులు, సంపద పంచేందుకు తెలంగాణలో సమగ్ర కుటుంబ సర్వే ప్రారంభించామని వివరించారు. అధికారంలోకి రాగానే క్యాబినెట్‌లో తీర్మానం చేసి ఆ తర్వాత ఏకగ్రీవంగా కులగణనకు బిల్లు పాస్ చేయించామని చెప్పారు. ప్రస్తుతం శరవేగంగా సమగ్ర కుటుంబ సర్వే జరుగుతుందని తెలిపారు. జార్ఖండ్‌లో ఇండియా కూటమి అభ్యర్థుల గెలుపు తథ్యమని... రాష్ట్ర సంపద ఈ ప్రాంత వాసులకే పంచుతామని, ఇక్కడ కూడా సమగ్ర కుటుంబ సర్వే చేపడతామని స్పష్టం చేశారు. ఆదివాసీలు,

- మిగతా 2 లో

మంటల్లో మణిపూర్

మైతేయిల హత్యపై ప్రజాగ్రహ జ్వాల

- మరో నలుగురు ఎమ్మెల్యేల నివాసాలకు నిప్పు
- సీఎం పూర్వీకుల ఇంటి ముట్టడి యత్నం
- 23 మంది ఆందోళనకారుల అరెస్టు

ఇంఫాల్ : మణిపూర్ ప్రజాగ్రహ జ్వాలలతో రగిలిపోతోంది. మిలిటెంట్ల చేతిలో మైతేయి వర్గానికి చెందిన ఆరుగురి హత్యపై నిరసనలు వెల్లువెత్తుతున్నాయి. ఇంఫాల్ నగరంతో పాటు లోయ ప్రాంతమంతా అట్టుడికిపోతోంది. తమ వర్గానికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ పెద్ద ఎత్తున మైతేయిలు ఆందోళనలు కొనసాగిస్తున్నారు. ఆదివారం మణిపూర్ ముఖ్యమంత్రి ఎన్.బీరేన్ సింగ్ పూర్వీకుల నివాసాన్ని ముట్టడించేందుకు ఆందోళనకారులు చేసిన ప్రయత్నాన్ని భద్రతా బలగాలు భగ్నం చేసినప్పటికీ, ఇంఫాల్ లోయలోని వివిధ జిల్లాల్లో ఆగ్రహానికి గురైన గుంపులు మరో ముగ్గురు బీజేపీ శాసనసభ్యులు, వారిలో ఒకరు సీనియర్ మంత్రి, కాంగ్రెస్ ఎమ్మెల్యే నివాసాలకు నిప్పు పెట్టారని అధికారులు తెలిపారు. జిరిబామ్ జిల్లాలో మిలిటెంట్లు ముగ్గురు మహిళలు, ముగ్గురు చిన్నారులను హత్య చేయడంతో నిరసనకారులు ఆందోళనకు దిగడంతో నిరవధిక కర్ఫ్యూ విధించినప్పటికీ శనివారం రాత్రి హింసాత్మక నిరసనలు చోటుచేసుకున్నాయి. ముగ్గురు రాష్ట్ర మంత్రులు, ఆరుగురు ఎమ్మెల్యేల నివాసాలపై ఆందోళనకారులు దాడులు చేశారు. ఆగ్రహించిన గుంపులు నింగ్‌తౌఖోంగ్‌లో పీడబ్ల్యూడీ మంత్రి గోవిందాస్ కొంతౌజం, లాంగ్‌మీడాంగ్ బజార్‌లో హియాంగ్లాం బీజేపీ ఎమ్మెల్యే వై.రాధేశ్యామ్, తౌబల్ జిల్లాలో వాంగ్జింగ్ టెన్థా బీజేపీ ఎమ్మెల్యే పావోనం బ్రోజెన్, ఇంఫాల్ తూర్పు జిల్లా ఖుంద్రాక్‌పామ్‌కు చెందిన కాంగ్రెస్ ఎమ్మెల్యే లోకేశ్వర్ దాడులు చేసినట్లు అధికారులు తెలిపారు. ఎమ్మెల్యేల నివాస ప్రాంగణాలపై దాడి చేసి, ఆస్తులను ధ్వంసం చేసి, ఇళ్లకు

- మిగతా 2 లో

బీరేన్ సర్కార్‌కు షాక్! ఎన్‌పీపీ మద్దతు ఉపసంహరణ 8లో

తక్షణమే ఏఎఫ్ఎస్‌పీఏ వెనక్కి

మణిపూర్ సమస్య పరిష్కారంలో ప్రధాని, హోంమంత్రి విఫలం: సీపీఐ

న్యూఢిల్లీ: మణిపూర్‌లో సాయుధ దళాల ప్రత్యేక అధికారాల చట్టం (ఏఎఫ్ఎస్‌పీఏ) రద్దునకు సీపీఐ డిమాండ్ చేసింది. దీని అమలుతో రాష్ట్రంలో పరిస్థితి మరింత జఠిలమయ్యిందే తప్ప ఏ సమస్యకు ఇప్పటివరకు పరిష్కారం లభించలేదని పేర్కొంది. ఏఎఫ్ఎస్‌పీఏ అమలు వల్ల స్థానిక ప్రజల్లో అపనమ్మకం, ఘర్షణలు ఎక్కువయ్యాయని భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) జాతీయ కార్యదర్శివర్గం ఆదివారం ఒక ప్రకటనలో ఆందోళన వ్యక్తం చేసింది. ఈ రాక్షస చట్టాన్ని మణిపూర్ ప్రజలు ఎప్పుడూ వ్యతిరేకించారని గుర్తుచేసింది. దీనివల్ల శాంతి నెలకొన్న దాఖలాలు లేవని తెలిపింది. హింస, శిక్షలంటే భయం లేకపోవడం వంటివి పెరిగిందని పేర్కొంది. మణిపూర్‌లోని పరిస్థితులను చక్కబెట్టడంలో ప్రధాని, కేంద్ర హోంమంత్రి విఫలమైనట్లు సీపీఐ జాతీయ కార్యదర్శివర్గం విమర్శించింది. వారి మౌనం, చర్యలు తీసుకోని వైఖరితో బాధిత వర్గాల మనస్సు విరిగిందని, అర్థవంతమైన జోక్యం లేక సంక్షోభం మరింత తీవ్రమైందని పేర్కొంది. తాజా పరిణామాల దృష్ట్యా ఏఎఫ్ఎస్‌పీఏను తక్షణమే మణిపూర్ నుంచి

- మిగతా 2 లో

'108' సమ్మె బాట

- ఏపీలో 25 నుంచి వైద్య సేవల నిలిపివేతకు సిద్ధం
- ఇప్పటికే నోటీసులిచ్చిన అంబులెన్స్ ఉద్యోగులు
- నిర్వహణ కాంట్రాక్టుపై ఎటూ తేల్చని ప్రభుత్వం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ప్రజలకు ఎల్లవేళలా అత్యవసర వైద్యసేవలందించే 108 ఉద్యోగులు పోరుబాటకు సిద్ధమయ్యారు. తమ సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 25వ నుండి రాష్ట్ర వ్యాప్తంగా సమ్మె చేయాలని నిర్ణయించారు. ఇప్పటికే ఏపీ 108 సర్వీసెస్ కాంట్రాక్ట్ ఎంప్లాయీస్ యూనియన్ నేతలు డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సైవ ట్రస్ట్ అదనపు సీఈవోకు సమ్మె నోటీసు ఇచ్చారు. రాష్ట్ర వ్యాప్తంగా 768 అంబులెన్స్‌లు ఉండగా, మొత్తం 3600 మంది ఉద్యోగులు మెడికల్ టెక్నీషియన్‌లు, పైలెట్‌లుగా పని చేస్తున్నారు. వీరంతా సమ్మె బాటపడితే ప్రజలకు వైద్య సేవల పరంగా తీవ్ర

- మిగతా 2 లో

వరి దిగుబడిలో తెలంగాణ రికార్డు

66.77 లక్షల ఎకరాల్లో 153 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి

విశాలాంధ్ర - హైదరాబాద్: వరి దిగుబడిలో తెలంగాణ నూతన చరిత్ర సృష్టించిందని రాష్ట్ర నీటిపారుదలశాఖ మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఖరీఫ్ లో 66.77 లక్షల ఎకరాల్లో వరి సాగుచేస్తే 153 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి కావడం తెలంగాణ రైతాంగం సాధించిన ఘన విజయమని ఆయన అభివర్ణించారు. ఏఐసీసీ మహారాష్ట్ర ఎన్నికల పరిశీలకుడిగా నియమితులైన ఉత్తమ్ కుమార్ రెడ్డి ... అక్కడ ఎన్నికల ప్రచారంలో పాల్గొంటూనే, ఇక్కడి పరిస్థితులను ఎప్పటికప్పుడు పరిశీలిస్తున్నారు. ఇక్కడ ధాన్యం కొనుగోలు ,, ధాన్యం దిగుబడిని తెలుసుకుంటున్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు మూడు బ్యారేజ్‌లు పనిచేయక పోయినా వరి దిగుబడిలో సాధించిన ఈ రికార్డ్ ప్రభుత్వ పనితీరుకు అద్దంపడుతుందన్నారు. రైతాంగానికి ప్రభుత్వం వెన్నుదన్నుగా నిలుస్తోందనడానికి ఇది నిదర్శనమన్నారు. యావత్ భారతదేశంలోనే ధాన్యం దిగుబడిలో ఇది అరుదైన రికార్డ్ గా పేర్కొన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లోనూ ఇంత దిగుబడి వచ్చిన దాఖలాలు లేవన్నారు. ప్రభుత్వంతో మమైకమైన రైతాంగం అంకిత భావంతో చేసిన సాగుతోటే ఈ విజయం సాధ్యపడిందని, అందుకు చేయూతనందించిన నీటిపారుదల, వ్యవసాయశాఖ అధికారులు,సిబ్బంది పాత్ర శ్లాఘనీయమని అన్నారు.

ప్రాజెక్టులు, నదీ జలాలపై అఖిలపక్షం

- సీపీఐ ఏపీ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ డిమాండ్
- ఇళ్ల స్థలాల కోసం నేడు సచివాలయాల్లో వినతి పత్రాల సమర్పణ
- విద్యుత్ చార్జీలు తగ్గించాలని రేపు విజయవాడలో నిరసన

విశాలాంధ్ర-విజయవాడ: రాష్ట్రంలో సాగునీటి ప్రాజెక్టులు, నీటి కేటాయింపులపై శ్వేతపత్రం విడుదల చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక హనుమాన్‌పేటలోని దాసరి భవన్‌లో సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు, మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్‌తో కలిసి ఆదివారం ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ సాగునీటి ప్రాజెక్టులకు సంబంధించి ఆంధ్రప్రదేశ్‌కి కేంద్ర ప్రభుత్వం తీరని అన్యాయం చేస్తున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఒక వైపు నదుల అనుసంధానం గురించి మాట్లాడుతుంటే... మరోవైపు పోలవరం ప్రాజెక్టు ఎత్తు తగ్గించే ప్రయత్నాలు కేంద్ర ప్రభుత్వం చేస్తున్నదని విమర్శించారు. ఎత్తు తగ్గిస్తే ఆ ప్రాజెక్టు ప్రయోజనాలు దెబ్బతింటాయని అన్నారు. పోలవరం ఎత్తు తగ్గిస్తే రూ.25 వేల కోట్లు కేంద్రానికి ఆదా అవుతుందన్నారు. కుడి, ఎడమ కాల్వల సామర్థ్యాన్ని తగ్గిస్తున్నారని, దీంతో నిధులు ఆదా చేసుకోవడానికి కేంద్ర ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తున్నదని ఆగ్రహం వ్యక్తంచేశారు. కేంద్రం చర్యల వల్ల పోలవరం ప్రాజెక్టు ప్రయోజనాలు దెబ్బ తింటాయన్నారు. ఈ అంశంపై సీఎం చంద్రబాబు స్పష్టత ఇవ్వడం లేదని, కేంద్రం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. కృష్ణా ట్రిబ్యునల్ మొదటి కేటాయింపులు చేసిందన్నారు. విభజన చట్టానికి వ్యతిరేకంగా కేటాయింపులు తగ్గించాలని చూస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిపై పారదర్శకంగా చర్చ జరగాలని సూచించారు. రాష్ట్ర ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని చంద్రబాబు మంచి నిర్ణయం తీసుకుంటారని ఆశిస్తున్నామన్నారు. ఈ విషయంపైన అఖిలపక్ష సమావేశాన్ని నిర్వహించాలని కోరారు. ప్రతిపక్ష పార్టీ ఎమ్మెల్యేలు అసెంబ్లీకి రాని కారణంగా ప్రజా సమస్యలు చర్చకు రావటం లేదన్నారు. అందువల్ల చంద్రబాబు అఖిల పక్ష సమావేశం ఏర్పాటు చేయాలని రామకృష్ణ కోరారు.

ఇళ్ల స్థలాల సాధనకు నేడు సచివాలయాల్లో వ్యక్తిగత అర్జీల సమర్పణ: పేదలకు ఇళ్ల స్థలాల సాధన కోసం సీపీఐ, ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం బృహత్తర కార్యక్రమాన్ని చేపట్టాయని రామకృష్ణ చెప్పారు. పేదలకు పట్టణాల్లో 2 సెంట్లు, గ్రామాల్లో 3 సెంట్లు నివేశన స్థలాలు కేటాయించాలని కోరుతూ ఈ నెల 18వ తేదీన ఇళ్ల లబ్ధిదారులు సచివాలయాల్లో వ్యక్తిగత అర్జీలు సమర్పించాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర వ్యాప్తంగా సీపీఐ శ్రేణులు ఇళ్ల లబ్ధిదారులకు సహకారం అందిస్తారని చెప్పారు. ఇళ్ల స్థలాల అంశంపై గతంలో జగన్‌మోహన్ రెడ్డి ప్రభుతానికి సీపీఐ విన్నవించినా లెక్కచేయలేదన్నారు. ఇసుక, ఇటుక, ఇనుము, కంకర ధరలు పెరిగిన కారణంగా ప్రతి ఇంటి నిర్మాణానికి

- మిగతా 2 లో

ఇదీ లోకం!

ఏ క్షణమైనా కూలొచ్చు!

శిథిలావస్థలో దళితవాడ పాఠశాలలు

8లో

- హాజరు తగ్గి ఒక్కొక్కటిగా మూతబడుతున్న వైనం
- పట్టించుకోని పాలకులు, అధికారులు
- భయాందోళనలో విద్యార్థుల తల్లిదండ్రులు

అటకెక్కిన డిజిటల్ విద్య

విద్యావ్యవస్థలో విప్లవాత్మక సంస్కరణల పేరుతో ప్రవేశపెట్టిన డిజిటల్ విద్య ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా తయారైంది. ప్రభుత్వ బడులు కార్పొరేట్ బడులతో పోటీ పడటం కాదు... కార్పొరేట్ బడులే... ప్రభుత్వ బడులతో పోటీ పడాలి... అన్న లక్ష్యంతో ఎంతో ఆర్భాటంగా సర్కారీ స్కూళ్లకు సరఫరా చేసిన బైజూస్ ట్యాబ్‌లు, ఐఎఫ్‌పీలు (ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్), స్మార్ట్ టీవీలు ఇప్పుడు ఎందుకూ కొరగాకుండా పోతున్నాయి

- అలంకారప్రాయంగా స్మార్ట్ టీవీలు, ఐఎఫ్‌పీలు
- రూ.కోట్లలో ప్రజాధనం వృథా
- ఆచరణ సాధ్యంకాని నిర్ణయాలతో విద్యార్థుల అవస్థలు

8లో

సమన్వయంతో ముందుకెళదాం

ట్రంప్ నాయకత్వంతో కలిసి పనిచేస్తాం

చైనా-అమెరికా బంధం ప్రపంచానికి కీలకం

జో బైడెన్‌తో భేటీలో జిన్‌పింగ్

లిమా: సమన్వయంతో ముందుకెళదామని అమెరికా అధ్యక్షుడు జో బైడెన్‌కు చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ పిలుపునిచ్చారు. పరస్పరం గౌరవించుకుంటూ, సంప్రదింపులు జరుపుకుంటూ మన బంధాన్ని మెరుగు పర్చుకోవడం ద్వారా చైనా, అమెరికా ప్రజలకే కాక మొత్తం మానవాళికి మేలు చేయగలమన్నారు. అమెరికాలో కొత్తగా ఏర్పాటయ్యే డొనాల్డ్ ట్రంప్ ప్రభుత్వంతో కలిసి పనిచేసేందుకు సిద్ధమని చెప్పారు. చైనా, అమెరికా సంబంధాలు గత నాలుగేళ్లుగా ఎన్నో ఒడిదుడుకులను తట్టుకొని నిలబడ్డాయని, ఇందుకు సంప్రదింపులు దోహదమయ్యాయని అన్నారు. సహకారం వల్ల తమ సంబంధాలు తిరిగి గాడిన పడ్డాయన్నారు. అపెక్ శిఖరాగ్ర సదస్సు సందర్భంగా పెరూ రాజధాని లిమాలో జిన్‌పింగ్, జో బైడెన్ భేటీ అయ్యారు. దౌత్యం, భద్రత, వాణిజ్యం, ఆర్థిక వ్యవహారాలు, సైన్యం, వ్యవసాయం, వాతావరణ మార్పు, లా ఎన్‌ఫోర్స్‌మెంట్ తదితర రంగాల్లో రెండు దేశాల సహకారం గురించి మాట్లాడుకున్నారు. గత అనుభవాల నుంచి నేర్చుకున్న పాఠాలతో భవిష్యత్‌ను తీర్చుదిద్దుకోవాలని సంకల్పించారు. సైబర్ క్రైం, తైవాన్, దక్షిణ చైనా సముద్రం, రష్యా తదితర అంశాలపై దాదాపు రెండు గంటలకుపైగా చర్చించారు. అదే సమయంలో సహకారాన్ని పెంచుకునేందుకు ఏడు సూత్రాల విధానాన్ని అనుసరించాలని నిర్ణయించారు. సంబంధాల మెరుగుదలకు ముందుగా వ్యూహాత్మక దృక్పథాన్ని సరి చేసుకోవాలని, మాటలను ఆచరణలో పెట్టాలని, గౌరవాన్ని ఇచ్చిపుచ్చుకోవాలని, రెడ్ లైన్ (పరిధులు) దాటరాదని, సంప్రదింపులు- సహకారాన్ని పెంచుకోవాలని ఏకాభిప్రాయానికి వచ్చారు. తమ ప్రజల ఆకాంక్షలకు ప్రాధాన్యత ఇవ్వాలని, ప్రధాన దేశాల బాధ్యతలనూ తీసుకోవడం కీలక అడుగు కాగలదని జిన్‌పింగ్ చేసిన సూచనలతో బైడెన్ అంగీకరించారు. మానవాళి భవిష్యత్ దృష్ట్యా ప్రపంచ శాంతికి అమెరికా, చైనా బాధ్యత తీసుకోవాలని జిన్‌పింగ్ నొక్కి చెప్పారు. ప్రపంచ ఐక్యతకు తోడ్పడాలని సూచించారు. 45ఏళ్ల దౌత్య బంధం స్ఫూర్తిగా పరస్పరం నమ్మకంతో భాగస్వాములుగా ముందుకెళితే సమస్యల పరిష్కారం సాధ్యమని హితవు పలికారు. ఒకవేళ రెండు దేశాలు శత్రువులుగా మారితే సంబంధాలు చెడిపోవడమే కాకుండా తీవ్ర పరిణామాలు ఎదురవుతాయని జిన్‌పింగ్ హెచ్చరించారు. ఇద్దరికి ప్రయోజనం ఉండే సహకార మార్గం ద్వారా సమ్మిళిత వృద్ధి సాధించగలమన్నారు. చైనా-అమెరికా మధ్య పటిష్ఠ బంధం రెండు దేశాల ప్రజలే కాదు యావత్ మానవాళి భవిష్యత్‌కు కీలకమని నొక్కిచెప్పారు. సుస్థిరమైన చైనా-అమెరికా సంబంధాలకు కట్టుబడి ఉన్నామని జిన్‌పింగ్ అన్నారు. ఉక్రెయిన్ వ్యవహారంలో చైనాది ఎప్పుడు న్యాయ పక్షమే అని చెప్పారు. శాంతి చర్చలను ప్రోత్సహిస్తూ శాంతికి, సైనిక ఉపసంహరణకు యత్నిస్తున్నట్లు తెలిపారు. కొరియా ద్వీపకల్పంలో అస్థిరత, ఘర్షణకు చైనా అనుమతి ఇవ్వబోదని... వ్యూహాత్మక భద్రత, కీలక ప్రయోజనాలకు ముప్పు వాటిల్లే పరిస్థితి ఏర్పడితే చైనా చూస్తూ ఊరుకోబోదని జిన్‌పింగ్ స్పష్టంచేశారు.

చైనాతో యుద్ధాన్ని అమెరికా కోరడం లేదు: బైడెన్

అమెరికా-చైనా సంబంధాలు ప్రపంచంలోని అత్యంత ముఖ్యమైన ద్వైపాక్షిక బంధమని జో బైడెన్ అన్నారు. తమ మధ్య పోటీ ఘర్షణగా మారకుండా చూసుకోవల్సిన బాధ్యత రెండు దేశాల ప్రభుత్వాలపై ఉందని చెప్పారు. తమ దేశం కొత్త ప్రచ్ఛన్న యుద్ధాన్ని కోరుకోవడం లేదని, చైనా వ్యవస్థలో మార్పు తేవాలని అనుకోవడం లేదని బైడెన్ స్పష్టంచేశారు. తైవాన్ స్వాతంత్ర్యానికి మద్దతివ్వాలని చైనాకు వ్యతిరేకంగా తమ మిత్రపక్షాలను క్రియాశీలం చేయడం లేదని అన్నారు. చైనాతో ఘర్షణను అమెరికా కోరడంలేదన్నారు. సంప్రదింపులను మరింత పెంచుకునేందుకు కట్టుబడి ఉన్నట్లు చెప్పారు. నాలుగేళ్లుగా అనేక మార్గాల్లో సంప్రదింపులు జరపడం ద్వారా కలిసి పనిచేసినట్లు తెలిపారు. దౌత్య-భద్రతా బృందాల వ్యూహాత్మక చర్చలతో రెండు దేశాలు పరస్పర అవగాహనతో ముందుకు సాగగలిగాయని బైడెన్ అన్నారు. గతేడాది శాన్‌ఫ్రాన్సిస్కో భేటీ తర్వాత తమ సంబంధాల్లో పురోగతి కనిపిస్తోందన్నారు. 2026లో అపెక్, జీ20 సదస్సుల నిర్వహణలో పరస్పరం సహకరించుకోవడం ద్వారా రెండు దేశాలు సఖ్యత, సమన్వయంతో ముందుకెళ్లగలవని ఆకాంక్షించారు.

లెబనాన్ గ్రామాలు బిక్కుబిక్కు

- బాంబులు, ఫిరంగులతో ఇజ్రాయిల్ దాడులు
- తాజా వైమానిక దాడిలో 11 మంది మృతి
- మృతుల్లో ఒకే కుటుంబం నుంచి ఆరుగురు

బీరుట్: లెబనాన్‌లోని తూర్పు, దక్షిణ ప్రాంతాల్లో ఇజ్రాయిల్ విరుచుకుపడుతోంది. అక్కడి గ్రామాలు, పట్టణాలపై బాంబులు, ఫిరంగులతో వరుస దాడులు చేస్తోంది. దీంతో స్థానికులు బిక్కుబిక్కుమంటున్నారు. ఏ క్షణంలో ఎటు వైపు నుంచి దాడి జరుగుతుందో తెలియక తమ ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని బతుకుతున్నారు. తాజా వైమానిక దాడుల్లో 11 మంది చనిపోగా మరో 11 మంది గాయపడ్డారు. మృతుల్లో ఒకే కుటుంబానికి చెందిన ఆరుగురు ఉన్నారు. ఈ మేరకు ఎన్ఎన్ఏ నివేదించింది. తూర్పు బాల్‌బెక్-హెర్మెల్ గవర్నరేట్‌లోని ఖరీబే గ్రామంలోని ఇంటిపై దాడితో 11 మంది గాయపడ్డారని తెలిపింది. మున్సిపల్ గోడౌన్ లక్ష్యంగా జరిగిన దాడితో నబాతియే మున్సిపాలిటీలో పనిచేసే ఐదుగురు మరణించారని వెల్లడించింది. లెబనాన్‌లోని తూర్పు, దక్షిణ గ్రామాలు, పట్టణాల్లో గత 24 గంటల్లో దాదాపు వంద సార్లు ఇజ్రాయిల్ యుద్ధ విమానాలు, డ్రోన్లు దాడి చేసినట్లు సైనిక వర్గాలు తెలిపాయి. 16 గ్రామాలపై బాంబులు కురిపించగా, పట్టణాలపై 75 ఫిరంగి దాడులు జరిగినట్లు వెల్లడించాయి.

క్షిపణులతో హెజ్బుల్లా దాడులు

ఇజ్రాయిల్‌కు చెందిన మెర్కావా టాంకును ధ్వంసం చేసినట్లు హెజ్బుల్లా ఒక ప్రకటన చేసింది. దక్షిణ లెబనాన్‌లోని ఛమా గ్రామంలో ఆ ట్యాంకుపై క్షిపణితో దాడి చేసినట్లు తెలిపింది. దీంతో ఇజ్రాయిల్ సైనికులు చనిపోయినట్లు వెల్లడించింది. దక్షిణ లెబనాన్‌లోని సరిహద్దు ప్రాంతాల్లోకి చొరబడిన ఇజ్రాయిల్ సైనిక సమూహాలు, వాహనాలు లక్ష్యంగా క్షిపణి దాడులు చేసినట్లు ప్రకటన పేర్కొంది. ఇజ్రాయిల్ స్థావరాలపై రాకెట్లు ప్రయోగించినట్లు తెలిపింది. ఆర్కే, హైఫా, సఫేద్, కిర్యాత్ షోమా నగరాలు సహా ఉత్తర ఇజ్రాయిల్‌లోని కొన్ని నిర్దేశిత లక్ష్యాలపై దాడులు చేసినట్లు హెజ్బుల్లా ప్రకటించింది.

హౌతీల డ్రోన్ దాడులు

యెమన్‌కు చెందిన హౌతీలు బాంబులతో కూడిన డ్రోన్లతో ఇజ్రాయిల్‌లోని దక్షిణ పోర్టు నగరం ఇలియత్‌లోని లక్షిత ప్రాంతంపై దాడి చేశారు. పలస్తీనా, లెబనాన్‌కు మద్దతుగా ఇజ్రాయిల్‌లోని లక్షిత ప్రాంతాలపై డ్రోన్లతో మా సైన్యం దాడి చేసిందని హౌతీ సైన్యం అధికార ప్రతినిధి యాహ్యా సరియా ఒక ప్రకటన చేశారు. తమ ఆపరేషన్ విజయవంతమైందన్నారు. గాజా, దక్షిణ లెబనాన్‌లో ఇజ్రాయిల్ దురాక్రమణ ఆగనంత వరకు తాము వెనక్కి తగ్గేది లేదని ఆయన తేల్చిచెప్పారు. ఎర్ర సముద్రంలో ఇజ్రాయిల్ సంబంధిత నౌకలపై, ఇజ్రాయిల్ నగరాలపై తమ దాడులు కొనసాగుతాయని స్పష్టంచేశారు.

మంటల్లో మణిపూర్

(మొదటిపేజీ తరువాయి)

నిప్పు పెట్టినప్పుడు శాసనసభ్యులు, వారి కుటుంబ సభ్యులు నివాసాల్లో లేరు. ఈ సంఘటనలలో ఇళ్లు పాక్షికంగా తగులబడిపోయాయని పోలీసులు తెలిపారు. అగ్నిమాపక సిబ్బంది ఘటనాస్థలికి చేరుకుని మంటలను ఆర్పి వేశారు. శనివారం రాత్రి నిరసనకారులు ఇంఫాల్ తూర్పు జిల్లాలోని లువాంగ్‌షాంగ్‌బామ్‌లోని ముఖ్యమంత్రి బీరెన్ సింగ్ పూర్వీకుల నివాసంపై కూడా దాడి చేసేందుకు ప్రయత్నించారు. అయితే భద్రతా దళాలు వారిని 100-200 మీటర్ల దూరంలో నిలిపివేశాయి. అస్సాం రైఫిల్స్, బీఎస్ఎఫ్, రాష్ట్ర పోలీసు బలగాలతో సహా భద్రతా సిబ్బంది, నిరసనకారులను చెదరగొట్టడానికి అనేక రౌండ్లు భాష్ప వాయు గోళాలు, రబ్బరు బుల్లెట్లు కాల్చడం ద్వారా సీఎం పూర్వీకుల నివాసంపై దాడిని తిప్పికొట్టినట్లు అధికారులు వివరించారు. తరు వాత ఆందోళనకారులు బీరెన్ సింగ్ నివాసానికి దారితీసే ప్రధాన రహదారిపై టైర్లను తగుల బెట్టారు. వాహనాల రాకపోకలను నిరోధించ డానికి ఇనుప కంచెలను వేశారు. సీఎం పూర్వీకుల ఇంటికి 3-4 కిలోమీటర్ల దూరంలో ఉన్న మంత్రిపుఖ్రీ ప్రాంతంలో రాత్రి 11.00 గంటల వరకు నిరసనలు కొనసాగాయి. అనేక మంది నిరసనకారులు ఇతర నియోజకవర్గాల నుంచి వాహనాల్లో వచ్చారని, సీఎం ప్రాతినిధ్యం వహిస్తున్న హీంగాంగ్ అసెంబ్లీ స్థానం నుంచి కాదని అధికారులు పీటీఐకి చెప్పారు. ఆదివారం ఉదయం కొంత ప్రశాంతత నెలకొన్నప్పటికీ, ఇంఫాల్ లోయలోని మొత్తం ఐదు జిల్లాల్లో ఉద్రిక్తత కొనసాగుతోంది. ఇక్కడ నిరవధిక కర్ఫ్యూ విధించారు. హింసాత్మక నిరసనలు ప్రారంభమైన ఒక రోజు తర్వాత రాష్ట్ర రాజధాని ఇంఫాల్ రోడ్లపై మంటల్లో దగ్ధమైన శిథిలాల కుప్పలు అలాగే ఉన్నాయి. ఇంఫాల్‌లోని కొన్ని ప్రాంతాల్లో భద్రతా బలగాలు పెట్రోలింగ్‌ను ముమ్మరం చేశాయి. శనివారం దాడికి గురైన అనేక శాసనసభ్యుల నివాసాలతో పాటు సచివాలయం, బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యాలయం, రాజ్‌భవన్‌కు వెళ్లే అన్ని ప్రధాన రహదారుల వద్ద భద్రతా బలగాల మోహరింపును పెంచారు. ఇదిలాఉండగా, శనివారం ఆందోళనకారులు బీజేపీ ఎమ్మెల్యే అయిన బీరెన్ సింగ్ అల్లుడు ఆర్.కె.ఇమోతో సహా ముగ్గురు శాసనసభ్యుల ఇళ్లపై దాడులు చేసి, వారి ఆస్తులకు నిప్పు పెట్టారు. మరోవైపు, ఇంఫాల్‌లోని వివిధ ప్రాంతాల్లో నిరసనకారులను చెదరగొట్టడానికి భద్రతా దళాలు భాష్పవాయు గోళాలను ప్రయోగించినట్లు పోలీసులు చెప్పారు. ఆందోళనకారులు ఇళ్లను ముట్టడించిన మంత్రుల్లో సపమ్ రంజన్, ఎల్.సుసీంద్రో సింగ్, వై.ఖేమ్‌చంద్ ఉన్నారని ఒక అధికారి తెలిపారు. కాగా, అసెంబ్లీ భవనానికి కేవలం 200 మీటర్ల దూరంలోని తంగ్‌మీబాండ్ ప్రాంతంలోని రహదారి మధ్యలో ఆందోళనకారులు టైర్లకు నిప్పు పెట్టారు. రాజ్‌భవన్, సచివాలయంతో సహా అనేక భవనాల పైకి వెళ్లేందుకు ప్రయత్నించిన ఆందోళనకారులను చెదరగొట్టేందుకు కీసంపత్ వంతెన వద్ద టియర్ గ్యాస్ షెల్స్ ప్రయోగించారని పోలీసులు తెలిపారు. రాత్రి సమయంలో జిరిబామ్ పట్టణంలో కనీసం రెండు చర్చిలు, మూడు ఇళ్లకు దుండగులు నిప్పు పెట్టారని అధికారులు తెలిపారు. ఇంఫాల్ లోయలోని ఇంఫాల్ తూర్పు, పశ్చిమ, విష్ణుపూర్, తౌబాల్, కక్చింగ్ జిల్లాల్లో 'శాంతిభద్రతల పరిస్థితి అభివృద్ధి చెందడం' కారణంగా నిరవధిక కాలం పాటు కర్ఫ్యూ విధించినట్లు ఆయన చెప్పారు. రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేల నివాసాలను ఆందోళనకారులు ముట్టడించిన నేపథ్యంలో రాష్ట్ర యంత్రాంగం ఏడు జిల్లాల్లో ఇంటర్‌నెట్ సేవలను తాత్కాలికంగా నిలిపివేసినట్లు మరో అధికారి వివరించారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి వినీత్ జోషి 'ప్రస్తుతం ప్రభావితమైన ఇంఫాల్ పశ్చిమ, ఇంఫాల్ తూర్పు, విష్ణుపూర్, తౌబాల్, కక్చింగ్, కాంగ్‌పోక్పి, చురచంద్‌పూర్ జిల్లాల ప్రాదేశిక అధికార పరిధిలో' శనివారం సాయంత్రం 5.15 నుంచి రెండు రోజుల పాటు ఇంటర్‌నెట్, మొబైల్ డేటా సేవలను తాత్కాలికంగా నిలిపివేయాలని ఆదేశించారు.

మణిపూర్ ప్రభుత్వానికి 24 గంటల అల్టిమేటం

ఇంఫాల్ లోయలోని పౌర సమాజ సంస్థలకు ప్రాతినిధ్యం వహిస్తున్న అత్యున్నత సంస్థ మణిపూర్ సమగ్రతపై సమన్వయ కమిటీ (సీవోసీవోఎంఐ) మిలిటెంట్లపై 24 గంటల్లో సైనిక చర్య తీసుకోవాలని డిమాండ్ చేసింది. కమిటీ ప్రతినిధి ఖురైజం అథౌబా ఎన్‌డీటీవీతో మాట్లాడుతూ 'రాష్ట్రాల ప్రతినిధులందరూ, ఎమ్మెల్యేలందరూ కలిసి కూర్చుని ఈ సంక్షోభాన్ని వీలైనంత త్వరగా పరిష్కరించడానికి కొన్ని నిర్ణయాత్మక చర్య తీసుకోవాలి. మణిపూర్ ప్రజలు సంతృప్తి చెందేలా వారు ఎలాంటి నిర్ణయం తీసుకోకపోతే. అప్పుడు ప్రజల అసంతృప్తి వారు చవిచూస్తారు.

అన్ని సాయుధ సమూహాలపై కొన్ని నిర్ణయాత్మక చర్యలు, సైనిక అణిచివేతలను తీసుకోవాలని మేము భారత ప్రభుత్వానికి, మణిపూర్ ప్రభుత్వానికి 24 గంటల అల్టిమేటం విధించాం' అని తెలిపారు.

23 మందిని అరెస్టు చేసిన పోలీసులు

జాతి ఘర్షణలతో అట్టుడికిపోతున్న మణిపూర్‌లో ఆదివారం 23 మందిని పోలీసులు అరెస్టు చేశారు. కర్ఫ్యూను ధిక్కరించి ఇటీవలి హింసాత్మక హత్యలకు వ్యతిరేకంగా వందలాది మంది ప్రదర్శనలు నిర్వహించడంతో పాటు శాసనసభ్యులు, మంత్రుల ఇళ్లను తగులబెట్టారు. 'ఈ రోజు కొంత ప్రశాంతంగా ఉంది. అయితే పరిస్థితిని నిశితంగా పరిశీలిస్తున్నాం' రాష్ట్ర పోలీసు అధికారి రాయిటర్స్ వార్తా సంస్థకు తెలిపారు. ఆదివారం తెల్లవారుజామున బందీలుగా ఉన్న కుటుంబానికి చెందినదిగా భావిస్తున్న మహిళ మృతదేహం నదిలో కనుగొన్నారు. ఇద్దరు పిల్లలతో సహా మరో ముగ్గురు మృతదేహాలను శుక్రవారం వెలికితీశారు. కాగా వారి గుర్తింపు కొనసాగుతోందని, వారు తప్పిపోయిన కుటుంబానికి చెందిన వారు అయి ఉండవచ్చని జిరిబామ్‌కు చెందిన జిల్లా పరిపాలన అధికారి రాయిటర్స్‌తో చెప్పారు. ఆదివారం ఆ ప్రాంతం నుంచి ఒక కుకీ వ్యక్తి మృతదేహాన్ని కనుగొన్నారు.

అయితే అధికారులు మరణానికి గల కారణాన్ని ఇంకా నిర్ధారించలేదు. అయితే ఇది 'హింసతో ముడిపడి ఉండవచ్చు' అని వివరించారు. గత వారం కుకీ వర్గానికి చెందిన 31 ఏళ్ల మహిళ సజీవ దహనం కావడంతో ఉద్రిక్తత నెలకొంది. కుకీ గ్రూపులు ఈ చర్యకు మైతేయి మిలిటెంట్లే కారణమని ఆరోపించారు.

తక్షణమే ఏఎఫ్ఎస్‌పీఏ వెనక్కి

(మొదటిపేజీ తరువాయి)

ఉపసంహరించాలని, ముఖ్యమంత్రి రాజీనామా చేయాలని డిమాండ్ చేసింది. శాంతి నెలకొల్పేందుకు, న్యాయానికి హామీ ఇచ్చేందుకు, మణిపూర్ ప్రజల్లో విశ్వాసాన్ని పునరుద్ధరించేందుకుగాను అన్ని రాజకీయ పార్టీలతో కలిసి రాజకీయ పరిష్కారం చూపడం కోసం ప్రభుత్వం చర్యలు తీసుకోవడం అత్యవసరమని సీపీఐ సూచించింది.

ఇదేం వ్యూహం?

వైసీపీ ద్వంద్వ వైఖరి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: వైసీపీ రాజకీయంగా ద్వంద్వ వైఖరి అవలంబిస్తోంది. ప్రతిపక్ష హోదా ఇస్తేనే సభకు వస్తామంటూ అసెంబ్లీ సమావేశాలకు ఆ పార్టీ అధినేత జగన్‌తోపాటు మిగిలిన 10మంది ఎమ్మెల్యేలు దూరంగా ఉన్నారు. శాసన మండలికి మాత్రం వైసీపీ ఎమ్మెల్సీలు హాజరవుతున్నారు. ఈ నెల 11వ తేదీ నుంచి అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు ప్రారంభమవగా, తొలి రోజు బడ్జెట్‌తోనే ముగిసింది. 13వ తేదీ నుంచి తిరిగి అసెంబ్లీ, శాసన మండలి సమావేశాలు ప్రారంభమయ్యాయి. ఇప్పటివరకు జగన్ అసెంబ్లీకి వెళ్లలేదు. ఇకముందు కూడా వెళ్లే పరిస్థితులు కన్పించడంలేదు. సార్వత్రిక ఎన్నికల్లో ఓటమి అనంతరం ప్రమాణ స్వీకారం చేసే సమయానికి తన ఎమ్మెల్యేలతో కలిసి సభలో కాలుపెట్టిన జగన్... ఆ తర్వాత ఓటాన్ అకౌంట్ బడ్జెట్ సమయంలో గవర్నరు ప్రసంగం వరకు ఉండి, నిరసన తెలిపి..దిల్లీ వెళ్లి ధర్నా చేశారు. ఆ తర్వాత నుంచి అసెంబ్లీ సమావేశాలకు వెళ్లకుండా మీడియా సమావేశాల ద్వారా కూటమి ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్నారు. అసెంబ్లీలో ప్రధాన ప్రతిపక్ష హోదా కావాలంటే పది శాతం... అనగా 18 మంది ఎమ్మెల్యేలు కలిగి ఉండాల్సి ఉండగా... వైసీపీకి 11మందే ఉన్నారు. దీంతో ప్రతిపక్ష హోదా ఇచ్చేందుకు స్పీకర్ అనుమతించలేదు. వైసీపీ మాత్రం అసెంబ్లీలో కూటమి(టీడీపీ, బీజేపీ, జనసేన) తర్వాత తామే ప్రతిపక్షమని, సాంకేతికంగా చూస్తే సంఖ్యా బలంతో సంబంధం లేకుండా ప్రతిపక్ష హోదా తమకే వస్తుందని పట్టుపడుతోంది. ఆ మేరకు స్పీకర్‌కు ఇప్పటికే జగన్ లేఖ రాశారు. దీనిపై హైకోర్టును జగన్ ఆశ్రయించారు కూడా. దానిపై స్పీకర్‌కు నోటీసులు ఇచ్చింది. ఇప్పటికప్పుడే ఈ అంశం తేలే పరిస్థితులు లేవు. ఈ అసెంబ్లీ సమావేశాలు సగం రోజులు పూర్తయ్యాయి. ఇంకా మిగిలిన రోజుల్లోనూ అసెంబ్లీలోకి ఆ పార్టీ అధినేత జగన్, ఎమ్మెల్యేలు హాజరయ్యే పరిస్థితులు లేవు. ఇప్పటికే జగన్ ఒక విడత మీడియా సమావేశం నిర్వహించారు. మిగిలిన ఎమ్మెల్యేలు బృందాల వారీగా పార్టీ కార్యాలయంలో ప్రెస్‌మీట్లతో ప్రభుత్వ పరిపాలన సరిగ్గా లేదంటూ, సూపర్-6అమలు చేయకుండా చంద్రబాబు దగా చేస్తున్నారంటూ మీడియా వేదికగా చెబుతున్నారు. మరోసారి మీడియా ముందుకు జగన్ వచ్చే అవకాశముంది. శాసన మండలిలో మాత్రం కూటమి పార్టీల కంటే వైసీపీ సభ్యులు అధికంగా ఉన్నారు.

'108' సమ్మె బాట

(మొదటిపేజీ తరువాయి)

నష్టం కలిగే ప్రమాదం ఉంది. ప్రభుత్వాలు మారినప్పుడల్లా వీటి నిర్వహించే కాంట్రాక్ట్ సంస్థల మార్పుల నేపథ్యంలో సిబ్బందికి ఉద్యోగ భద్రత లేకుండా పోయింది. దీనికి తోడు సకాలంలో వీరికి వేతనాలు అందడం లేదు. ఈ నేపథ్యంలో 108 సర్వీసులను ప్రభుత్వమే నిర్వహించాలని...ఉద్యోగులకు 8 గంటల పని విధానాన్ని అమలు చేయాలని...వైద్య ఆరోగ్య శాఖలో భర్తీ చేసే ఉద్యోగాల్లో 108లో పని చేస్తున్న వారికి వెయిటేజీ ఇవ్వాలని...మరణించిన 108 అంబులెన్స్ ఉద్యోగులకు ఎక్స్ గ్రేషియా రూ.25 లక్షలు ఇవ్వడం తదితర డిమాండ్లతో సమ్మెకు సిద్ధమయ్యారు. ఈ మేరకు జిల్లాల్లో డీఎంహెచ్ఓలు, డీఆర్వో, మండల స్థాయి అధికారులకు సమ్మె నోటీసులు ఇచ్చారు. గత వైసీపీ ప్రభుత్వం అంబులెన్స్ ల నిర్వహణ కాంట్రాక్ట్‌ను జీవీకే సంస్థ నుండి తొలగించి అరబిందో సంస్థకు అప్పగించింది. జీవీకే సంస్థకు 2020 డిసెంబర్ వరకూ కాలపరిమితి ఉండగా, 10 నెలల ముందే ఒప్పందాన్ని రద్దు చేయగా, అరబిందో సంస్థ కాంట్రాక్ట్‌ను దక్కించుకుంది. అప్పట్లోనే ఈ ఒప్పందంపై టీడీపీ విమర్శలు చేసింది. దాదాపు రూ.300 కోట్ల స్కామ్ జరిగిందని ఆరోపించింది. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఏజెన్సీ మార్పునకు ప్రభుత్వం చర్యలు చేపట్టే అవకాశం ఉండటంతో ముందుగానే 108 అంబులెన్స్‌లు, 104 వాహనాల నిర్వహణ నుంచి తాము తప్పుకుంటామని, తమ స్థానంలో రెండు సంస్థలకు సబ్ కాంట్రాక్ట్ ఇవ్వండంటూ అరబిందో సంస్థ ... ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్ట్ సీఈవోకు లేఖ రాసింది. అయితే దీనిపై ప్రభుత్వం ఇంత వరకూ ఎటువంటి నిర్ణయం తీసుకోలేదు. మరో పక్క ఆర్థిక ఇబ్బందులు, నిర్వహణ సమస్యలు సవాల్‌గా మారాయి. దాదాపు 90 వాహనాలు ఇప్పటికే రిపేర్లలో ఉన్నాయి. ఇంధనం లేదన్న కారణంగా గత నెలలో 140 వాహనాలను ఆపినట్లు వార్తలొచ్చాయి. 108 అంబులెన్స్ సేవలపై ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని ఏపీ పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల తీవ్రంగా తప్పుబట్టారు. దివంగత సీఎం వైఎస్ఆర్ దూర దృష్టికి నిదర్శనమైన 108 వ్యవస్థ దేశంలో ఎన్నో రాష్ట్రాలకు ఆదర్శమైందని, లక్షలాది మంది ప్రాణాలు కాపాడిన సంజీవని లాంటి వ్యవస్థకు ప్రభుత్వాలు మారినప్పుడల్లా గ్రహణం పడుతోందని విమర్శించారు. నిర్వహణ సంస్థ మారితే తమకు రావాల్సిన పాత బ కాయిలు రాకుండా పోతాయేమోనని కూడా ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారు. అత్యవసర సేవలు అందించే 108 అంబులెన్స్‌ల విషయంలో ప్రభుత్వం ఎటువంటి చర్యలు చేపడుతుందనేది చర్చనీయాంశమైంది. వైసీపీ రాజ్యసభ సభ్యుడు విజయసాయి రెడ్డి అల్లుడికి చెందిన సంస్థ అయిన అరబిందోకు గత ప్రభుత్వం 108 అంబులెన్స్, 104 వాహనాల నిర్వహణ బాధ్యత అప్పగించిందని, ఇందులో పెద్ద ఎత్తున స్కామ్ జరిగిందని టీడీపీ ఆరోపించిన కారణంగా ఇప్పుడు ఆ సంస్థ విషయంలో ఏ విధమైన చర్యలు తీసుకుంటుంది? సమ్మె నోటీసులు ఇచ్చిన నేపథ్యంలో ఉద్యోగులకు ప్రభుత్వం ఏ విధంగా భరోసా ఇస్తుంది? అనేది తెలియాల్సి ఉంది.

ప్రాజెక్టులు, నదీ జలాలపై అఖిలపక్షం

(మొదటిపేజీ తరువాయి)

రూ.5లక్షలు ఇవ్వాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లబ్ధిదారులను భారీ ఎత్తున సమీకరించి అన్ని సచివాలయాల్లో పెద్ద సంఖ్యలో అర్జీలు సమర్పించేలా సీపీఐ నాయకత్వం బాధ్యత తీసుకోవాలన్నారు. వారం రోజుల పాటు ఈ కార్యక్రమం కొనసాగుతుందన్నారు.

విద్యుత్ చార్జీలను వ్యతిరేకిస్తూ రేపు విజయవాడలో నిరసన:

ఎఫ్‌పీపీసీఏ చార్జీల పేరిట ప్రజలపై రూ. 6,072 కోట్ల భారాన్ని విధిస్తూ ఏపీ విద్యుత్ రెగ్యులేటరీ కమిషన్ జారీ చేసిన ఉత్తర్వును వెంటనే ఉపసంహరించాలని రామకృష్ణ డిమాండ్ చేశారు. మరో రూ.11820 కోట్ల విద్యుత్ సర్దుబాటు చార్జీల పెంపుపై ఏపీఈఆర్‌సీ విధించిన అభ్యంతరాల గడువును నవంబర్ 19 వరకు ఇచ్చిందని, సీపీఐ తన అభ్యంతరాలను తెలియజేస్తుందన్నారు. ఎన్నికల సందర్భంగా చంద్రబాబు నాయుడు తాము అధికారంలోకొస్తే ఎట్టి పరిస్థితుల్లోనూ విద్యుత్ చార్జీలను పెంచబోమని, వీలైతే తగ్గించేందుకు ప్రయత్నిస్తామని చెప్పి ఇప్పుడు అందుకు భిన్నంగా దాదాపు రూ.18 వేల కోట్ల విద్యుత్ భారాలను రాష్ట్ర ప్రజలపై మోపేందుకు సిద్ధమవ్వడం విచారకరమన్నారు. ఏపీ అసెంబ్లీ సమావేశాల సందర్భంగా నవంబర్ 19న పది వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో విజయవాడ నగరంలో భారీ ఎత్తున నిరసన కార్యక్రమం చేపట్టనున్నట్లు చెప్పారు. ఈ నెల 20 నుండి 30 వరకు రాష్ట్ర వ్యాప్తంగా సభలు, సమావేశాలు నిర్వహించి, విద్యుత్ చార్జీల భారాలపై ప్రజలను చైతన్యపరచనున్నట్లు వివరించారు. నిత్యావసరాల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయని, ముఖ్యమంత్రి, మంత్రులు చెప్పినా ఎవరూ ధరలు తగ్గించటం లేదన్నారు. మంత్రుల మాటలు ఎవరూ ఖాతర్ చేయటం లేదన్నారు. ఉచిత ఇసుక పథకాన్ని నిర్వీర్యం చేశారని చెప్పారు. అధికార పార్టీ ఎమ్మెల్యేలు ఇసుకను నల్లబజారుకి తరలించి అధిక రేట్లకు విక్రయిస్తున్నారని ఆగ్రహం రు. ధరల నియంత్రణకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

ఖనిజ సంపదపైనే బీజేపీ కన్ను

(మొదటిపేజీ తరువాయి)

దళితులు, వెనుకబడిన వర్గాలకు న్యాయం జరగాలంటే భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. జార్ఖండ్ తరహా లోనే తెలంగాణ ప్రజలు... మా నీళ్లు, నిధులు, నియామకాలు మాకే కావాలని సుదీర్ఘ పోరాటం చేసి ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించుకున్నారని వివరించారు. పదేళ్లు పాలించిన గత పాలకులు రాష్ట్ర సంపద, వనరులను దోచుకున్నారని ధ్వజమెత్తారు. అధికారంలోకి రాగానే ఆరు గ్యారెంటీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నామని చెప్పారు. గృహ జ్యోతి పథకం ద్వారా 200 యూనిట్ల వరకు పేదలకు ఉచితంగా విద్యుత్తును సరఫరా చేస్తున్నామని తెలిపారు. రూ.500 కే గ్యాస్ సిలిండర్ ఇస్తున్నామని, మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, రాజీవ్ ఆరోగ్యశ్రీ పరిమితిని ఐదు లక్షల నుంచి 10 లక్షలకు పెంచామని, రైతులకు ఏకకాలంలో రెండు లక్షల రుణమాఫీ పథకాలు చేపట్టామని వివరించారు. జార్ఖండ్ లో మహాకూటమి అధికారంలోకి రాగానే తెలంగాణ తరహాలో ఏడు గ్యారెంటీలను అమలు చేస్తామని తెలిపారు. సమిష్టిగా ప్రచారం చేసి అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. నిజాం అన్సారి, మహేష్ సింగ్, గులాబ్ హుస్సేన్, స్థానిక కాంగ్రెస్ నేతలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

నిరుద్యోగుల కల నెరవేరేనా?

▸ గ్రూప్-1 నియామకాల ప్రక్రియకు ఆటంకం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఏపీపీఎస్సీ) గ్రూప్-1 నియామకాలు చేపట్టాలని నిరుద్యోగులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు. గత ప్రభుత్వ తప్పిదాలతో నియామక ప్రక్రియకు ఆటంకం ఏర్పడింది. అదే సమయంలో అభ్యర్థులకు మేలు చేస్తామంటూ చంద్ర బాబు ప్రభుత్వం హామీ ఇచ్చినప్పటికీ... దాని అమలుకు కార్యాచరణ చేపట్టలేదు. ప్రభుత్వం అధికారం చేపట్టి దాదాపు ఆరు నెలలు పూర్తవుతున్నా... గ్రూప్-1 మెయిన్స్‌పై కదలిక లేదు. అక్రమ దారుల్లో ఎంపికైన అభ్యర్థులను కోర్టు తీర్పును అనుసరించి తొలగిస్తామని ఎన్నికల ముందు అప్పటి ప్రతిపక్షనేత చంద్రబాబు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. దాని ద్వారా నిరుద్యోగులు ఎంతో ఉత్సాహంతో ఎన్నికల్లో కూటమి ప్రభుత్వానికి మద్దతిచ్చారు. గ్రూప్-1 మెయిన్స్‌లో నెలకొన్న తప్పిదాలతో మార్చి 13, 2024లో గ్రూప్-1 మెయిన్స్‌ను రద్దు చేసి ఆరు నెలల్లోగా నియామకాలను పూర్తిచేయాలని హైకోర్టు సింగిల్ బెంచి తీర్పునిచ్చింది. ఆ తీర్పు ఆధారంగా మార్చి 15వ తేదీన ఏపీపీఎస్సీ అవకతవకలపై అప్పటి ప్రతిపక్షనేత చంద్రబాబు... ఏపీపీఎస్సీ అవకతవకలపై గత ప్రభుత్వ తీరును ఎండగడుతూ, నిరుద్యోగులకు మద్దతుగా పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. హైకోర్టు తీర్పుపై చంద్రబాబు హర్షం వ్యక్తం చేస్తూ, గ్రూప్-1 రీమెయిన్స్ చేస్తామని హామీ ఇచ్చారు. వైసీపీ ప్రభుత్వ వైఖరిని తూర్పారబట్టారు. హైకోర్టు డివిజన్ బెంచ్‌లో గత ప్రభుత్వం వేసిన అప్పీల్‌ను ఖండిస్తూ నిరుద్యోగులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. అనుకున్నట్లుగానే నిరుద్యోగుల మద్దతుతో చంద్రబాబు ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. జులై 23న జరిగిన మొదటి అసెంబ్లీ సమావేశాల్లో బుచ్చయ్య చౌదరితోపాటు కొందరు సీనియర్ ఎమ్మెల్యేలు గ్రూప్-1 మెయిన్స్ అంశాన్ని సభలో ప్రశ్నించారు. గ్రూప్-1లో జరిగిన అక్రమాలపై కమిటీ వేశామని, ఆగస్టు చివరి వరకు నివేదికకు గడువు ఉందని, దాని ఆధారంగా చర్యలు తీసుకుని నిరుద్యోగులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.

రాజకీయ జోక్యం గొడ్డలిపెట్టు

(మొదటిపేజీ తరువాయి)

పనులు సక్రమంగా జరగలేవన్నారు. ఇతరులు ఏమనుకుంటారన్నది పరిగణించకుండా జడ్జిలు తమకు అర్థమైన చట్టం... వాస్తవాలు, సాక్షాల ఆధారంగా కేసులను నిర్ణయించడం వంటిదే జుడిషియల్ స్వతంత్రతని చెప్పారు. న్యాయపరమైన దుర్వ్యహారానికి, అసమర్థతకు జుడిషియల్ స్వతంత్రత కవచం కాబోదని జస్టిస్ నాగరత్న స్పష్టంచేశారు.

పాఠశాలల పనివేళల పొడిగింపు?

(మొదటిపేజీ తరువాయి)

ప్రతిపాదనలు రూపొందించింది. దీంతో ఉప విద్యాశాఖ అధికారులందరూ ప్రతి మండలంలోని ఒక ఉన్నత పాఠశాలలో సవరించిన సమయాలను అమలు చేసేలా చర్యలు తీసుకోవాలని పాఠశాల విద్యాశాఖ ఆదేశించింది. అనంతరం విద్యా కమిటీలు, తల్లిదండ్రులతో అభిప్రాయాలను సేకరించి సవరించిన సమయాలను పూర్తి స్థాయిలోకి అమలులోకి తెచ్చేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు. పాఠశాల విద్యాశాఖ ఆదేశాలతో పొట్టిశ్రీరాములు నెల్లూరుజిల్లా డీఈవో పి.బాలాజీరావు ఈ నెల 16వ తేదీన సర్కులర్ జారీజేశారు. ఇందులో ఉన్నత పాఠశాలలో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పిరియడ్ల సమయం అమలులో ఉంచారు. ఫస్ట్ బెల్ ఉదయం 9 గంటలకు, సెకండ్ బెల్ 9.05, స్కూల్ అసెంబ్లీ 9.05 నుంచి 9.25 వరకు (20 నిముషాలు) ఉంటుంది. మొదటి పిరియడ్ 9.25 నుంచి 10.15(50 నిముషాలు), రెండో పిరియడ్ 10.15 నుంచి 11 వరకు, ఆ తర్వాత విరామం 11 నుంచి 11.15 (15 నిముషాలు) వరకు కొనసాగుతుంది. మూడో పిరియడ్ 11.15 నుంచి 12 గంటలు, నాలుగో పిరియడ్ 12 నుంచి 12.45 వరకు నిర్వహిస్తారు. మధ్యాహ్నం భోజన విరామం 12.45 నుంచి 1.45(గంటపాటు) ఉంటుంది. ఆ తర్వాత ఐదో పిరియడ్ 1.45 నుంచి 2.30, ఆరో పిరియడ్ 2.30 నుంచి 3.15, స్వల్ప విరామం-3.15 నుంచి 3.30, ఏడో పిరియడ్ 3.30 నుంచి 4.15, ఎనిమిదో పిరియడ్ 4.15 నుంచి 5 గంటల వరకు పైలెట్ ఉన్నత పాఠశాలల్లో నిర్వహించాలని నిర్ణయించారు.

ప్రధాని మోదీకి నైజీరియా పురస్కారం

(మొదటిపేజీ తరువాయి)

భారత ప్రధాని మాట్లాడుతూ... "నైజీరియా 'గ్రాండ్ కమాండర్ ఆఫ్ ది ఆర్డర్ ఆఫ్ ది నైజర్' అవార్డుతో సత్కరించడం గౌరవంగా ఉంది. నేను దీన్ని చాలా వినయంతో స్వీకరిస్తున్నాను. భారతదేశంలోని 140 కోట్ల మంది ప్రజలకు, భారత్-నైజీరియా మైత్రీ బంధానికి అంకితం చేస్తున్నాను" అన్నారు. భారత్-నైజీరియా మధ్య సంబంధాలు పరస్పర సహకారం, సద్భావన, గౌరవంపై ఆధారపడి ఉన్నాయని అన్నారు. 'రెండు శక్తివంతమైన ప్రజాస్వామ్య దేశాలుగా, మేము రెండు దేశాల ప్రజల శ్రేయస్సు కోసం కలిసి పని చేస్తున్నాము' చెప్పారు. నైజీరియా ప్రభుత్వానికి, ప్రజలకు ప్రధాని ధన్యవాదాలు తెలిపారు. నైజీరియా అధ్యక్షుడు బొలా అహ్మద్ టినుబుతో జరిగిన సమావేశంలో ఇరు దేశాల మధ్య పరస్పర సహకారాన్ని మరింత పటిష్టంగా, విస్తృతంగా మార్చడంపై వివరంగా చర్చించినట్లు మోదీ తెలిపారు. ఆర్థిక, ఇంధనం, వ్యవసాయం, భద్రత, ఫిన్‌టెక్, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు, సాంస్కృతిక రంగాల్లో కొత్త అవకాశాలను గుర్తించామని చెప్పారు. నైజీరియాతో వ్యూహాత్మక భాగస్వామ్యానికి భారత్ అధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. రక్షణ, ఇంధనం, వాణిజ్యం సహా పలు రంగాల్లో నైజీరియాతో సంబంధాలను పెంపొందించేందుకు భారత్ కృషి చేస్తుందన్నారు. ఉగ్రవాదం, వేర్పాటువాదం, పైరసీ, మాదకద్రవ్యాల అక్రమ రవాణా ప్రధాన సవాళ్లుగా ఉన్నాయి. వాటిని ఎదుర్కోవడానికి భారత్, నైజీరియా కలిసి పనిచేస్తూనే ఉంటాయన్నారు.

జిల్లాలో గ్రూప్ -3 పరీక్ష ప్రశాంతం

కలెక్టర్ జితేష్, ఎస్పీ రోహిత్

విశాలాంధ్ర - కొత్తగూడెం క్రైమ్ : భద్రాద్రి కొత్తగూడెం ఏజెన్సీ జిల్లాలో గ్రూప్ 3 పరీక్షలు ఆదివారం ప్రశాంతంగా ముగిశాయి. పరీక్ష కేంద్రాల వద్ద పోలీసులు కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాటు చేయడంతో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగలేదు. కొత్తగూడెం ఎస్సార్ ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీలో జరిగిన పరీక్షల ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ తనిఖీ చేశారు. పాల్వంచలోని డి ఎ వి స్కూల్, అబ్దుల్ కలాం కళాశాల, సింగరేణి మహిళా డిగ్రీ కళాశాలలో కేంద్రాలను కూడా పరిశీలించారు. జిల్లా ఎస్పీ రోహిత్ రాజు రుద్రంపూర్‌లోని సెయింట్ జోసెఫ్, మరి కొన్ని కేంద్రాలను సందర్శించి పరీక్షల సరళిని పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్, ఎస్పీలు మాట్లాడుతూ పరీక్ష సమయంలో ఎటువంటి పొరపాట్లకు తావు లేకుండా పకడ్బందీగా నిర్వహించాలని అధికారులు, సిబ్బందిని ఆదేశించారు. అభ్యర్థులను క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాతనే పరీక్ష కేంద్రాలకు అనుమతించారన్నారు. పరీక్ష కేంద్రాల్లోకి ఎటువంటి ఎలక్ట్రానిక్ వస్తువులకు అనుమతించకుండా జాగ్రత్తలు పాటించారు. అభ్యర్థులు అరగంట ముందుగానే కేంద్రాలకు చేరుకోవాల్సి ఉండగా కొందరికి ఆలస్యమై వెనుక తిరిగి వెళ్లినట్టు తెలిసింది. విద్యార్థుల హాజరు శాతాన్ని అధికారులు అడిగి కలెక్టర్ తెలుసుకున్నారు. హాల్ టికెట్ పొందిన కొందరు అభ్యర్థులు పరీక్షకు గైర్హాజరయ్యారని తెలిపారు.

గ్రూప్-3 పరీక్షలు ప్రశాంతం: కలెక్టర్

విశాలాంధ్ర - నల్లగొండ బ్యూరో : నల్గొండ జిల్లాలో మొదటి రోజు నిర్వహించిన గ్రూప్ -3 పరీక్షలు ప్రశాంతంగా ముగిసినట్లు జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి తెలిపారు. గ్రూప్ -3 పరీక్షలు ప్రారంభమైన వెంటనే ఆమె నల్గొండ జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన పలు పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు. ముందుగా సెయింట్ ఆల్ఫాన్సెస్ పాఠశాలలో ఏర్పాటుచేసిన పరీక్ష కేంద్రాన్ని సందర్శించి అక్కడ పరీక్షకు హాజరైన, గైర్హాజరైన అభ్యర్థుల వివరాలను పరీక్ష కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్ డి.రాంబాబుతో అడిగి తెలుసుకున్నారు. కాగా ఈ కేంద్రంలో 528 మంది అభ్యర్థులను కేటాయించగా జిల్లా కలెక్టర్ కేంద్రాన్ని సందర్శించే సమయానికి సగానికి పైగా గైర్హాజరైనట్లు ఆయన తెలిపారు.తర్వాత జిల్లా కలెక్టర్ డాన్ బాస్కో హై స్కూల్లో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాన్ని సందర్శించి తనిఖీ చేశారు. ఈ కేంద్రానికి 348 మంది అభ్యర్థులను కేటాయించగా, 155 మంది పరీక్షకు హాజరుకాగా, 193 మంది గైర్హాజరయ్యారు. ఈ వివరాలను చీఫ్ సూపరింటీండెంట్ రాయప్ప కలెక్టర్‌కు తెలియజేశారు. అనంతరం జిల్లా కలెక్టర్ ఎన్జీ కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాన్ని కూడా పరిశీలించారు. అక్కడ పరీక్ష కేంద్రం వివరాలను చీఫ్ సూపరింటెండెంట్ అనిల్ కుమార్ జిల్లా కలెక్టర్ కు తెలియజేస్తూ 480 మందికి గాను 410 మంది హాజరయ్యారని, 70 మంది గైర్హాజరయ్యారని తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఎన్జీ కళాశాలలో ఏర్పాటుచేసిన గ్రూప్- 3 పరీక్షల స్ట్రాంగ్ రూమును తనిఖీ చేశారు. మధ్యాహ్నం పరీక్ష పూర్తయిన తర్వాత మిర్యాలగూడ, నల్గొండ పట్టణాలలో నిర్వహించిన గ్రూప్-3 పరీక్షల వివరాలను ఆమె తెలియజేస్తూ నల్గొండ పట్టణంలో ఏర్పాటు చేసిన 35 పరీక్ష కేంద్రాలకు ఉదయం 12216 మంది అభ్యర్థులను కేటాయించగా, పరీక్షకు 8810 మంది అభ్యర్థులు హాజరయ్యారని, 3406 మంది గైర్హాజరయ్యారని తెలిపారు. మధ్యాహ్నం పరీక్షకు 12216 మందికి గాను, 8776 మంది హాజరుకాగా, 3440 మంది గైర్హాజరయ్యారని వెల్లడించారు. ఇక మిర్యాలగూడ పట్టణంలో ఏర్పాటు చేసిన 28 పరీక్ష కేంద్రాలకు మొత్తం 7798 మంది అభ్యర్థులను కేటాయించగా, ఉదయం పరీక్షకు 2,934 మంది హాజరు కాగా, 4864 మంది గైరహాజరయ్యారు. మధ్యాహ్నం పరీక్షకు మిర్యాలగూడ పట్టణంలో 7798 కి గాను, 2930 మంది హాజరు కాగా, 4868 మంది గైర్హాజరైనట్లు కలెక్టర్ వెల్లడించారు.మొత్తానికి మొదటి రోజు గ్రూప్-3 పరీక్షలు జిల్లాలో రెండు పట్టణాలలో సవ్యంగా జరిగాయని, ఎలాంటి సంఘటనలు చోటు చేసుకోలేదని ఆమె తెలిపారు.

శస్త్ర చికిత్సతో పని లేకుండా వాల్వ్ మార్పిడి అభివృద్ధిపై దృష్టి

హైదరాబాద్: శస్త్రచికిత్సతో పని లేకుండా వాల్వ్ మార్పిడి పద్ధతులు (టీఏవీఐ, టీఎంవీఆర్, టీపీవీఆర్) అభివృద్ధి చేయడం లక్ష్యంగా 2019లో ఏర్పాటైన హైదరాబాద్ వాల్వ్స్ మూడో ఎడిషన్ హైదరాబాదులోని పార్క్ హయత్ లో జరిగింది. రెండు రోజుల ఈ సమావేశం ఆదివారం ముగిసింది. 2002లో ప్రపంచంలో తొలి ట్రాన్స్‌కాథెటర్ ఆర్టిక్ వాల్వ్ మార్పిడి (టీఏవీఆర్) నిర్వహించిన ప్రొఫెసర్ అలైన్ క్రిబియర్ జ్ఞాపకార్థం ఈ ఈవెంట్ నిర్వహించారు. ఈ విప్లవాత్మక సాంకేతికతను ప్రపంచవ్యాప్తం చేసిన ఆయన కృషిని గౌరవిస్తూ.. సమగ్ర అకాడమిక్ అనుభవాన్ని అందించేలా ఈ కార్యక్రమాన్ని రూపొందించారు. ఈ సందర్భంగా హైదరాబాద్ వాల్వ్స్ సీనియర్ కార్డియాలజిస్ట్, కోర్సు డైరెక్టర్ డాక్టర్ పీసీ రథ్ మాట్లాడుతూ హైదరాబాద్ వాల్వ్స్ ఈ ఈవెంట్‌లో పాల్గొనే వారు తమ నగరాల్లో స్ట్రక్చరల్ హార్ట్ ప్రోగ్రామ్‌లను ప్రారంభించడానికి అవసరమైన జ్ఞానం, నైపుణ్యాలతో వెళ్తారన్నారు. మహమ్మారి అనంతరం పూర్తి స్థాయిలో తిరిగి నిర్వహించిన ఈ సమావేశం నిపుణులు కలుసుకోవడానికి, ఈ రంగంలోని మార్గదర్శకుల నుంచి మరింతగా నేర్చుకునేందుకు ఇది ఒక వేదికగా నిలిచిందని చెప్పారు. రెండు రోజుల ఈ ఈవెంట్‌లో దేశ, విదేశాల నుంచి వచ్చిన ప్రముఖ కార్డియోథొరాసిక్ శస్త్రచికిత్స నిపుణులు, ఇంటర్వెన్షనల్ కార్డియాలజిస్టుల మార్గదర్శకత్వంలో 12 క్లిష్టమైన స్ట్రక్చరల్ హార్ట్ కేసులపై లోతైన చర్చలు జరిగాయన్నారు.

గ్రూప్ -3 పరీక్షా కేంద్రాల వద్ద బందోబస్తు పరిశీలించిన పోలీస్ కమిషనర్

విశాలాంధ్ర - ఖమ్మం : ఖమ్మం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని 87 పరీక్ష కేంద్రాలలో జరుగుతున్న గ్రూప్- 3 పరీక్ష కేంద్రాల వద్ద బందోబస్తును ఖమ్మం పోలీస్ కమిషనర్ సునీల్ దత్ పరిశీలించారు. పరీక్షలు ఎటువంటి ఇబ్బంది లేకుండా సజావుగా జరిగేందుకు కట్టుదిట్టమైన బందోబస్తును ఏర్పాటు చేశారు నేపథ్యంలో బందోబస్తు పరిశీలించేందుకు ఆదివారం నగరంలోని ఎస్ ఆర్ అండ్ బి జి ఎన్ ఆర్ కాలేజ్ పరీక్ష కేంద్రాలను సందర్శించి బందోబస్తు ఏర్పాట్లను పరిశీలించి తగిన సూచనలు చేశారు. పరీక్షా కేంద్రాల వద్ద సెక్షన్ 163 బి ఎన్ ఎస్ ఎస్ అమలులో వున్న నేపథ్యంలో పరీక్షా కేంద్రాల వద్ద పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పోలీస్ అధికారులు పోలీస్ పెట్రోలింగ్, బందోబస్తుతో అప్రమత్తం వుండాలని ఆదేశించారు.

బీజేపీ ప్రభుత్వ ప్రజావ్యతిరేక చట్టాలపై పోరు

ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు జమలయ్య

విశాలాంధ్ర - కొత్తగూడెం : రైతులు, కార్మిక కర్షకుల హక్కుల సాధనకు సుదీర్ఘ పోరాటాలతో సాధించుకున్న చట్టాలను కేంద్ర బిజెపి ప్రభుత్వం కుట్రపూరితంగా నిర్వీర్యం చేస్తుందని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు కంచర్ల జమలయ్య విమర్శించారు. సుజాతనగర్ మండల కేంద్రంలోని సిపిఐ రజబ్ అలీ భవన్లో ఆదివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశం ఆ సంఘం మండల అధ్యక్షులు వీర్ల మల్లేష్ ఆధ్వర్యంలో జరిగింది. జిల్లా ఏఐటియుసి క్లాసులను జయప్రదం చేయ్యాలని జమలయ్య పిలుపునిచ్చారు. రైతులు కార్మిక కర్షక హక్కుల కోసం ఏఐటియుసి ఎన్నో త్యాగాలు చేసిందని గుర్తు చేశారు. కేంద్రంలో బిజెపి వచ్చాక రైతు వ్యతిరేక నల్ల చట్టాలు తెచ్చి కార్పొరేట్ కంపెనీలకు దోచిపెట్టి కుట్రలు కొనసాగిస్తుందని విమర్శించారు. బిజెపి కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రజలను సమీకరించి పోరాడాల్సిన అవసరం ఉందని ఆయన పిలుపు నిచ్చారు. ఏఐటీయూసీ శిక్షణ తరగతుల్లో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, జిల్లా కార్యదర్శి ఎస్ కె. సాబీర్ పాష పాల్గొని శ్రేణులకు దిశానిర్దేశం చేస్తారని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా కార్యదర్శి పోగుల కోటేశ్వరరావు, సహాయ కార్యదర్శి జక్కుల రాములు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు భుక్య దసురు, జిల్లా నాయకులు బొడ్డు కేశవరావు తదితరులు పాల్గొన్నారు.

గిరిజనులకు రగ్గులు పంపిణీ

విశాలాంధ్ర - చర్ల : స్వాతంత్ర సమరయోధులు, ఆదివాసి హక్కుల పోరాట వీరుడు బిర్సా ముండా 150వ జయంతి పురస్కరించుకొని 50 గిరిజన కుటుంబాలకు రగ్గులు పంపిణీ చేశారు. చర్ల మండలం, సుబ్బంపేట గ్రామపంచాయతీలోని రాజయ్య నగర్ గ్రామంలో ఆదివారం బీర్సా ముండా 150 వ జయంతి వేడుకలు నిర్వహించారు. తొలుత బీర్సా ముండా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం 50 మంది గిరిజన కుటుంబాలకు రగ్గులు పంపిణీ చేసారు. ఈ కార్యక్రమలో పాల్గొన్న వనవాసి కళ్యాణ పరిషత్ రాష్ట్ర కార్యదర్శి కోరం సూర్యనారాయణ మాట్లాడుతూ బిర్సా ముండా ఝార్ఖండ్ రాష్ట్రంలోని ఖుంతి జిల్లా ఉలిహాయ గ్రామంలో జన్మించారన్నారు. ముండా గిరిజన నాయకుడే కాకుండా దేశాన్ని కబళిస్తున్న బ్రిటీష్ పాలకులకు వ్యతిరేకంగా తన 22 ఏళ్ల వయసులోనే యుద్ధం ప్రకటించిన యోధుడని గుర్తు చేశారు. ఉల్గులన్ ఉద్యమానికి నాయకత్వం వహించి గిరిజన హక్కులు, సంస్కృతి, సాంప్రదాయాల కాపాడుకునేందుకు వీరోచిత పోరాటాలు చేశాడని కొనియాడారు. ఆయనను ఆదర్శంగా తీసుకుని నేటితనం యువకులు తమ హక్కుల సాధనకు పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రఖండ ప్రముఖ్ గొంది శోభన్ బాబు, సహకార కార్యదర్శి గోంగీకర్ రామ లక్ష్మణ్, గ్రామ పెద్ద ఆంధ్రయ్య, గ్రామస్తులు పాల్గొన్నారు.

హాస్పిటల్ తనిఖీ చేసిన సీఎంఓ

వినతి పత్రం ఇచ్చిన ఎఐటీయుసి బృందం

విశాలాంధ్ర - ఇల్లందు : ఇల్లందు ఏరియా సింగరేణి ప్రధాన వైద్య శాలను ఆదివారం కొత్తగూడెం ప్రధాన వైద్య అధికారిని (సిఎంఓ) సుజాత ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. విషయం తెలుసుకున్న ఎఐటియుసి గుర్తింపు సంఘం ప్రతినిధి బృందం సిఎంఓ ను మర్యాద పూర్వకంగా కలిసారు. ఈ సందర్భంగా కేంద్ర కమిటీ డిప్యూటీ ప్రధాన కార్యదర్శి కె. సారయ్య మాట్లాడుతూ సిఎంఓ దృష్టికి అనేక సమస్యల కోసం మాట్లాడటం జరిగిందన్నారు. ఏరియా కార్మికులు పిఎంఈ కొసం ఇల్లందు వైద్యశాలకు వస్తే ఈసీజీ సరిగా పనిచేయడం లేదని కారణాలు చూపి కొత్తగూడెంకు రిఫర్ చేసె విధానాన్ని మానుకోవాలన్నారు. కార్మికుల హృదయ రొగ సమస్యలపై చిన్న సమస్య ఉన్న హైదరాబాద్ రిఫర్ చెస్తున్నారనీ చెప్పారు. అక్కడి డాక్టర్లు రాసీన మందులు ఇల్లందులో లేకపోవడంతో అనేక ఇబ్బందులు పడుతున్నారని సీఏంఓకు సారయ్య వివరించారు. అన్ని రకాల ట్యాబ్లెట్స్ ఇల్లందులో అందుబాటులో ఉంచాలని కోరారు. దింతోపాటు ఇల్లందు హస్పిటల్‌లో స్పెషలిస్ట్ డాక్టర్లు నియమించాలన్నారు. మరి కొంతమందిని స్టాఫ్ నర్సులను నియమించి మెరుగైన సౌకర్యాలు కల్పించాలనే డిమాండ్లను సిఏంఓ దృష్టికి తీసుకెళ్లారు. ఈ కార్యక్రమంలో బ్రాంచ్ ఉపాధ్యక్షులు దాసరి రాజారామ్, జేకేసి పిట్ కార్యదర్శి సంజీవ చారి, బొల్లేద్దుల శ్రీనివాస్, తురాయి సతీష్ కుమార్, ఆర్. పైడి రాజు, ప్రతాప్ కుమార్ పాల్గొన్నారు.

పేదల పక్షాన పోరాడేది కమ్యూనిస్టులే

ముమ్మరంగా సీపీఐ 2025 సభ్యత్వాల నమోదు

సీపీఐ నేత భాగం హేమంతరావు

విశాలాంధ్ర - కారేపల్లి : పేదల పక్షాన పోరాడేది కమ్యూనిస్టులేనని, కమ్యూనిజం ఎల్లప్పుడూ అజేయంగా ఉంటుందని సిపిఐ పార్టీ జాతీయ సమితి సభ్యులు భాగం హేమంతరావు అన్నారు. ఆదివారం మండల పరిధిలోని భాగ్యనగర్ తండాలో భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) 2025వ సంవత్సర సభ్యత్వ చేర్పింపు పునరుద్ధరణ కార్యక్రమన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రజలకు పార్టీ సభ్యత్వాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదల సమస్యలను పరిష్కరించేందుకు పోరాటాలే శరణ్యం అన్నారు. వందేళ్ల చరిత్ర గల పార్టీలో సభ్యులుగా చేరుతున్నందుకు కార్యకర్తలకు విప్లవ అభినందనలు తెలిపారు. మండల కార్యదర్శి బోళ్ళ రామస్వామి, ఇస్లావత్ బావ్ సింగ్ పాల్గొన్నారు.

ప్రపంచ మత్స్యకారుల దినోత్సవాన్ని ఘనంగా జరుపుకోవాలి

విశాలాంధ్ర జిల్లా బ్యూరో - (మహబుబాబాద్) తొర్రూర్: ముదిరాజ్ మత్స్యకారులు ప్రపంచ మత్స్యకారుల దినోత్సవం నవంబర్ 21న జండా ఎగరవేసి ఘనంగా జరుపుకోవాలని జిల్లా ముదిరాజ్ మహాసభ అధ్యక్షులు చిల్లా సహాదేవ్ ముదిరాజ్ పిలుపునిచ్చారు. ఆదివారం తొర్రూరు గెస్ట్‌హౌస్ లో వాల్పోస్టర్ను ముదిరాజులతో కలిసి ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ అభయ హస్తంలో కామారెడ్డి బీసీ డిక్లరేషన్లో మొదటి అశం అయిన బీసీ రిజర్వేషన్ పై ముదిరాజులను బిసి-డి నుంచి బీసీ-ఏ కి మార్చాలని డిమాండ్ చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించాలని కోరారు. అనంతరం జిల్లా మత్స్య పారిశ్రామిక సహకార సంఘాల చీఫ్ ప్రమోటర్ కొత్తూరు రమేష్ మాట్లాడుతూ ముదిరాజుల అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ ముదిరాజ్ కో-అపరేటివ్ సొసైటీస్ కార్పొరేషన్- లిమిటెడ్ ఏర్పాటు చేస్తూ, నిధులు కేటాయించకపోవడం బాధాకరమన్నారు. తెలంగాణ ఫిషరీస్ ఫెడరేషన్‌కు ఎన్నికలు నిర్వహించాలని పాలకమండలి ఏర్పాటు చేయాల న్నారు. తొర్రూరు మండల ప్రధాన కార్యదర్శి గంధం చంద్రమూర్తి, ఉపాధ్యక్షులు నారాయణ, సోమయ్య, కొండ వెంకన్న, మడిపల్లి సొసైటీ అధ్యక్షులు కాగితం యాకయ్య, చెర్లపాలెం సొసైటీ ప్రధాన కార్యదర్శి పులుగుజ్జ మహేష్, రామచంద్రు, పూర్ణ, మాటేటి సొసైటీ అధ్యక్షులు గోపాల్ ప్రసాద్, గుర్తూరు ముదిరాజ్ అధ్యక్షులు బోయిని సాంబయ్య, గంట వెంకన్న, వెంకట్, వెలికట్ట సొసైటీ బాధితులు ప్రవీన్, చింతలపల్లి కుంట రమేష్ , వెంకటాపురం సొసైటీ అధ్యక్షులు బల్ల ప్రభాకర్, అరిపిరాల పులిగుజ్జ రవి, పత్తేపురం సొసైటీ అధ్యక్షులు గంట నాగన్న, పెద్ద వంగర ఇంచార్జి దయాకర్ ముదిరాజ్ పాల్గొన్నారు.

మెడికోపై అసిస్టెంట్ ప్రొఫెసర్ దాష్టీకం

మెడికోకు గుండు కొట్టించిన వైనం

ఖమ్మం ప్రభుత్వ వైద్య కళాశాలలో ఘటన

విద్యార్థి సంఘాల ఆందోళన

విశాలాంధ్ర - ఖమ్మం : ప్రభుత్వ మెడికల్ కళాశాల విద్యార్థిపై దాష్టికం ప్రదర్శించి గుండు గీయించిన అసిస్టెంట్ ప్రొఫెసర్ పై తగిన చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ జాతీయ కార్యవర్గ సభ్యులు ఇటికాల రామకృష్ణ, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి తుడుం ప్రవీణ్. జార్జిరెడ్డి పిడిఎస్‌యు జిల్లా అధ్యక్షులు మంద సురేష్, పిడిఎస్‌యు జిల్లా అధ్యక్షులు లక్ష్మణ్ ఏఐవైఎఫ్ జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి మద్దోజు శ్రావణ్ కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం ఖమ్మం ప్రభుత్వ మెడికల్ కళాశాల బాలుర వసతి గృహం ముందు విద్యార్థి సంఘాల ఆందోళన నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి వారు మాట్లాడుతూ ములుగు జిల్లాకు చెందిన ఓ విద్యార్థి ఖమ్మం ప్రభుత్వ, మెడికల్ కళాశాలలో ఈ ఏడాది ఎంబీబీఎస్ మొదటి సంవత్సరం చదువుతున్నాడని, కళాశాల హాస్టల్లో ఉంటున్న ఈ విద్యార్థి ఈనెల 12న రాత్రి చైనీస్ స్టైల్లో హెయిర్ కటింగ్ చేయించుకుని వచ్చిన క్రమంలో సెకండియర్ విద్యార్థులు అది బాగోలేదని చెప్పడంతో మళ్లీ వెళ్లి ట్రిమ్మింగ్ చేయించుకున్నాడని, అప్పటికి విద్యార్థి వచ్చేసరికి హాస్టల్లో యాంటీ రాగింగ్ మెడికల్ ఆఫీసర్గా విధులు నిర్వహిస్తున్న అసిస్టెంట్ ప్రొఫెసర్ విషయాన్ని తెలుసుకుని కోపోద్రిక్తుడై ఉన్నతాధికారులకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా, ఆ విద్యార్థిపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ, బయటికి తీసుకెళ్లి సెలూన్ షాప్‌లో గుండుగీయించాడని వారు పేర్కొన్నారు. ఒకవైపు ప్రభుత్వం టీజింగ్, ర్యాగింగ్ అరికట్టాలని ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తుండగా, ఇటువంటి అమానుష ఘటనలు చోటు చేసుకోవడం దారుణమన్నారు. ఈ ఘటనపై ఉన్నతాధికారులు తగు విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. లేనిచో కళాశాల వసతి గృహం ముందు పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలను నిర్వహిస్తామని వారు పేర్కొన్నారు. ఏఐఎస్ఎఫ్ నాయకులు శివ నాయక్, కౌశిక్, ప్రతాప్ రాజు, సునీల్, ఎస్ఎఫ్ఐ సాయి వినోద్, జార్జి రెడ్డి పిడిఎస్యు అజయ్ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

రైతును రాజు చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం : ఎమ్మెల్యే కనకయ్య

గార్ల - విశాలాంధ్ర : రైతులను రాజులుగా మార్చటమే లక్ష్యంగా అంకితభావంతో కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు సాగుతుందని ఎమ్మెల్యే కోరం కనకయ్య అన్నారు. ప్రైవేట్ వ్యాపారులు, బ్రోకర్లను ఆశ్రయించకుండా ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులందరు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ప్రభుత్వం రైతులు పండించిన ప్రతి ధాన్యపు గింజను కొనుగోలు చేస్తుందని భరోసా ఇచ్చారు. బయ్యారం మండల కేంద్రంలోని స్థానిక ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పిఏసిఎస్) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రభుత్వ వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ కేంద్రంలోనే ధాన్యం అమ్మి మద్దతు ధరను పొందాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన మాట ప్రకారం రూ.500 లు బోనస్ ఇస్తుందన్నారు. రైతులు ధాన్యాన్ని వంకలు పెట్టకుండా కొనుగోలు చేయాలని అధికారులు, సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ మూల మధుకర్ రెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బిజ్జా వెంకటేశ్వర్లు, డైరెక్టర్లు తిరుమల ప్రభాకర్ రెడ్డి, వేల్పుల శ్రీనివాస్, జూలకంటి సీతారాం రెడ్డి, చెరుకుపల్లి నాగమ్మ, బండారి మల్లయ్య, మండల అధ్యక్షులు కంబాల ముసలయ్య, నాయకులు భూక్యా ప్రవీణ్ నాయక్, తమ్మిశెట్టి వెంకటపతి, నాగేశ్వర్ రావు, కిషన్ నాయక్, శ్రీనివాస రెడ్డి, బరిగెల ఉపేందర్, ఏఓ రాంజి నాయక్ పాల్గొన్నారు.

హిందూ, ముస్లిం ఐక్యత చాటిన దర్గా ఉత్సవాలు : ఎమ్మెల్యే

విశాలాంధ్ర బ్యూరో - కొత్తగూడెం : భారత దేశ ఆత్మ, సంస్కృతి సాంప్రదాయాల్లోనే భిన్నత్వంలో ఏకత్వం ఉందని వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్ అన్నారు. ఆదివారం రామవరం ప్రశాంత్ నగర్ మిషన్ కాలనీలోని నాగుల మీరా దర్గా ఉర్సు ఉత్సవాలు హిందూ ముస్లింల ఐక్యతను మరోసారి చాటాయి. దర్గా మాలిక్ శివ బృందం14 నెంబర్ నుండి రామవరం పురవీధులలో దర్గా నిషాని గుర్రాలపై దప్పు వాయిద్యాలు, నృత్యాలు, కోలాటాలతొ భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. మూడు రోజులపాటు ఉర్సు ఉత్సవాలు వైభవంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిధులుగా ఎమ్మెల్యే రాందాస్ నాయక్, జడ్పీ మాజీ చైర్మన్ కంచర్ల చంద్రశేఖరరావు, కాంగ్రెస్ నాయకులు ఆళ్ల మురళి, ఐఎన్‌టియుసి వైస్ ప్రెసిడెంట్ ఎండి. రజాక్ పాల్గొని మాట్లాడారు. కులమతాలకు అతీతంగా హిందు- ముస్లింలు ఉత్సవాల్లో భాగస్వాములవడం దేశ ఐక్యతను చాటుతోందని ఎమ్మెల్యే అన్నారు. ఈ దర్గా ఉరుసుకు ఒక హిందువైన శివ బాధ్యులుగా వుండటం మన ఐక్యతకు పెద్ద నిదర్శనమన్నారు. శివతో పాటు దర్గా ఆర్గనైజర్లు అందర్నీ అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖులు ఏఎంసీ మాజీ చైర్మన్ రాంబాబు, అర్జున్‌రావు, అంతోటి పాల్, రుక్మిణి, నాగేశ్వరరావు, కనకరాజు, కొమరయ్య, సుందర్ రాజు, తొగర్ రాజశేఖర్, శ్రీదేవి బాబు, కృష్ణ, బోడ గణేష్, జానీ మియా, హరి సింగ్, అబ్బాస్, మోహన్, రమేష్, శ్రీనివాస్, యాకూబ్ పాషా, దర్గా భక్తులు, అభిమానులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనం చోరీ

విశాలాంధ్ర - కొండమల్లేపల్లి : కొండ మల్లేపల్లి మండలంలో పట్టపగలే ద్విచక్ర వాహనం చోరికి గురైనట్లు ఆదివారం మండల కేంద్రంలో చోటుచేసుకుంది. గుర్రంపోడ్ మండలం పాల్వాయి గ్రామానికి చెందిన పోలే అంజయ్య అనే రైతు మేకలను కొనుగోలు చేసేందుకు ఆదివారం మధ్యాహ్నం రెండు గంటల సమయంలో తన ద్విచక్ర వాహనంతో పశువుల సంతకు వచ్చాడు ద్విచక్ర వాహనం నెంబరు టీఎస్05ఎఫ్ జి 0013 సంతలో పార్కు చేసి మేకలు కొనుగోలు చేసిన అనంతరం ద్విచక్ర వాహనం కనిపించలేదని తెలిపారు. ఈ విషయంపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు బాధితుడు తెలిపారు.

ప్రశాంతంగా గ్రూప్ - 3 పరీక్ష

విశాలాంధ్ర బ్యూరో - కొమరం భీమ్ : జిల్లాలో ఈనెల 17, 18 తేదీలలో జరగనున్న గ్రూప్-3 పరీక్షలలో భాగంగా ఆదివారం జరిగిన మొదటి రోజు పరీక్షలో అభ్యర్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పరీక్షలు ప్రశాంతంగా నిర్వహించేందుకు పూర్తి స్థాయిలో చర్యలు తీసుకోవడం జరిగిందని జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, పి.టి.జి. పరీక్ష కేంద్రాలను జిల్లా కలెక్టర్ సందర్శించారు. జిల్లాలో 18 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందని, 4471, విద్యార్థులు పరీక్ష రాయాల్సింది ఉండగా 279 హాజరయ్యారని, 1677 హాజరు కాలేదని తెలిపారు. పరీక్ష కేంద్రాల వద్ద పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

రాబోవు మున్సిపల్ ఎన్నికల్లో సీపీఐ జెండా ఎగరాలి

విశాలాంధ్ర -జిల్లా బ్యూరో మహబూబాబాద్: రాబోయే మున్సిపల్ ఎన్నికలలో సిపిఐ జండా ఎగరవేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి విజయ సారధి అన్నారు. ఆదివారం స్థానిక 23, 24, 9 మున్సిపల్ వార్డుల సన్నాహక సమావేశంలో చింతకుంట్ల వెంకన్న అధ్యక్షత జరిగిన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో సిపిఐకి మెజార్టీ వార్డుల్లో గెలిపించాలని అన్నారు. వార్డుల్లో గత ఎన్నికల్లో తక్కువ మెజార్టీతోటి సిపిఐ శ్రేణులు ఓడిపోయారని, రాబోతున్నటువంటి ఎన్నికల్లో ఈ వార్డులలో జెండా ఎగరవేయాలన్నారు. మహబూబాబాద్ మున్సిపాలిటీలో మెజార్టీ వార్డులలో ఎర్రజెండా ఎగిరేస్తామని ధీమా వ్యక్తం చేశారు. వార్డుల్లో నిధులు వచ్చినా రాకున్నా వేరే రూపకంగా ఎమ్మెల్సీల నిధులు, ఎమ్మెల్యేల నిధులు మరీ తీసుకోవచ్చి అభివృద్ధి చేస్తున్నట్టు తెలిపారు. పెరుగు కుమార్, చింతకుంట్ల వెంకన్న, మామిళ్ల సాంబలక్ష్మి, వీరవెల్లి రవి, వెలుగు శ్రావణ్, మాలోతు రవీందర్, నాగెల్లి యాకమ్మ, ఎండి మహమూద్, ఎర్రోజు పద్మ, ఆలేటి మహేష్, భీమరాజు, వెంకన్న, రామ్ చందర్, విక్రమ్, విజయ్, వీరేందర్, శ్రీకాంత్ పాల్, శ్రీనివాస్, నటరాజ్, అంజలి, సురేష్ పాల్గొన్నారు.

వివాహ వేడుకలో కలిసిన చిన్ననాటి మిత్రులు

విశాలాంధ్ర - ములుగు జిల్లా బ్యూరో : ఏటూరు నాగారం మండల కేంద్రంలో ఆదివారం ఎస్ ఎల్ ఎన్ గార్డెన్ ఫంక్షన్ హాల్లో (లక్ష్మి నారాయణ) జరుగుతున్న, పాలకుర్తి విజయ్ కుమార్, రజిత కుమార్తె కావ్య, తరుణ్, వివాహ వేడుకకు, ఏటూరునాగారం జడ్ పిఎస్ ఎస్ 1993-94 సంవత్సరంలో పదవ తరగతి చదువుకున్న బ్యాచ్, విజయ్ కుమార్ కుమార్తె పెళ్లికి హాజరై, వధువు వరులను ఆశీర్వదించి, గిఫ్ట్ అందచేశారు. ఈ కార్యక్రమంలో యెంపెల్లి లకుమయ్య, కోడి రవీందర్, చెన్న రాంబాబు, సామల శ్రీనివాస్, ముస్తాఫ్ హ్యాస్, పి.రమాదేవి, శిరీష, జయ, హరిత, ఆనందం, వేణు, శ్రీనివాస్, భాస్కర్, రమేష్, సత్యనారాయణ, అల్లిమ్, బాబు, వెంకట నారాయణ, రమేష్, యాకయ్య, మురళి, అక్బర్ తదితరులు పాల్గొన్నారు.

నేను మీ నాన్నను...!

నేను మీ నాన్నను
నా కలల్ని త్యాగం చేసుకుని
మీ కలలను సాకారం చేశాను
నేను ఆత్మను ఎవరైతే ప్రళయం సృష్టించారో...!
మీరు సుఖాలను పొంది
నాకు ప్రతిగా ఏమిచ్చారు...?
బహుమతిగా ఇచ్చిందేమిటి...?
నాకు చూయించండి నా ఇల్లు ఎక్కడ...?
వినండి నా ప్రియ తనుజులారా...
నా కథను, గాథను
ఎప్పుడైనా అడిగారా...?
"నాన్న" ఎటు వెళ్లింది మీ "రంగుల బాల్యం" అని...?
గుర్తుంచుకోండి మీరు లేని ప్రపంచాన్ని నేను ఊహించలేదు...!
నా "యవ్వనం" మొత్తాన్ని మీ "క్షేమం" కోసమే ధారపోశాను.
మీరు యవ్వనంలో నేను వృద్ధాప్యంలో..!
చూస్తుండగానే రోజులు గడిచి మృత్యువుకు దగ్గరగా..!
నాకు చూయించండి నా ఇల్లు ఎక్కడ..?
నేను మీ నాన్నను
నా కలల్ని దూరం చేసుకుని
మీ కలల్ని సాకారం చేశాను....

డాక్టర్. మహమ్మద్ హసన్
సెల్ :9908059234

సాహితి

తెలుగుభాష రెక్కలతో ఎగిరిన 'హో చి మెన్' కవిత్వం

దాదాపు మూడు దశాబ్దాల పాటు వియత్నామీస్ జాతీయవాద ఉద్యమానికి నాయకుడిగా, రెండవ ప్రపంచ యుద్ధానంతర ఆసియాలో వలసవాద వ్యతిరేక ఉద్యమానికి ప్రధాన ఉద్యమకారులలో ఒకరుగా, 20 శతాబ్దపు అత్యంత ప్రభావంతమైన కమ్యూనిస్ట్ నాయకులలో ఒకరుగా హెూ చి మెన్ సుప్రసిద్ధుడు. 1941లో 'లీగ్ ఫర్ ది ఇండిపెండెన్స్ ఆఫ్ వియత్నం' ను స్థాపించడంలో సహాయం చేశాడు. అతడు నాయకత్వం వహించిన దళాలు వియత్నామీస్ స్వాతంత్ర్యం కోసం తీవ్రంగా పోరాడాయి. 'అంకుల్ హెూ' అని పిలువబడే ఇతను 25 సంవత్సరాలపాటు ఉత్తర వియత్నం అధ్యక్షుడిగా ఉన్నాడు. మే 19, 1890లో జన్మించి, సెప్టెంబరు 2, 1969లో మరణించిన ఇతని అసలుపేరు 'న్గుయెన్ సిన్హ్ కుంగ్'. రెండవ ప్రపంచయుద్ధ సమయంలో ఆయన పెట్టుకున్న మారుపేరే 'హో చి మెన్'. అతని మాతృభాష వియత్నామీస్‌తో సహా చాలా భాషల్లో చదవడం, రాయడంతో పాటు అనర్గళంగా మాట్లాడగలిగేవాడు. హో చి మెన్ చాలా రచనలు 1960లో హనోయిలో విదేశీ భాషా సంచికల శ్రేణిలో ప్రచురించబడిన రెండు సంపుటాలలో సేకరించారు.

హో చి మెన్ కవిత్వంలో ఏ పొరను విప్పినా పదునైన భావాలు, ఒక ప్రత్యేకమైన శైలితో, మనిషి శ్వాస పీల్చుకునే గాలితో కలిసి పాఠకుల్ని పలకరిస్తాయి. సాధారణమైన విషయాలను అసాధారణమైన చట్రంలో బిగించి ఒక రంగుల చిత్రంగా అందించటంలో ఆయన కలంచేసే విన్యాసాలు సాహితీలోకంలో ఒక సంచలనాన్ని సొంతం

చేసుకున్నాయి. రహదారుల్లో మైలురాళ్ల హాజరు సర్వ సాధారణం. కాని వాటికీ జీవముందని, అద్భుతమైన సేవలందించే అంకితభావం. వాటికి మాత్రమే సొంత మని హో చి మెన్ రాసిన 'మైలురాయి' కవితలోని భావాలు పాఠకుల్ని ఆత్మీయంగా పలకరిస్తున్నాయి. అందులో ఆయన మైలురాయిని చూస్తూ ఇలా అంటారు... 'నువ్వు రాజువీ కాదు, చక్రవర్తివీ కాదు / ఒక చిన్న మైలురాయివి/ దారి ప్రక్కననిల్చుని/ ఈ దారెంట వెళ్లే ప్రజలకు/ సరైన దారి చూపిస్తావు/ దోవ తప్పకుండా కాపాడతావు/ వాళ్లంతా ఎంత దూరం వెళ్లాలో చూయిస్తావు/ ప్రజలు గుర్తుపెట్టుకోరా నీ సేవని...' అంటారు. ఈ కవితను జీర్ణం చేసుకున్నాక మైలురాళ్లు, మన జీవితంలో అత్యంత సన్నిహిత మార్గ దర్శకులుగా తమ ముద్రను కొనసాగిస్తాయి. హో చి మెన్ తన జీవితంలో చూసిన మైలురాళ్లు వేరు. ఒక ఉద్యమకారుడిగా తాను ఎంత దూరం ప్రయాణించాలో, ఏ మార్గంలో దూసుకు వెళ్లాలో నిర్దేశించిన మైలురాళ్లు తనను ఒక పోరాట వీరుడిగా తీర్చిదిద్దాయి. పోరాటం చేసే ప్రజలపక్షాన మద్దతుగా మౌనంగానే అనేక మైలు రాళ్లు సిద్ధాంతాలరహదారుల్లో ఆయనకు సేవలం దిస్తున్నాయి. ఇప్పుడు ఎక్కడ ఏ మైలురాయిని చూసినా నేను దగ్గరికి వెళ్లి పలకరిస్తున్నాను. వాటి మనసును, మాటను, హో చి మెన్ అందించిన విలువైన పత్రాలుగా స్వీకరిస్తున్నాను.

దాడులు, అణచివేతలు, నిర్బంధాలు, జైలు శిక్షలు... ఇవన్నీ హో చి మెన్ జీవితంలో ఒక భాగంగా మిగిలిపోయాయి. ఆ క్షణం తాను జైలులో వున్నాడు. భౌతికంగా తనను బంధించారే కాని, తన భావాలను, కవితాత్మకత ఆలోచనలను ఎవరూ బంధించలేక పోయారు. కొండల్లో ఉదయించే సూర్యుడ్ని, వికసించే పుష్పాలను, జైలు గోడలను, ఆ గోడలను తాకుతున్న నీడలను తన మనోనేత్రం వీక్షించడమే కాదు, వాటిని కవితాత్మకంగా ఇలా నమోదు చేశాడు. 'ఉదయం సూర్యుడు పర్వతశిఖరాల్ని/ ఎక్కు తున్నాడు / పర్వత సానువులు / గులాబీకాంతుల్లో స్నానాలు చేస్తున్నాయి / జైలు ముందరి భాగంలో మాత్రం / చల్లని నీడ మిగిలి వుంది / సూర్యుడి మార్గాన్ని / నా జైలు గది అడ్డగించు తోంది...' అంటాడు. ఇక్కడ సూర్యుడు అంటే, తన ఆలోచనలు. పర్వతాలన్నీ తన ఉద్యమ పథకాలుగా మారిపోయాయి. రేపటి ఫలితాలు గులాబీకాంతులవు తున్నాయి. తన మార్గం సూర్యుడి మార్గమయింది. కానీ తనను నిర్బంధించిన జైలు, తన ఎన్నుకున్న మార్గానికి అడ్డుతగులుతోంది. జైలు ముందరి భాగంలో ఇనుప ఊచల నిర్మాణాలు, కంపుకొట్టే గదులు లేవు. అందుకే అక్కడ నీడ చల్లగా వుంది.

ఎంతో మర్మగర్భంగా ఆయన కలం రాల్చిన భావాల సంపదలో 'జైలుగది' కవిత, సాహిత్యం పుణ్య స్నానాలు చేస్తోంది. పాఠకులకు ఈ కవిత ఒక పాఠ్యాంశంగా మిగిలిపోతోంది.

కె. శివారెడ్డి

విశ్వవ్యాప్త కవిత్వ ప్రయోజనం పట్ల అత్యంత అవగాహన కలిగిన కవి, యోధుడు హో చి మెన్. మనిషిని చైతన్యపరిచే కవిత్వం విస్తరించాలన్నదే ఆయన భావన. పూర్వ కవుల గొంతుల్ని అనుసరిస్తూ మంచు పుష్పాలు, చంద్రుడు, గాలి, నదులు, పర్వతాలు, ప్రకృతిగురించి రాసే ఆలోచన నుంచి సమాజాన్ని పురోగామిదశవైపు, నిర్మాణాత్మక రహదారుల్లో, మనిషి మీద మనిషి, రాజ్యం మీద రాజ్యం చేసే పెత్తనాలను చీల్చిచెండాడే కవిత్వానికి ద్వారాలు తెరవమంటూ...'ఈ రోజు మనం /ఇనుము ఉక్కు కలిపి గీతలురాయాలి/ కవులు కూడా తెలుసు కోవాలి / విప్లవాన్నెలా నడపాలో / తిరుగుబాటునెలా లేపాలో...' అంటాడు. ఈ 'విప్లవ గీతం' కవిత రాస్తున్న సమయంలో ఉద్యమం ఉచ్ఛస్థాయిలో ఉంది. అనేక మంది వీరులు వియత్నం స్వాతంత్ర్యంకోసం ప్రాణ త్యాగాలకు సిద్ధపడుతున్నారు. అలాంటి సమయంలో నాలుగు గోడల మధ్య సుఖాలను జమ చేసుకుంటూ, ప్రయోజన శూన్యమైన కవిత్వానికి బానిసలు కావద్దంటూ, ఉద్యమాలకు ప్రేరణగా కవులు ఎలా నిలవాలో, పోరాటాల్లో కవుల అంకితభావం తాము రాసే కవితల్లో ఎలా జీవం పోసు కోవాలో వివరించిన ఈ కవిత, ఎందరో కవుల్ని ఉద్యమకారులుగా మార్చి, అప్పట్లో జరిగిన పోరాటానికి అదనపు శక్తిని అందించిన సందర్భాన్ని చరిత్ర ఘనంగా నమోదు చేసుకుంది.

సుప్రసిద్ధ కవి కె.శివారెడ్డి, హో చి మెన్ కవిత్వానికి తెలుగు రెక్కలను అందించి, 'Ode to Love అను ప్రేమగీతం' కవితా సంపుటి ద్వారా సాహితీలోకాన్ని ఆకాశాన విహరింపజేసిన ప్రయత్నం అపూర్వంగా నిలుస్తోంది. ఉన్నత ప్రమాణాల వస్త్రాలను ధరించిన శివారెడ్డి అనువాదం, హో చి మెన్ సాహిత్య విలువల్ని ఒక గౌరవప్రదమైన వేదిక మీద ప్రదర్శింపజేసినట్లయింది. ఈ చర్యతో హో చి మెన్ సాహిత్య గుండెచేసిన సవ్వడి శాశ్వతంగా తెలుగు నేలల మీద వినిపిస్తూనే వుంటుంది. తెలుగు సాహితీలోకం తరుపున కె. శివారెడ్డికి ఎత్తిన పిడికిళ్లతో హృదయ పూర్వక అభినందనలు.

డాక్టర్ కె.జి. వేణు, 98480 70084

బతుకంటే ఓ ప్రవాహం..!

జీవనం ఎప్పుడూ
వొంపేసుకున్న ద్రావణం కాదు
మళ్లీ మళ్లీ
బతుకు బొచ్చెలోకి ఎత్తుకోవటానికి

ప్రతీ బతుక్కు కొన్ని పరిమితులుంటాయి
కొన్ని స్వేచ్ఛలుంటాయి
కొన్ని హద్దులుంటాయి
అవి లేకుంటే అది బతుకే కాదు

ప్రతి మనిషికీ కొన్ని రహస్యాలూ అవసరమే
జీవితమంతా.. తెరిచిన పుస్తకమేమీ కాదు
ఆసాంతం చదివేయటానికి
కొన్ని పుటల్ని గుర్తుకోసం మడత పెట్టుకోవాలి...
కొన్ని కాగితాల్ని మన కోసం
దాచి పెట్టుకోవాలి అది అంతే..

అవి మనల్ని అప్పడప్పుడూ
అద్దంలో దిగంబరంగా
చూపిస్తూ హెచ్చరిస్తూ వుంటాయి
మనకు మనమే సమాధానం చెప్పుకుంటాం గనుక
మనో నిబ్బరంగా వుండిపోతాం..
మన రహస్యం మన గుప్పిట్లోనే వుంటుంది గనుక
ఆ అవిటి తనాన్ని పదేపదే జయిస్తూ వుంటాం.

ఏ మనిషైన జీవితాన్ని సంపూర్ణంగా సహజంగా
వొంపుకున్నాడంటే అది నిజమై వుండకపోవచ్చు
నిజాన్ని నిండుగా ఆవిష్కరించుకుంటే
వెగటుతనం పరిపరి విధాల వెక్కిరిస్తూనే వుంటుంది
నిర్లజ్జగా అంతా వొంపుకోవటం
వెకిలితనమో వెర్రిబాగులతనమో అవుతుంది

జీవితమంటే...!నాలుగోడల మధ్య
సాఫీగా బతికెయ్యటం కాదు
నువ్వే ప్రపంచమైన వారికి
ఓ కొత్త ప్రపంచాన్ని చూపించటం
చెలిమి దారంతో ప్రేమ బంధాల్ని పేనుకోవటం
గుండె నిబ్బరంతో స్వేదనారాగమై
నిన్నంటి పెట్టుకున్న బతుకు బోగీలను
సమున్నత గమ్యానికి చేర్చటం
సుఖ దుఃఖాలతో
సుదూర తీరాలకు జీవనదిలా ప్రవహించటం..!!

డా. కటుకోఝ్వల రమేష్, 9949083327

నిజాలన్నీ నిప్పలా కాలిపోతుంటే..!!



ఎక్కడ చూడు రణరంగమే సిద్ధమవుతోంది
అడ్డుగీతల పంజరంలో విభేదాలు లేవనెత్తి
మనిషి అమ్ముడుపోతున్న వ్యవస్థలో
ఆకలి చావులే చివరి అంకంలో నిలుస్తుంటే...

కోల్పోతున్న ఆశల్ని లెక్కలేసుకుంటూ
తాజా వార్తల్లో మనల్ని వెతుక్కుంటూ
నిజాలన్నీ నిప్పలా కాలిపోతుంటే
విమర్శలతో బతుకును సాగిస్తున్నాం..

యదార్థాన్ని నేలపై నటించలేకపోతు
మనిషిగా భాగస్వామ్యాన్ని కోల్పోయి
మనసును అగ్నిలా రగిలిస్తున్నామే తప్ప
పొందలేదని జీవనానికి కొత్త రూపం ఇస్తాం..

మాటలకు చేతలకు అర్థాలు మారుతున్నాయి
నాయకత్వాన్ని బలపరచడానికి
అన్యాయపు మూటలెన్నో మూసుకుంటూ

వెలకట్టలేని సమయాన్ని నిర్లక్ష్యం చేస్తున్నారు..
పాండిత్యము లేని పరిజ్ఞానం
విజ్ఞత లేని విజ్ఞానాన్ని నేర్చుకోలేక
రసజ్ఞత లేని చదువును ఆస్వాదించలేక
మనసును తొక్కి పెట్టి బతుకుతున్నాం..

జీవితమంతా ఒక వ్యాసంలా పొడిగిస్తూ
కష్టసుఖాల్లో కవిత్వాన్ని గుర్తు చేసుకుంటూ
కన్నీటి బాధల్ని కావ్యంగా రాసుకుంటూ
రాబోయే రోజులను ఆశగా కొనసాగిస్తాం..

కొప్పుల ప్రసాద్, 9885066235

'వేకువ' కథాసంపుటి ఆవిష్కరణ

ఈ నవంబర్ 24వ తేదీ ఆదివారం ఉదయం 10గంటలకు విజయనగరం జిల్లా రాజాంలోగల శ్రీవిద్యానికేతన్ పాఠశాలలో రాజాం రచయితలవేదిక 118వ సమావేశం జరుగుతుంది. డా. మజ్జి భారతి రచించిన 'వేకువ' కథా సంపుటిని మజ్జి చంద్రినాయుడు ఆవిష్కరిస్తారు. గార రంగనాథం అధ్యక్షతన జరుగనున్న సభలో రచయిత్రితో పాటు అట్టాడ అప్పలనాయుడు, గంటేడ గౌరునాయుడు, పొట్నూరు కోటిబాబు అతిథులుగా పాల్గొంటారు.

గార రంగనాథం నిర్వాహకుడు
రాజాం రచయితల వేదిక, 9885758123

జలగానం చేసే అక్షరాలు

గ్రంథ సమీక్ష

నీరు మానవ మనుగడకు, నాగరికతకు మూలం. నీరు వున్న చోట జనజీవనం వికసిస్తుంది. సంస్కృతి విరాజిల్లుతుంది. నీరులేని చోట పగుళ్లుదీసిన అక్కడి నేల లాగానే అక్కడి జనజీవనమూ దిగులు పగుళ్లతో కునారిల్లుతూ వుంటుంది. ఇలాంటి శతాబ్దాల దిగులుతో సతమతమయ్యే ఒక ప్రాంతపు దుర్భిక్ష పరిస్థితుల్లోని విభిన్న పార్శ్వాల్ని ఆధునిక కవిత్వం వొడిసిపట్టుకుంది. కరువుకాటకాల అలజడిలో అల్లాడిపోయే రాయలసీమ లోని అనంతపురంజిల్లా గుండె సవ్వడినే తన కవిత్వంలో ప్రధానంగా వినిపించిన ఆ ప్రాంతపు సీనియర్ కవి మల్లెల నరసింహమూర్తి. గతంలో తన 'జలస్వప్నం' సాకారం కావాలని 'అనంత' దాహార్తికి అక్షరరూపమిచ్చి కరువునేలపై కరడుగట్టిన పాలకుల నిర్లక్ష్యవైఖరిని తూర్పారబట్టిన ఈయన కవిత్వం ఇప్పుడు తాజాగా మళ్లీ 'మాకూ ఒక నది కావాలి' అంటూ నీటికోసం కన్నీటి సవ్వడులనూ, జనజీవన విషాద నాదాలనూ వినిపిస్తూ జలగానం చేసింది.

ఎన్ని ప్రభుత్వాలు మారినా ఏళ్ల తరబడి జలకళకు నోచుకోని శాపగ్రస్త 'అనంత' దుఃఖాన్ని విభిన్న కోణాల్లో ఆవిష్కరించింది మల్లెల కవిత్వం. అక్కడి జనహృదయ స్పందనలకు వకాల్తా పుచ్చుకుంది. నీటి పరితాపాన్ని పరిపరివిధాలుగా అక్షరీకరించింది. దాహార్తితో నది కోసం అర్థించింది. కోటి ఆశలతో నదిని కీర్తించింది. నదే తన శ్వాస కావాలని తపించింది. ఈ కవిత్వంలో నీటికోసం కవి పడే పరితాపానికి ధీటుగా నీరు బహుముఖాల పదచిత్రాలైపోయింది. ఎందుకంటే ఇందులో నీరే ప్రధాన కవితావస్తువై తన విశ్వరూపాన్ని చూపించింది. తడారిన ఎడారులైపోయిన జనజీవన లోగిళ్లు అనుసంధాన ప్రక్రియ ద్వారా జలధారలతో నిండిపోవాలని, ఆ జలధారల శతసహస్ర బాహువుల్లో ఇమిడిపోవాలని ఈ కవిత్వం తపించింది. నదుల సమూహంతో మానవ సమూహాన్ని కాంక్షించింది. ఊరి సంస్కృతి, నీటి సంబరాలు పురాజ్ఞాపకాలైపోవడం పట్ల ఆవేదన వ్యక్తం చేసింది. రైతుల కడగళ్ల వడగళ్లను కురిపించింది. జనహృదయాల్లో జలోద్యమ బావుటాలను ఎగరేసింది.

కన్నవారిని రెక్కల్లేని పక్షుల్ని చేసిన కొడుకు పరదేశితత్వాన్ని ఎత్తిచూపింది. వ్యవసాయం మృగ్యమైపోయి పనిలేని పశువుల్ని సంతల్లో అమ్ముకునే కర్షకుల నిట్టూర్పుల్ని వినిపించింది. 'గొడుగుమర్రి' గతవైభవాల తలపుల్ని పంచుకుంది. తన ప్రాణాలతో చెరువు నీటిని నిలిపిన 'ముసలమ్మ మరణాని'కి నీరాజనా లర్పించింది. మనసును వీడిపోని నేలబంధపు మట్టిపరి మళాల్ని వెదజల్లింది. కరువు కంజీర నుంచి వెలువడే అనంత దుఃఖ విలాపాన్నీ, బీటలువారి వొళ్లంతా పగుళ్లతో, దాహంతో అలమటించే సీమ కరువునేల పరితాపాన్నీ మనకు వినిపిస్తుంది. సీమజలసాధనలో సమిధ కావడానికి సంసిద్ధమవుతుంది.

ఎప్పుడూ నదుల కలల అలలతో పొంగిప్రవహించే సీమరైతు కళ్ల శతాబ్దాల నిరీక్షణ ఈ కవికి కవిత్వమైంది. అందుకు నదీఅనుసంధానం జలసౌందర్య కావ్యమై పోవాలని ఈ కవిత్వం ఆకాంక్షించింది. 'నీళ్లులేని సేద్యం ధర్మరాజు జూదం' ఒకటే అంటూ సీమరైతు నిలువెత్తు జీవితాన్ని వర్ణిస్తుంది.

'నీళ్లు మా సీమ పొలాల్లో/జలాశయాలై నీటి నెమళ్ళై/అలల పింఛాల్ని విప్పి నర్తించేవరకు'(నీళ్ల నెమళ్లు) నీళ్లఅక్షరాలవుతూనే వుంటానని శపథం చేస్తుంది.

'నా సీమ జనుల చుట్టూ/సముద్రమంత/ జలాశయ మున్నట్టు...జలాశయం నడిబొడ్డున ఒక బంగారు పద్మకలశం/అందులో తాండవమాడే శివునిలా నాగలి భుజానమోస్తూ/నలుదిక్కులపారజూస్తూ/ మా సీమరైతు' (నీళ్లసంబరం) అంటూ భవిష్యత్తు నీటి కలను కంటూ రైతు అనంతమైన ఆత్మవిశ్వాసాన్ని కవిత్వం చేస్తాడీకవి. 'నా దేశం రైతు/కాశ్మీరం నుంచి/ కన్యాకుమారి వరకు/ ప్రవహించే ఆకుపచ్చనది' అని రైతును అభివర్ణిస్తాడు.

చినుకుల పట్ల వల్లమారిన మమకారంతో 'దోసెడు



మాకూ ఒక నది కావాలి
మల్లెల నరసింహమూర్తి కవిత్వం
పేజీలు: 126 వెల: రూ. 150/-
ప్రతులకు: కవి మొబైల్ 7780197294

వానచినుకులు/గుమికూడి గుబ్బిట్లాడే/ ప్రతి చెరువూ మాకొక సముద్రమై కనిపిస్తుంది' అంటాడు. 'అనంతమ్మా! నీకు నీళ్ల బొట్టు పెడతాం తల్లీ/నీళ్లహారతి పట్టుతాం తల్లీ/నీళ్లదండలు కట్టి/నిండుగా నీబోసి మెడలోవేసి/నీళ్లనిండిన కళ్లతో మురిసిపోతాం తల్లీ/పొరుగూరు నదులమ్మలారా/నీటిగువ్వలై గుంపులుగుంపులుగా ఎగిరి రండి/అలల రెక్కలతో ఎగిరొచ్చి/మా ఊర్ల సెరువు గూళ్లలో కాపురముండండమ్మా'(అనంతమ్మా) అంటూ అద్భుతమైన పదచిత్రాలతో నదుల అనుసంధానాన్ని సూచిస్తాడు.

'ఇక్కడి ప్రతిపూరిటీ గదీ/నీటివాసన వేస్తుంది/పుట్టిన ప్రతి పసికందూ/నీటికేక వేస్తాడు' అంటూ కుటుంబానికి అమితానందాన్ని కలిగిస్తూ ఆగమించే పసిబిడ్డ కేక లాంటి నీటికేక కోసం కలగంటాడు. 'వానసవ్వడి వినడం/మాయమ్మ గుండెసప్పుడు విన్నంత ఇష్టం' అంటూ తల్లి హృదయస్పందనలో చినుకుల సవ్వడిని వింటాడు.

'మా కొడుకు ఎదపై వాలితే/నెర్లుగా పలకరించలేదు/ నెనరుగా మా ఎదలు నిమరలేదు/దేశంకాని దేశంలో మా కొడుకు కొంపలోనే మేం పరాయివాళ్లం'(నా కొడుకు పరదేశి) అంటూ పరదేశ వ్యామోహాన్ని తొడుక్కున్న కన్నప్రేమ నిర్లక్ష్యాన్ని దునుమాడతాడు. మనిషి ఎన్ని ఎండమావుల వెంట పరుగెత్తినా మళ్లీ అతనిని తన మట్టి ఎదలో దాచుకునే మృణయి ఊరుతల్లి మమకారమూ అయింది కవిత్వం. అది మనిషి తప్పించుకోలేని, విడిపించుకోలేని పేగుముడితో అతని పల్లెను పోలుస్తుంది.

'ఆశతో ఆశగా బతకటానికి/ పక్షులు మా గురువులు/మీరు కాదు కేవలం పక్షులు/కొనవూపిరి వరకు రెక్కల కష్టం చాలు అన్న నిజానికి సాక్షులు'(వీరాపురం చెరువులో ఎర్రకాళ్ల కొంగలు) అంటూ కవి తన ప్రాంతచెరువులోకి వలస వచ్చే విదేశీపక్షులు పడే రెక్కల కష్టంలో సీమ ప్రజల కరువుకష్టాల్ని సంలీనం చేస్తాడు. 'అప్పుడు నాకు గొర్రె తల్లి లాంటిది/నేను కొడుకు లాంటివాణ్ణి/ఇది అడవి ఎన్నెల బంధం/గొర్రె ఎదలో/కాపరి మదిలో/ జీవకారుణ్యపుటేరు/ నింపాదిగా సాగుతున్నది' అంటూ గొర్రెల కాపరి జీవనసౌందర్యంలో మనుషులు, జంతువుల అనుబంధ మాధుర్యాన్ని దర్శిస్తాడు.

మానవజాతి మనుగడ పచ్చపచ్చగా, పదిలంగా కొనసాగడానికి తనను కంటికి రెప్పలా కాపాడుకోమనే నది ఈ కవిత్వపు మది అయింది. ఈ కవి నీటిదాహం తనివితీరని ఒక ప్రాంతపు జనసందోహపు దాహం. అందుకే ఈ కవి అణువణువూ నీరై, ఆ నీరు కవిత్వమై ప్రవహిస్తుందిలా... 'నేను నడిచే చెరువునవుతాను/ఎగిరే వాగునవుతాను/నీళ్లు నా పాదాలవుతాయి/నీళ్లు నా రెక్కలవుతాయి/నేను సరసర వొంపులు తిరుగుతూ/సాగే జలసర్పమౌతాను/నేనొక నీటిపిట్టనై నింగిలోకెగసి/కర్రావుల లాంటి/నల్లగేదెల వంటి/కారుమబ్బుల కాపరినౌతాను' (నీటిపిట్ట)...గ్రామీణ సంస్కృతిలోని కర్రావులూ, నల్లగేదెలూ నీటి ప్రవాహాన్ని కురిపించే కారుమబ్బులైపోయాయి. కవి వాటికి కాపలా కాసే నీటికాపరి అయిపోయాడు.

'ఏ నదీమతల్లి/జలహృదయం/ కరువునేల కన్నీళ్లను/తుడవటానికి/జలరథంపై/తనే ఉద్వేగపడుతూ/ఊరేగివస్తుందో' అంటూ శతాబ్దాలుగా తపించే సీమ రాళ్ల వేదన అయిపోయిన ఈ కవిత్వం 'శరవేగంగా/శతకోటి ఘనపుటడుగుల/నీటి అడుగుల చప్పుడు/సీమపొలాల్లో పోటెయ్యక తప్పదు' అంటూ కొండంత ఆశాభావాన్ని ప్రకటిస్తోంది. జలం, జనం అనుసంధానమే ఈ కవిత్వపు పరమావధి. అందుకే అయ్యింది ఇది అక్షరాల జలనిధి.

- డాక్టర్ కొత్వాలు అమరేంద్ర,
సెల్. 9177732414

చిన్న పార్టీలే నిర్ణేతలు!

మహాయుతి, ఎంవీఏ కూటముల్లో గుబులు

ఆసక్తికరంగా మహారాష్ట్ర పోరు

ముంబై : మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు ఆ రాష్ట్ర రాజకీయాలను అత్యంత ఆసక్తికరంగా మార్చాయి. ఓటర్లు కూడా ఈ పరిణామాలను నిశితంగా గమనిస్తున్నారు. రాష్ట్రంలో అధికార మహాయుతి, విపక్ష మహా వికాస్ అఘాడీ (ఎంవీఏ) కూటముల మధ్య ఎన్నికల పోరు కేంద్రీకృతమైనప్పటికీ అంతిమ ఫలితాన్ని మాత్రం చిన్న పార్టీలు, స్వతంత్రులే తేల్చే సూచనలు కనిపిస్తున్నాయి. ఈ జాబితాలో మజ్లిస్, ఎంఎన్ఎస్, వీబీఏ వంటి పార్టీలు ప్రధానంగా ఉన్నాయి. ఈ చిన్న పార్టీలకు, స్వతంత్రులకు కలిపి ఈసారి కనీసం 30 స్థానాలకు పైగా రావచ్చని రాజకీయ పరిశీలకులు అంచనా వేస్తున్నారు. అదే జరిగి... హంగ్ వచ్చే పక్షంలో ఆ చిన్న పార్టీలు, స్వతంత్రులు నిర్ణేతలుగా మారినా ఆశ్చర్యం లేదన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. రాష్ట్రంలోని మొత్తం 288 అసెంబ్లీ స్థానాలకూ నవంబరు 20న ఒకే విడతలో పోలింగ్ జరగనుంది. ఈ నేపథ్యంలో చిన్న పార్టీల హడావుడి రెండు కూటముల్లోనూ గుబులు రేపుతోంది. దాంతో అందరి దృష్టి నవంబరు 23న వెలువడే ఫలితాల పైనే ఉంది. మహారాష్ట్రలో అసెంబ్లీ ఎన్నికల పోరు పతాక స్థాయికి చేరింది. అధికారం నిలుపుకునేందుకు అన్ని ప్రయత్నాలూ చేస్తున్న బీజేపీ సారథ్యంలోని మహాయుతి, దాన్ని ఎలాగైనా గద్దె దించేందుకు సర్వశక్తులూ ఒడ్డుతున్న కాంగ్రెస్ నాయకత్వంలోని ఎంవీఏ కూటములకు చిన్న పార్టీలు పెద్ద సమస్యగా పరిణమించాయి. జరుగుతున్నది ద్విముఖ పోరే అయినా రెండు కూటముల అధికార ఆశలను ఈ 'తృతీయ శక్తులు' నిర్దేశించేలా కనిపిస్తుండటం ఆసక్తికరంగా మారింది.

ఈ చిన్న పార్టీల్లో ఒక్కోదానికీ ఒక్కో ప్రాంతంలో చెప్పుకోదగిన పట్టు ఉంది. ఈ ఎన్నికల్లో ప్రబల శక్తిగా కనిపిస్తున్న రాజ్ ఠాక్రే సారథ్యంలోని మహారాష్ట్ర నవనిర్మాణ్ సేన (ఎంఎన్ఎస్) విపక్ష ఎంవీఏ కూటమికి గుబులు పుట్టిస్తోంది. రాజధాని ముంబై, శివార్లలో ఎంఎన్ఎస్ హవా అంతా ఇంతా కాదు. ముంబైలోని 25 స్థానాల్లో ఎంఎన్ఎస్ బరిలో ఉంది. రాష్ట్రవ్యాప్తంగా కనీసం మరో 36 అసెంబ్లీ స్థానాల్లో పార్టీ గట్టి ప్రభావం చూపడం ఖాయంగా కనిపిస్తోంది. ముంబైలోని 25 స్థానాల్లో మహాయుతి కూటమి నుంచి శివసేన (షిండే) 12, బీజేపీ 10 చోట్ల పోటీ పడుతున్నాయి. ఎంఎన్ఎస్‌ను బీజేపీకి మిత్రపక్షంగా పరిగణిస్తారు. రాజ్ ఠాక్రేను ప్రసన్నం చేసుకునే ప్రయత్నాల్లో భాగంగా ఆయన కుమారుడు అమిత్ పోటీ చేస్తున్న మాహింలో కూటమి ధర్మాన్ని కూడా బీజేపీ పక్కన పెట్టింది. అక్కడ షిండే సేన అభ్యర్థిని కాదని మరీ అమిత్‌కే బీజేపీ నేతలు బాహాటంగా మద్దతు పలుకుతున్నారు. ఇది ఆ రెండు పార్టీల లోపాయికారీ అవగాహనకు నిదర్శనమని పరిశీలకులు అంటున్నారు. ఇక అసదుద్దీన్ ఒవైసీకి చెందిన మజ్లిస్‌కు కూడా మహారాష్ట్రలో కొంత పట్టు ఉంది. ముఖ్యంగా ఔరంగాబాద్‌తో పాటు ముంబైలోని ముస్లిం ప్రాబల్య ప్రాంతాల్లో పార్టీ హవా కొనసాగుతోంది. 2019లో 44 అసెంబ్లీ స్థానాల్లో పోటీ చేసిన మజ్లిస్ ఈసారి కేవలం 16 స్థానాల్లోనే బరిలో ఉంది. కాకపోతే అవన్నీ ముస్లిం ప్రాబల్య స్థానాలే. వాటిలో కొన్ని స్థానాలను దక్కించుకుంటామని మజ్లిస్ నమ్ముతోంది. అంతేకాకుండా, మిగతా చోట్ల మజ్లిస్ చీల్చే ముస్లిం ఓట్లు... ఎంవీఏ కూటమి అభ్యర్థుల విజయావకాశాలకు గట్టిగా గండి కొట్టేలా కనిపిస్తున్నాయి. 'హంగ్ వచ్చి ఎంవీఏ కూటమి గనక మెజారిటీకి కొన్ని సీట్ల దూరంలో ఆగిపోతే మేము గెలవబోయే సీట్లే కీలకం కావచ్చు. అప్పుడు మజ్లిస్ కింగ్‌మేకర్ అవుతుంది' అని ఆ పార్టీ ఎంపీ ఇంతియాజ్ జలీల్ అభిప్రాయపడ్డారు. నిజానికి ఎంవీఏ కూటమిలో చేరేందుకు మజ్లిస్ విఫలయత్నం చేసింది.

గత ఎన్నికల్లోనూ చిన్న పార్టీలదే హవా

మహారాష్ట్రలో 2019 అసెంబ్లీ ఎన్నికల్లో కూడా చిన్న పార్టీలు తమ హవా కొనసాగించాయి. అవన్నీ కలిసి 29 సీట్లు గెలుచుకోవడమే కాకుండా ఏకంగా మరో 63 అసెంబ్లీ స్థానాల్లో చిన్న పార్టీల అభ్యర్థులు రెండో స్థానంలో నిలవడం విశేషం. ఈసారి కూడా ఆ ఫలితాలే పునరావృతమైతే కూటములకు కష్టకాలమేనన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఎందుకంటే రాష్ట్రంలో చాలా అసెంబ్లీ స్థానాల్లో మొత్తం ఓటర్లు 4 లక్షలు, అంతకన్నా తక్కువే ఉంటారు. 60 శాతం పోలింగ్ జరుగుతుందనుకున్నా సగటున ఒక్కో అసెంబ్లీ స్థానం పరిధిలో 2.5 లక్షల ఓట్లు పోలవుతాయి. పార్టీపరమైన చీలికల దృష్ట్యా ప్రతి స్థానంలోనూ కేవలం లక్ష ఓట్లే విజేతను తేల్చే అవకాశం ఉంది. ఈ అంశమే అనేక స్థానాల్లో చిన్న పార్టీలను ప్రబల శక్తులుగా మారుస్తోంది. దీనికి తోడు గత ఎన్నికలతో పోలిస్తే మహారాష్ట్రలో ఈసారి రాజకీయాలు చాలా భిన్నంగా ఉన్నాయి. దీంతో చిన్న పార్టీ, గట్టి ఇండిపెండెంట్ బరిలో ఉన్న అన్ని స్థానాల్లోనూ మిగతా అభ్యర్థులందరి భవిష్యత్ ప్రభావితమయ్యే పరిస్థితి ఉంది. ఈ కారణంగానే ఈసారి ఫలితాలను అంచనా వేయడం చాలా కష్టమని విశ్లేషకులు అంటున్నారు.

దళిత ఓట్లను చీల్చనున్న వీబీఏ

ఎన్నికల బరిలో ఉన్న వంచిత్ బహుజన్ అఘాడీ (వీబీఏ) అనేక చిన్న పార్టీల కూటమి. అంబేద్కర్ మనవడు ప్రకాశ్ అంబేద్కర్ సారథ్యంలోని ఈ కూటమికి దళితులు, బౌద్ధ దళితులు, ఇతర అణగారిన వర్గాలతో పాటు ముస్లింలలో కూడా మంచి ఆదరణే ఉంది. రిజర్వేషన్లే ప్రధాన నినాదంగా ఈసారి ఏకంగా 67 స్థానాల్లో వీబీఏ బరిలో దిగింది. వీటిలో అత్యధిక స్థానాలు ముంబై, విదర్భ ప్రాంతాల్లోనే ఉన్నాయి. మహారాష్ట్ర జనాభాలో దళితులు 14 శాతం, బౌద్ధ దళితులు 7 శాతం ఉన్నారు. గతంలోనూ అనేక ఎన్నికల్లో వీబీఏ సత్తా చాటింది. విదర్భతో పాటు మరాఠ్వాడా ప్రాంతంలోనూ పార్టీకి ఆదరణ ఉంది. 2019 అసెంబ్లీ ఎన్నికల్లో పెద్దగా సీట్లు రాకపోయినా 7 శాతం ఓట్లు సాధించింది. ఈసారి వీబీఏ భారీగా దళిత ఓట్లు సాధిస్తే ప్రధానంగా ఎంవీఏ కూటమికే దెబ్బ పడుతుంది. 2019లో కూడా కనీసం 10 స్థానాల్లో కాంగ్రెస్, ఎన్సీపీ కూటమి అభ్యర్థుల ఓటమికి వీబీఏ సాధించిన ఓట్లే కారణమని తేలింది. ఇటీవలి లోక్‌సభ ఎన్నికల్లో కూడా అనేక స్థానాల్లో ఎంవీఏ అభ్యర్థుల ఓటమికి వీబీఏనే కారణం. అలాగే, మరికొన్ని చిన్న పార్టీలతో స్థానికంగా గట్టి పట్టున్న స్వతంత్ర అభ్యర్థులు కూడా అనేక స్థానాల్లో కూటముల అభ్యర్థుల గుండెల్లో గుబులు పుట్టిస్తున్నారు. మరోవైపు, మరాఠా హక్కుల ఉద్యమ నేత మనోజ్ జరంగే పాటిల్ కూడా ఈసారి ఎన్నికల్లో గట్టి ప్రభావం చూపించవచ్చని భావిస్తున్నారు. రాష్ట్ర జనాభాలో ఏకంగా 30 శాతానికి పైగా ఉండే మరాఠాల్లో ఆయనకు గట్టి పట్టుండటమే కారణం. ఇటీవలి లోక్‌సభ ఎన్నికల్లో జరంగే సహాయ నిరాకరణ మరాఠ్వాడాతో పాటు పశ్చిమ మహారాష్ట్ర, విదర్భల్లోని అనేక స్థానాల్లో మహాయుతి అవకాశాలను బాగా దెబ్బతీసింది.

మోదీ మణిపూర్‌కు వెళ్లరేం?

- కేంద్ర హోం మంత్రి తీసుకున్న చర్యలేమిటి?
- కాంగ్రెస్ నేత వేణుగోపాల్



న్యూదిల్లీ : మణిపూర్ మండుతున్నప్పటికీ ప్రధాని నరేంద్ర మోదీ కూడా రాష్ట్రాన్ని సందర్శించకపోవడం, కేంద్ర హో మంత్రి అమిత్ షా సమస్య పరిష్కారానికి ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం బాధాకరమని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కె.సి.వేణుగోపాల్ ఆదివారం అన్నారు. పీటీఐకి ఇచ్చిన వీడియో ఇంటర్వ్యూలో వేణుగోపాల్ మాట్లాడుతూ 'మణిపూర్‌లో ఏమి జరుగుతోంది? కేంద్ర హోం మంత్రి ఎన్నికల ప్రచారంలో బిజీగా ఉన్నారు. మన ప్రధాని విదేశాలలో ఉన్నారు. మనలోని ఒక రాష్ట్రం మండుతోంది' అని విమర్శించారు. మణిపూర్ పరిస్థితి ప్రతి భారతీయుడికీ బాధాకరమని, ప్రధాని కూడా రాష్ట్రాన్ని సందర్శించలేదని, కేంద్ర హోం మంత్రి ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని, రాహుల్ గాంధీ ఈ దేశ వాస్తవ సమస్యలపై మాట్లాడుతున్నారని ఆయన అన్నారు. 'బాటేంగే తో కటేంగే' (విభజిస్తే మనం పడిపోతాం) వంటి బీజేపీ నినాదాల గురించి వేణుగోపాల్ మాట్లాడుతూ తమ పార్టీ అలాంటివి నమ్మదని, అసలు సమస్యలపై మహారాష్ట్ర ఎన్నికల్లో పోటీ చేస్తోందని అన్నారు. మోదీ ప్రభుత్వ దుర్మార్గపు విధానాల వల్ల నాగ్‌పూర్‌లో రైతులు నష్టపోతున్నారని ఆయన ఉదాహరణగా చెప్పారు. 'ఈ ఎన్నికలు పేదలు, ధనవంతుల మధ్య పోరు. మేము పేదల కోసం నిలబడతాం. మరోవైపు వారి అజెండా కేవలం ప్రజలను విభజించడమే' అని కేరళలోని అలప్పుజ లోక్‌సభ ఎంపీ నొక్కి చెప్పారు. మహా వికాస్ అఘాడి (ఎంవీఏ) ఎన్నికల్లో ఐక్యంగా పోరాడుతోందని, తప్పకుండా విజయం సాధిస్తుందని చెప్పారు. ఫలితాలు వెలువడిన 24 గంటల్లో ముఖ్యమంత్రిని నిర్ణయిస్తామని ఆయన అన్నారు. 288 మంది సభ్యులున్న మహారాష్ట్ర అసెంబ్లీకి నవంబరు 20 ఎన్నికలు జరగనుండగా, 23న ఓట్ల లెక్కింపు నిర్వహిస్తారు.

రాజకీయ లబ్ధి కోసమే చొరబాటు అంశం

బీజేపీపై బృందా కారత్ ధ్వజం

పాకూర్ (జార్ఖండ్) : ప్రచారం, రాజకీయ లబ్ధి కోసమే ఎన్నికల ప్రచారంలో బీజేపీ చొరబాటు అంశాన్ని లేవనెత్తిందని సీపీఎం సీనియర్ నేత బృందా కారత్ ఆదివారం ఆరోపించారు. పాకూర్‌లో ఆమె విలేకరులతో మాట్లాడుతూ బీజేపీ జార్ఖండ్‌ను 'లూట్‌ఖండ్' (దోపిడీ ప్రదేశం) గా మార్చిందని అన్నారు. 'ఘుస్పతియా' (చొరబాటుదారుడు) అనే పదమే అవమానకరమైనది. వారు జార్ఖండ్‌లో అక్రమంగా ప్రవేశిస్తున్నట్లయితే, కేంద్రం వారిని చట్టం ప్రకారం గుర్తించి బంగ్లాదేశ్ ప్రభుత్వంతో మాట్లాడిన తర్వాత వారిని బహిష్కరించాలన్నారు. 'కానీ దానికి బదులుగా, వారు ప్రచారం కోసం మాత్రమే సమస్యను లేవనెత్తుతున్నారు. దీనికి సంబంధించి ఒక పిటిషన్‌పై జార్ఖండ్ హైకోర్టు సమాధానం కోరినప్పుడు, కేంద్ర ప్రభుత్వం తమ వద్ద ఎటువంటి డేటా లేదని చెప్పింది. అంటే అనుమానంతోనే ఇక్కడ విషం చిమ్ముతున్నారు' అని విమర్శించారు. చొరబాట్లు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా వైఫల్యమని కారత్ ఆరోపించారు. 'బీజేపీ రాష్ట్రాన్ని చాలా కాలం పాలించింది. వారు జార్ఖండ్‌ను 'లూట్‌ఖండ్' (దోపిడీ ప్రదేశం) గా మార్చారు' అని తెలిపారు. ప్రధాని మోదీపై రాహుల్ గాంధీ 'జ్ఞాపకశక్తి కోల్పోవడం'పై ఆమె మాట్లాడుతూ 'వ్యక్తిగత దూషణలపై మా పార్టీకి నమ్మకం లేదు. మా రాజకీయాలు అలా కాదు. బీజేపీ చేస్తుంది' అని అన్నారు.

రాబోయేది ఎంవీఏ ప్రభుత్వం: చెన్నితాలా

న్యూదిల్లీ/ముంబై: మహారాష్ట్ర మహా వికాస్ అగాడీ (ఎంవీఏ) ప్రభుత్వం ఏర్పాటు కాబోతోందని కాంగ్రెస్ రాష్ట్ర ఇన్‌చార్జి రమేశ్ చెన్నితాలా దీమాగా చెప్పారు. తమ సంకీర్ణం ఈ అసెంబ్లీ ఎన్నికల్లో రాణిస్తుందని, సంపూర్ణ మెజారిటీ సాధిస్తుందని వక్కాణించారు. బయట సాయం అవసరం లేకుండా అధికారాన్ని సొంతంగా చేపడుతుందని చెప్పారు. మరోవైపు బీజేపీ అంతర్గత విభేదాలతో అధికార మహాయుతి తర్జనభర్జన పడుతోందని వ్యాఖ్యానించారు. 'ఓ వైపు ప్రధాని మోదీ ఐక్యతతోనే రక్షణ అంటారు... మరోవైపు వేరైతే చస్తామని యూపీ సీఎం యోగి నినదిస్తారు. ఈ నాదాలు కమలం దళాన్ని చీల్చేస్తున్నాయి. మిత్రపక్షాలనే దూరం చేసుకునే పరిస్థితిని బీజేపీకి తెచ్చాయి. మహారాష్ట్ర సంస్కృతికి, ప్రవృత్తికి వ్యతిరేకం కాబట్టి ఈ రెండు నినాదాలు రాష్ట్రంలో పనిచేయలేదు' అని పీటీఐకిచ్చిన ఇంటర్వ్యూలో చెన్నితల అన్నారు. బీజేపీ నేతలు ఎప్పుడు... ఎక్కడ మాట్లాడిన 'హిందూ-ముస్లిం, హిందుస్థాన్, పాకిస్థాన్, కబరిస్థాన్-శంషాన్' మాటలే వినిపిస్తాయని విమర్శించారు. మోదీ ర్యాలీకి అజిత్ పవార్ (ఎన్సీపీ) గైర్హాజరీతో మహాయుతిలో బీటలు స్పష్టమయ్యాయని అన్నారు. అజిత్ వర్గీయులు ముంబై సమావేశానికి వెళ్లలేదని, ప్రధాని సభ పెద్ద ఫ్లాప్ అని చెన్నితల వ్యాఖ్యానించారు. అమరావతిలోనూ బీజేపీ నేతలు కొట్టుకుంటున్నారని, మహాయుతిలో ఐక్యత లేదని అన్నారు. ఎంవీఏలో అంతర్గత విభేదాలు లేవని, 80శాతం రెబెల్స్‌ను బుజ్జగించామని చెప్పారు. 'ఎంవీఏ' ముఖ్యమంత్రి ఎవరన్నది ఎన్నికలకు ముందుకు కాంగ్రెస్ చెప్పదని, పోలింగ్ తర్వాతే చర్చిస్తుందని అన్నారు. ప్రస్తుత సీఎం షిండేనే తమ ముఖ్యమంత్రి అభ్యర్థిగా మహాయుతి ఎందుకు ప్రకటించదని ప్రశ్నించారు. ఎంవీఏలో ఎక్కువ సీట్లు గెలుచుకునే పార్టీకే సీఎం పదవి దక్కుతుందా అనే ప్రశ్నకు 'అలాంటిదేమీ లేదని చెన్నితాలా అన్నారు. సీఎం ఎవరన్నది సామరస్యంగా చర్చించి నిర్ణయిస్తామని, ఇందులో ఎలాంటి సమస్య ఉండదన్నారు. ప్రస్తుతానికి దేశంలోనే అవినీతి ప్రభుత్వాన్ని గద్దె దించడంపైనే దృష్టిని కేంద్రీకరించినట్లు తెలిపారు. మహారాష్ట్రకు హర్యానాతో పొంతన సరికాదని, రెండు రాష్ట్రాల పరిస్థితి వేరని అన్నారు. మహారాష్ట్ర ప్రజలు రాజకీయ మార్పును కోరుకుంటున్నారని చెప్పారు. సార్వత్రిక ఎన్నికల్లో ఎంవీఏ 48కుగాను 31 స్థానాలు గెలుచుకుందని గుర్తుచేశారు. ప్రస్తుత ప్రభుత్వంతో రాష్ట్ర ప్రజలు విసిగిపోయారన్నారు. 'ఉద్ధవ్ ప్రభుత్వాన్ని కూల్చిన విధానం... ఈడీ, సీబీఐ సాయంతో కొత్త ప్రభుత్వం ఏర్పాటు కావడం మహారాష్ట్ర ప్రజలకు నచ్చలేదు. దీటైన బదులు ఇచ్చేందుకు వారు సిద్ధంగా ఉన్నారు' అని చెన్నితాలా అన్నారు. కాగా ఈనెల 20న పోలింగ్ జరగనుంది.

మోదీ పథకాలకు సొరేన్ అడ్డంకులు: నడ్డా

ధన్‌బాద్: జార్ఖండ్‌లో జేఎంఎం-కాంగ్రెస్-ఆర్జేడీ కూటమి ఏర్పాటు వెనుక స్వార్థపూరిత ఉద్దేశాలున్నాయని బీజేపీ అధ్యక్షుడు జేపీ నడ్డా ఆరోపించారు. ధన్‌బాద్ జిల్లా సింద్రీలో ఆదివారం జరిగిన ఎన్నికల ప్రచార సభలో ఆయన మాట్లాడుతూ... జార్ఖండ్‌లో అధికార జేఎంఎం నేతృత్వంలోని సంకీర్ణం ప్రభుత్వంపై విమర్శలు చేశారు. స్వార్థ ఉద్దేశాలు కూటమి ఏర్పాటుకు దారితీశాయని...ఇది గిరిజన, రైతు, దళితులకు వ్యతిరేకమన్నారు. అవినీతి, వంశ రాజకీయాలు, ఓటు బ్యాంకు రాజకీయాల కోసం బుజ్జగింపులను ప్రోత్సహిస్తుందని, జార్ఖండ్‌లో ప్రధాని నరేంద్ర మోదీ ప్రారంభించిన అభివృద్ధి పనులకు ముఖ్యమంత్రి హేమంత్ సొరేన్ అడ్డంకులు సృష్టిస్తున్నారని నడ్డా ఆరోపించారు. సొరేన్ ప్రభుత్వం చొరబాట్లను ప్రోత్సహిస్తోందన్న నడ్డా... బీజేపీ వస్తే... గిరిజన మహిళలను వివాహం చేసుకునే చొరబాటుదారుల సంతానానికి భూమిని బదిలీ చేయడాన్ని నిరోధించడానికి చట్టం తీసుకువస్తామన్నారు. హేమంత్ సొరేన్ ప్రభుత్వం రూ.4,000 కోట్ల జల్ జీవన్ మిషన్ కుంభకోణం, రూ.5,000 కోట్ల మైనింగ్ కుంభకోణం, రూ.236 కోట్ల భూ కుంభకోణానికి పాల్పడిందని ఆయన ఆరోపించారు. జార్ఖండ్‌లో అభివృద్ధిని వేగవంతం చేయడానికి డబుల్ ఇంజిన్ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాల్సిన సమయం ఆసన్నమైందని నడ్డా అన్నారు. రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వం ఏర్పడ్డాక అనేక అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభమవుతాయని తెలిపారు. ప్రధాని మోదీ హయాంలో ఔషధాల ఎగుమతి 138 శాతం పెరిగిందని, భారత్ 97 శాతం మొబైల్ ఫోన్లను తయారు చేస్తోందని చెప్పుకొచ్చారు. మోదీ హయాంలో 1.46 లక్షల కిలోమీటర్ల మేర జాతీయ రహదారులు నిర్మించగా, 61 వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైళ్లను ప్రారంభించామన్నారు.

ఉద్యోగాల కల్పనలో మహాయుతి విఫలం

ప్రియాంక

ముంబై: కొన్ని ముఖ్యమైన ప్రాజెక్టులను గుజరాత్‌కు తరలించడం వల్లే మహారాష్ట్రలో యువతకు ఉద్యోగాల్లేకుండా పోయాయని కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి ప్రియాంకా గాంధీ కేంద్రంలోని మోదీ సర్కారుపై విమర్శలు గుప్పించారు. ఆదివారం ఆమె గడ్చిరోలి జిల్లాలో జరిగిన ఎన్నికల సభలో మాట్లాడారు. ఫాక్స్‌కాన్, ఎయిర్‌బస్ ప్రాజెక్టులను గుజరాత్‌కు తరలించారన్నారు. మహారాష్ట్రలో 2.5 లక్షలకు పైగా పోస్టులు ఖాళీగా ఉన్నాయని ఆమె పేర్కొన్నారు. యువత తమ నైపుణ్యాలను మెరుగుపరుచుకుంటూ, కొత్త విషయాలను నేర్చుకుంటున్నా కూడా రాష్ట్ర ప్రభుత్వం వారికి ఉద్యోగావకాశాలు కల్పించట్లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. యువతకు ఉద్యోగాల కల్పనలో మహాయుతి ప్రభుత్వం విఫలమయ్యిందని దుయ్యబట్టారు. రాష్ట్రంలో సమస్యల నుంచి ప్రజల దృష్టి మరల్చడానికి మహాయుతి నాయకులు లడ్కీ బహిన్ వంటి పథకాలను తీసుకువస్తున్నారని ఆరోపించారు. మహిళలు నెలకు అందే రూ.1500 కోసం కాకుండా మెరుగైన జీవితం కోసం ఓటువేయాలని కోరారు. ప్రతిపక్ష మహా వికాస్ అఘాడి (ఎంవీఏ) కూటమిని గెలిపించినట్లయితే సోయాబీన్ పంటకు క్వింటాల్‌కు రూ. 7,000 కనీస మద్దతు ధర(ఎంఎస్‌పీ) ఇస్తామని హామీ ఇచ్చారు. ఐక్యంగా ఉంటే భద్రంగా ఉండొచ్చని బీజేపీ చేస్తున్న నినాదాలు పేద ప్రజల కోసం కాదని.. పెద్ద పెద్ద వ్యాపారాలు చేస్తున్న వారి మిత్రులు ఐక్యంగా ఉండాలని సూచిస్తున్నారని ఎద్దేవా చేశారు. బీజేపీ ఎవరి అభివృద్ధి గురించి కృషి చేస్తోందో దేశం మొత్తానికి తెలుసన్నారు. పదేళ్ల మోదీ పాలనలో రైతులు, కార్మికులు రోడ్డుపడితే... వ్యాపారవేత్తల పరిశ్రమలు భద్రంగా ఉన్నాయని విమర్శించారు. విమానాశ్రయాలు, ఓడరేవుల సహా దేశంలోని వివిధ ప్రధాన కంపెనీలు అదానీ ఆధీనంలో ఉన్నాయని, ప్రభుత్వ విధానాలు ఒక వ్యక్తికి అనుకూలంగా ఉండేలా మోదీ మార్పులు చేస్తున్నారని ప్రియాంక మండిపడ్డారు. దేశానికి చెందిన ఆస్తులను ఒకరికి కేటాయించడానికి చూపించే నిబద్ధత యువతకు ఉద్యోగాలు కల్పించడంపై కూడా ఉండాలని హితవు పలికారు. కాంగ్రెస్ హయాంలో రాజకీయ నాయకులు ప్రజలకు జవాబుదారీగా ఉండేవారని..ప్రస్తుత ఎన్డీఏ పాలనలో ఈ జవాబుదారీతనం లేకుండా పోయిందని విమర్శించారు. ఎంవీఏ అధికారంలోకి వస్తే ఉద్యోగాల కల్పన, ప్రజల అభివృద్ధే లక్ష్యంగా పరిపాలన సాగిస్తామని హామీ ఇచ్చారు. నవంబర్ 20న జరగనున్న ఎన్నికల్లో మహాయుతి కూటమిని చిత్తుగా ఓడించాలని ప్రియాంక పిలుపునిచ్చారు.

హుటాహుటిన దిల్లీకి అమిత్‌షా

న్యూదిల్లీ: మణిపూర్ అట్టుడికిపోతోంది. నిత్యం హింస చోటుచేసుకుంటోంది. పరిస్థితి క్షీణిస్తుండటంతో మహారాష్ట్ర ఎన్నికల ప్రచార ర్యాలీలను కేంద్ర హోంమంత్రి అమిత్‌షా ఆదివారం రద్దు చేసుకున్నారు. అక్కడ నుంచి వెంటనే దిల్లీకి తిరిగొచ్చారు. ఈశాన్య రాష్ట్ర పరిస్థితులపై ఆరా తీశారు. సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. శనివారం రాత్రి మరో ముగ్గురు బీజేపీ శాసనసభ్యుల ఇళ్లకు ఆందోళనకారులు నిప్పుపెట్టారు. తూర్పు ఇంఫాల్‌లోని సీఎం ఎన్ బీరేన్ సింగ్ పూర్వీకుల ఇంటికి వెళ్లేందుకు ప్రయత్నించారు. సీఎం ఇంటికి 100-200 మీటర్ల దూరంలోనే అసోం రైఫిల్స్, బీఎస్‌పీ సిబ్బంది వారిని అడ్డుకున్నారు. బాష్పవాయువు, రబ్బర్ బుల్లెట్‌లను వినియోగించి చెదరగొట్టారు. ఆందోళనలు తీవ్రరూపం దాల్చడంలో మణిపూర్‌లోని కొన్ని ప్రాంతాల్లో కర్ఫ్యూ అమలైంది. ఈ పరిస్థితుల దృష్ట్యా బీజేపీ తరపున మహారాష్ట్రలో ప్రచార ర్యాలీల్లో పాల్గొనాల్సిన అమిత్‌షా అన్ని కార్యక్రమాలు రద్దు చేసుకొని దేశ రాజధానికి తిరిగి వచ్చారని వర్గాలు పేర్కొన్నాయి. దీనిపై అధికారిక ప్రకటన రాలేదు. ఈశాన్య రాష్ట్ర పరిస్థితిని సమీక్షించేందుకు, రాష్ట్ర ప్రభుత్వానికి సహకరించేందుకు కేంద్ర భద్రతాధికారుల బృందం త్వరలోనే మణిపూర్‌కు వెళ్లనున్నది.

ఆగస్టు 15నే పడిన బీజం

అప్పటి నుంచే చెడిన కేజ్రీవాల్, గెహ్లాట్ సంబంధాలు

న్యూదిల్లీ: ఆమ్ ఆద్మీ పార్టీ సీనియర్ నేత, దిల్లీ మంత్రి కైలాశ్ గెహ్లాట్ ఆ పార్టీకి రాజీనామా చేశారు. ఆప్‌ను వివాదాలు చుట్టుముట్టడం ఇబ్బందికరంగా మారినందనే పార్టీని వీడుతున్నట్లు రాజీనామా లేఖలో వెల్లడించారు. గెహ్లాట్ రాజీనామాను ప్రేరేపించే పరిస్థితులకు బీజం ఆగస్టు 15నే పడింది. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా దిల్లీ ప్రభుత్వం తరపున పతాకావిష్కరణ చేసేది ఎవరన్న అంశం ఆప్ నాయకత్వానికి గెహ్లాట్‌కు మధ్య మనస్పర్థలకు దారితీసింది. ముఖ్యమంత్రిగా ఉన్న అరవింద్ కేజ్రీవాల్ జైలుకు వెళ్లడంతో ఆయన స్థానంలో ఎవరు జెండా ఎగురవేయాలన్న ప్రశ్న తెరపైకొచ్చింది. దిల్లీ విద్యాశాఖ మంత్రిగా ఉన్న అతిశికి ఈ బాధ్యతను కేజ్రీవాల్ అప్పగించారు. ఇందుకు లెఫ్టినెంట్ గవర్నర్ వీకే సక్సేనా అభ్యంతరం చెప్పారు. దిల్లీ హోంమంత్రి కైలాశ్ గెహ్లాట్ ఈ పని చేయడం సబబుగా ఉంటుందని చెప్పారు. హోంశాఖ పరిధిలో పోలీసులు ఉంటారు కాబట్టి హోంమంత్రి చేతుల మీదుగా జెండా వందనం జరగాలని ఎల్‌జీ నొక్కిచెప్పారు. ఇది ఆప్ ప్రభుత్వానికి, ఎల్‌జీ కార్యాలయానికి మధ్య అధికార పోరుకు దారితీసింది. లెఫ్టినెంట్ గవర్నర్ తమ ప్రభుత్వాన్ని చిన్నచూపు చూస్తున్నారని, చౌకబారు రాజకీయాలు చేస్తున్నారని ఆప్ ఆరోపించింది. ఎల్‌జీ నియంతలా వ్యవహరిస్తున్నారని అతిశి విమర్శించారు. బీజేపీ ఏ మేరకు ప్రజాస్వామ్యానికి కట్టుబడి ఉందో చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ పరిస్థితులు కేజ్రీవాల్, ఆప్‌తో గెహ్లాట్ సంబంధాలను చెడగొట్టాయి. గతేడాది డిసెంబరులో గెహ్లాట్ వద్దనున్న న్యాయ శాఖను అతిశికి అప్పగించారు. శాఖాపరంగా చాలా పని పెండింగ్ ఉండటంతో ఈ నిర్ణయం తీసుకోవాల్సి వచ్చిందని పార్టీ వర్గాలు వెల్లడించాయి.

అప్పటివరకు కుకీ యువకుల అంత్యక్రియలు జరగవు: ఐటీఎల్ఎఫ్

చురచంద్‌పూర్/గౌహతి: సీఆర్‌పీఎఫ్‌తో జరిగిన కాల్పుల్లో మరణించినట్లు చెప్పబడుతున్న 10 మంది కుకీ-జో యువకుల అంత్యక్రియలు...వారి పోస్ట్‌మార్టం నివేదికలను సంబంధిత కుటుంబాలకు అందజేసే వరకు నిర్వహించబోమని ఆ సమాజానికి ప్రాతినిథ్యం వహిస్తున్న ఇండిజినస్ ట్రైబల్ లీడర్స్ ఫోరమ్ (ఐటీఎల్ఎఫ్) వెల్లడించింది. 'మాకు ఇంకా పోస్ట్‌మార్టం నివేదికలు రాలేదు. అవి లేకుండా, మేము మృతదేహాలను తాకలేము. ఎందుకంటే మేము మృతదేహాలను టాంపరింగ్ చేస్తే... కొన్ని చట్టబద్ధత సమస్యలు ఉండవచ్చు' అని ఐటీఎల్ఎఫ్ ప్రతినిధి గింజా వల్జాంగ్ పీటీఐకి చెప్పారు. మృతదేహాలు శనివారం ఇక్కడికి వచ్చిన తర్వాత ప్రస్తుతానికి స్థానిక ఆసుపత్రి మార్చురీలో ఉంచినట్లు ఆయన తెలిపారు. చనిపోయిన 10 మంది కుకీ-జో యువకులు ఉగ్రవాదులని మణిపూర్ ప్రభుత్వం ప్రకటించగా... ఐటీఎల్ఎఫ్ మాత్రం వారిని గ్రామ వాలంటీర్లుగా పేర్కొంది. 10 మంది యువకుల పోస్ట్‌మార్టం అసోంలోని సిల్చార్ మెడికల్ కాలేజ్ అండ్ హాస్పిటల్ (ఎస్ఎంసీహెచ్)లో నిర్వహించారు. 'మేము డాక్యుమెంట్ల కోసం ఎదురు చూస్తున్నాము, ఏమి జరుగుతుందో నాకు తెలియదు. నివేదికలు అందకపోతే, మేము మళ్లీ ఇక్కడ పోస్ట్ మార్టం పరీక్ష చేయవలసి ఉంటుంది. కాబట్టి, ఈ లాంఛనాలన్నీ జరిగితే తప్ప అంత్యక్రియలు జరగవు' అని వల్జాంగ్ చెప్పారు. చురచంద్‌పూర్ జిల్లా ఆసుపత్రిలో మళ్లీ శవపరీక్ష నిర్వహించేందుకు గల అవకాశాలను పరిశీలిస్తున్నామని ఐటీఎల్ఎఫ్ సీనియర్ నేతల సమావేశంలో తుది నిర్ణయం తీసుకుంటామని ఆయన చెప్పారు.

రాజకీయ చర్చల వేగవంతానికి

నేడు దిల్లీకి నాగాలాండ్ మంత్రివర్గం

కోహిమా: నాగా రాజకీయ చర్చలు వేగవంతం చేసేలా కేంద్రప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని నాగాలాండ్ ప్రభుత్వం నిర్ణయించింది. నాగా రాజకీయ చర్చల పరిష్కారంలో జాప్యం కారణంగా తిరిగి అడవుల్లోకి వెళ్తామని ఎన్ఎస్‌సిఎన్-ఐఎం బెదిరించిన నేపథ్యంలో కేంద్ర హోంమంత్రి అమిత్ షాను కలిసేందుకు ముఖ్యమంత్రి నీఫియు రియో, ఆయన డిప్యూటీలు టీఆర్ జెలియాంగ్, వై పాటన్ నేతృత్వంలోని నాగాలాండ్ మంత్రివర్గ ం సోమవారం దిల్లీకి వెళ్లనుంది. ప్రత్యేకించి నాగా జాతీయ జెండా, రాజ్యాంగం గుర్తింపు సహా చారిత్రాత్మక ఒప్పందంలోని ముఖ్య నిబంధనలను గౌరవించటానికి కేంద్రం ఉద్దేశపూర్వకంగా నిరాకరిస్తోందని ఎన్ఎస్‌సిఎన్-ఐఎం ప్రధానకార్యదర్శి టీహెచ్ ముయివాహ్ ఓ ప్రకటనలో ఆరోపించారు. "హింసాత్మక సాయుధ పోరాటం" తప్పదని బెదిరిస్తూ...ఎన్ఎస్‌సిఎన్-ఐఎం ఈ నెల 7వ తేదీన నాగా రాజకీయ సమస్యపై ప్రతిష్టంభన పరిష్కరించడానికి మూడవ పక్షం జోక్యం కోరింది. 1997 నుంచి కాల్పుల విరమణను కొనసాగిస్తున్న ఈ తిరుగుబాటు గ్రూపు ఆగస్టు 3, 2015న కుదిరిన ఒప్పందాన్ని అమలు చేయకుండా కేంద్రం ద్రోహం చేసిందని ఆరోపించింది. శనివారం ఒక వార్తా ఛానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఉప ముఖ్యమంత్రి జెలియాంగ్ మాట్లాడుతూ... కేబినెట్ సమావేశం ముయివాహ్ ప్రకటనపై చర్చించిందని... దీనిపై కేంద్ర హోం మంత్రిని, ఎన్ఎస్‌సిఎన్-ఐఎం నాయకత్వాన్ని కూడా కలవాలని నిర్ణయించుకున్నట్లు చెప్పారు. 'ఒక మీటింగ్ పాయింట్ ఉండాలి... ఇరువర్గాలు పునరాలోచించుకోవాలి. ఒక అవగాహనకు రావాలి" అని ఆయన అన్నారు. దిల్లీకి వెళ్లే ముందు రాష్ట్ర మంత్రివర్గం ఎన్ఎస్‌సిఎన్-ఐఎం నాయకత్వాన్ని సంప్రదిస్తోందని సంబంధిత వర్గాలు తెలిపాయి. మరోవైపు, ఏడు నాగా గ్రూపులతో కూడిన 'డబ్ల్యుసిఎన్ఎన్‌పిజి' ప్రస్తుతానికి సాధ్యమయ్యే ప్రతిదాన్ని అంగీకరిస్తామని, మిగిలిన డిమాండ్ల కోసం తదుపరి చర్చలను కొనసాగిస్తామని ప్రకటించాయి.

ఆప్‌కు సీనియర్ మంత్రి రాజీనామా

న్యూదిల్లీ: దిల్లీ అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో అధికారంలో ఉన్న ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్)కి సీనియర్ మంత్రి కైలాశ్ గెహ్లోట్ రాజీనామా చేశారు. పదవితోపాటు పార్టీకి కూడా గుడ్‌బై చెప్పేశారు. దిల్లీ మాజీ సీఎం, ఆప్ అధ్యక్షుడు అరవింద్ కేజ్రీవాల్‌కు తన రాజీనామా లేఖ పంపారు. పార్టీలో ఉన్న అనేక లుకలుకలను ఆయన ఎత్తిచూపారు. రాజకీయ ఆశయాలు, ప్రజల పై పార్టీ నిబద్ధతను ప్రశ్నించారు. యమునా నది పరిశుభ్రతతో సహా ప్రజలకు ఇచ్చిన అనేక వాగ్దానాలు నెరవేరలేదని ఆరోపించారు. కేజ్రీవాల్ సీఎంగా ఉన్నప్పుడు అధికార నివాసమైన 'శీష్‌మహల్' ఆధునీకరణకు సుమారు రూ.45 కోట్లు ఖర్చు చేయడంపై వచ్చిన విమర్శలను ఆయన ప్రస్తావించారు. వీటి వల్ల ప్రజలు ఆప్‌పై నమ్మకం కోల్పోయారని అన్నారు. మరోవైపు కేంద్రంతో పోరాడటానికి ఎక్కువ సమయాన్ని వెచ్చిస్తే దిల్లీ అభివృద్ధి జరగదని స్పష్టమవుతున్నదని తెలిపారు. 'దిల్లీ ప్రజలకు సేవ చేయాలనే నిబద్ధతతో నేను రాజకీయ ప్రయాణాన్ని ప్రారంభించా. దానిని కొనసాగించాలనుకుంటున్నా. అందుకే ఆప్ నుంచి వైదొలగడం తప్ప మరో మార్గం లేకపోవడంతో ఆప్ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేశా. మీ ఆరోగ్యం, భవిష్యత్తు కోసం శుభాకాంక్షలు తెలియజేస్తున్నా' అని కేజ్రీవాల్‌కు రాసిన లేఖలో పేర్కొన్నారు. కాగా, దిల్లీ ప్రభుత్వంలో హోం, రవాణా, ఐటీ, మహిళ-శిశు అభివృద్ధితో సహా కీలకమైన శాఖలు నిర్వహిస్తున్న కైలాశ్ గెహ్లోట్ రాజీనామాను దిల్లీ సీఎం అతిశి ఆమోదించారు. ఆయన బీజేపీలో చేరవచ్చని తెలుస్తోంది.

విశాలాంధ్ర హైదరాబాద్

గ్రూప్-3 పరీక్షా కేంద్రం కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

విశాలాంధ్ర- హైదరాబాద్ : టీజీపీఎస్సీ గ్రూప్-3 పరీక్షలను ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా పగడ్బందీగా నిర్వహించాలని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అధికారులను ఆదేశించారు. ఆదివారం మెహదీపట్నంలోని జి.పుల్లారెడ్డి డిగ్రీ, పీజీ కళాశాల కేంద్రంలోని గ్రూప్-3 పరీక్ష కేంద్రాలను ఆయన ఆకస్మికంగా సందర్శించి పరీక్ష జరుగుతున్న తీరును పరిశీలించారు. అనంతరం అధికారులకు తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరీక్ష ప్రశాంతంగా జరిగేలా చూడాలన్నారు. పరీక్ష సమయంలో ఇలాంటి పొరపాట్లకు తావు లేకుండా పకడ్బందీగా నిర్వహించాలన్నారు. పరీక్ష కేంద్రాల్లోకి ఎటువంటి ఎలక్ట్రానిక్ వస్తువులకు అనుమతించకూడదని అభ్యర్థులను క్షుణ్ణంగా పరిశీలించిన అనంతరమే పరీక్ష కేంద్రంలోకి వెళ్లేలా చూడాలన్నారు. మొదటిరోజు ఉదయం జరిగిన గ్రూప్-3 పేపర్-1 జనరల్ స్టడీస్ అండ్ జనరల్ ఎబిలిటీస్ పరీక్షకు జిల్లాలోని 102 పరీక్ష కేంద్రాల్లో 45918 అభ్యర్థులకు గాను 18967 అభ్యర్థులు పరీక్షకు(41.31 శాతం) మంది హాజరయ్యారని, 26951 మంది అభ్యర్థులు ఆబ్సెంట్ అయ్యారని కలెక్టర్ తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెంట కళాశాల ప్రిన్సిపల్ మురళీకృష్ణ, అబ్జర్వర్లు స్వప్న, మంగు బాయి తదితరులు పాల్గొన్నారు.

వక్ఫ్ బోర్డ్ పేరుతో రిజిస్ట్రేషన్లు నిలిపివేయడం దారుణం : ఎమ్మెల్యే

విశాలాంధ్ర - మల్కాజిగిరి : మౌలాలి డివిజన్ పరిధిలోని సుధానగర్ మోడల్ కాలనీ, న్యూ వేంకటేశ్వర నగర్ ద్వారకామాయి కాలనీ ఫేస్ 2 ఈ మూడు కాలనీల ప్రజల ఆహ్వానం మేరకు ఎమ్మెల్యే మర్రి రాజశేఖర రెడ్డి పర్యటించారు. వక్ఫ్ బోర్డు రిజిస్ట్రేషన్ల నిలిపివేత కోరుతూ చేసిన ప్రకటనతో భయాందోళనకు గురైన ప్రజలకు నేనున్నానని ఎమ్మెల్యే భరోసానిచ్చారు. దాదాపు ముప్పై ఏళ్ల క్రితం ఏర్పాటైన కాలనీలు, బస్తీల నుండి అన్ని రకాల పన్నులు వసూలు చేస్తూ, పర్మిషన్లు ఇస్తూ ప్రభుత్వాలు అన్ని సౌకర్యాలు అనగా సి.సి.రోడ్డు, డ్రైనేజీ వ్యవస్థ, వీధి దీపాలు కరెంట్ మీటర్లు వంటి ప్రభుత్వ పరమైన సౌకర్యాలు కల్పించడం జరిగింది. ఇప్పుడు హఠాత్తుగా రిజిస్ట్రేషన్లు నిలిపివేయాలని వక్ఫ్ బోర్డు ప్రకటించడం ప్రభుత్వ అనాలోచిత చర్య అని, దీనిపై అవసరమైతే ప్రజల పక్షాన నిలబడి సుప్రీంకోర్టుకు వెళ్లి ప్రజలకు న్యాయం జరిగేలా పోరాటం చేస్తామన్నారు. న్యాయపరమైన పోరాటానికి ఒక్క పైసా కూడా ప్రజలు ఖర్చు చేయవద్దని, మొత్తం ఖర్చు ఎంతైనా తానే భరిస్తామని ఎమ్మెల్యే అన్నారు. చిత్తశుద్ధితో ప్రజల కంటే తానే ముందుండి పోరాటం చేస్తున్న ఎమ్మెల్యే ఉండడం మా అదృష్టమని, ఎమ్మెల్యేతో మాట్లాడిన తరవాత మాకు చాలా ధైర్యం వచ్చిందని, ఏ ఒక్క నాయకుడు కూడా వక్ఫ్ బోర్డు సమస్యపై స్పందించలేదని ప్రజలు అంటున్నారన్నారు. ఈ కార్యక్రమంలో బి.ఆర్.ఎస్ నాయకులు సుధనగర్ మోడల్ కాలనీ, న్యూ వేంకటేశ్వర నగర్, ద్వారకామాయి ఫేస్ 2 ప్రజలు భారీగా పాల్గొన్నారు.

గ్రంధాలయాల అభ్యున్నతికి కృషి చేయాలి

విశాలాంధ్ర-దుండిగల్: గ్రంథాలయాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించి వాటి అభ్యున్నతికి కృషి చేయాలని టిపిసిసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, కాంగ్రెస్ నాయకులు నర్సారెడ్డి భూపతిరెడ్డి పేర్కొన్నారు. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా బొంగునూరి శ్రీనివాస్‌రెడ్డి ఎన్నికైన సందర్భంగా ఆదివారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధి బాచుపల్లి కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో టిపిసిసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు నర్సారెడ్డి భూపతిరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు. అనంతరం నర్సారెడ్డి భూపతిరెడ్డి బొంగునూరి శ్రీనివాస్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలియచేస్తూ జిల్లా గ్రంధాలయ సంస్థను పటిష్టపరుస్తూ గ్రంధాలయాల అభ్యున్నతికి కృషి చేయాలని సూచించారు.

వైభవంగా సాగుతున్న మైసిగండి బ్రహ్మోత్సవాలు

విశాలాంధ్ర - అమనగల్లు : ఆపద మొక్కుల అమ్మగా, పేదల ఇలవేల్పుగా రాష్ట్ర స్థాయిలో ప్రసిద్ధి చెందిన కడ్తాల మండలం మైసిగండి మైసమ్మ దేవాలయం బ్రహ్మోత్స వాలు కనుల పండువగా కొనసాగుతున్నాయి. ఉత్సవాలను తిలకించేందుకు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివస్తున్నారు. అమ్మవారిని పట్టువస్త్రాలు, ఆభరణాలతో శోభాయమానంగా అలంకరించి ప్రత్యేక పూజలు అభిషేకాలు చేశారు. మహిళలు అమ్మవారికి బోనాలను సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు భక్తుల మైసమ్మ నామస్మరణతో మైసిగండి ఆలయం మార్మోగింది. ఆలయంలోని పుట్ట వద్ద మహిళలు పూజలు నిర్వహించారు. పలువురు తాజా మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు మైసమ్మ దేవతను దర్శించుకొని పూజలు చేశారు. ఆదివారంతో బ్రహ్మోత్సవాలు భక్తుల రద్దీ పెరిగింది. పంటలు భాగా పండాలని, వ్యాపారాలు అభివృద్ధి సాధించాలని కోరుతూ అమ్మవారికి మొక్కులు సమర్పించుకున్నారు. ఈ సందర్భంగా భక్తులు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, తమ వాహనాలకు పూజలు చేయించుకున్నారు. ఆలయానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఫౌండర్ ట్రస్టీ రామావత్ సిరోలిపంతూ, ఈవో స్నేహలత, టీపీసీసీ సభ్యుడు అయిళ్ల శ్రీనివాసగౌడ్, ఆలయ అర్చకులు పాల్గొన్నారు.

జన గణనలో కులగణన చేపట్టాలి

ఈనెల 25న బీసీల సమరభేరి పోస్టర్ ఆవిష్కరణ

విశాలాంధ్ర - హైదరాబాద్ : జన గణనలో కులగణన చేపట్టాలని పార్లమెంట్‌లో బి.సి బిల్లు పెట్టి చట్టసభలలో బి.సిలకు 50 శాతం రిజర్వేషన్లు పెట్టాలని, కేంద్రంలో బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ పెట్టాలని, బి.సి ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు కల్పించాలని, ప్రైవేటు రంగంలో ఎస్‌సి, ఎస్‌టి, బిసి లకు రిజర్వేషన్లు పెట్టాలని డిమాండ్ చేశారు. జాతీయ బి.సి సంక్షేమ సంఘం అధ్వర్యంలో కోర్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేయంలో ఈ నెల 25న రవీంద్ర భారతిలో జరిగే బి.సి.ల సమరబేరి పోస్టర్ ను జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు, ఆర్. కృష్ణయ్య ఆవిష్కరించారు. ఈ సమావేశానికి గుజ్జ కృష్ణ, నందా గోపాల్, నీల వెంకటేష్ ఆధ్వర్యంలో జరిగింది. రాజ్యాధికారంలో వాటా పంచకుండా బీసీలకు ఎన్ని రోజులు అన్యాయం చేస్తారని ఆర్.కృష్ణయ్య ప్రశ్నించారు. సమావేశాన్ని ఉద్దేశించి ఆర్.కృష్ణయ్య ప్రసంగిస్తూ అన్ని రంగాలలో అభివృద్ధి చెందిన అగ్రకులాలకు ఒకే రోజులో బిల్లు పెట్టి ఆఘ-మేఘాల మీద 10 శాతం రిజర్వేషన్లు పెట్టారు. కాని బి.సి లకు చట్ట సభలలో రిజర్వేషన్లు పెట్టాలని 30 సం.రాలుగా పోరాడుతున్నా కేంద్ర ప్రభుత్వం పట్టించుకోవడంలేదని విమర్శించారు. ఈ దేశంలో బి.సి లను బిచ్చగాళ్ళను చేశారని విమర్శించారు. బి.సిలకు రాజ్యాధికారంలో వాటా ఇవ్వకుండ గొర్రెలు, బర్రెలు, పందులు, పెన్షన్లు ఇచ్చి ఓట్లు వేయించుకొని బి.సిలను శాశ్వత బిచ్చగాళ్ళను చేస్తున్నారని విమర్శించారు. చివరకు కులగణన చేసి బీసీల జనాభా కూడా లెక్కించడానికి ఈ అగ్రకుల ప్రభుత్వాలకు మనసు రావడం లేదు. లెక్కలు తీస్తే రిజర్వేషన్లు పెంచవలసి వస్తుందని భయపడుతు న్నారు. ప్రజలకు, కుక్కలకు, ఇతర జంతువులకు లెక్కలు ఉన్నవి కానీ బీసీలు ఎంతమంది ఉన్నారో లెక్కలు లేవన్నారు. బీసీలకు కేంద్రస్థాయిలో ఒక్క స్కీము కూడా లేదు. కాలేజీ కోర్సుల్లో చదివే విద్యార్థులకు ఫీజులు కూడా మంజూరు చేయడం లేదు. భారతదేశం అగ్ర దేశంగా తయారవుతుందని గొప్పలు చెప్పుకుంటున్న నేతలు చదువుకునే పేద పిల్లలకు ఫీజులు కూడా కట్టే స్థితిలో లేదన్నారు. రాజ్యాంగ రచన సమయంలోనే బి.సిలకు విద్యా, ఉద్యోగ, రాజకీయ, సామాజిక రంగాలలో రిజర్వేషన్లు పెడితే ఎంతో ప్రగతి జరిగేది. ప్రజాస్వామ్య వ్యవస్థలో అన్ని కులాలకు, సామాజిక వర్గాలకు వారి వారి జనాభా ప్రకారం రాజకీయ రంగంలో ప్రాతినిధ్యం కల్పించాలి. కానీ మనదేశంలో 56 శాతం జనాభా కలిగిన బీసీలకు ఇంతవరకు చట్టసభల్లో రిజర్వేషన్లు కల్పించకుండా ఈ కులాలను అణచిపెట్టారు. ప్రపంచంలో అణచివేతకు వివక్షకు గురైన అన్ని వర్గాలకు, అన్ని రంగాలలో వాటా ఇచ్చి ఇతర అభివృద్ధి చెందిన వర్గాలతో సమానంగా అభివృద్ధి చేశారు. కానీ మనదేశంలో పీడిత కులాలను ఇంకా అంది వేయడానికి చూస్తున్నారు తప్ప అభివృద్ధి చేయడానికి చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు. బి.సి లకు రాజకీయంగా అన్యాయం జరుగుతుందని గణాంకాలు తెలుపుతునాయి. 29 రాష్ట్రాలలో 16 రాష్ట్రాల నుండి ఒక్క బి.సి. పార్లమెంట్ సభ్యులు లేరు. అలాగే ప్రస్తుత లోక్ సభలో 545 లోక్ సభ సభ్యులలో బి.సిలు కేవలం 96 మంది మాత్రమే ఉన్నారు. ప్రజాస్వామ్య స్ఫూర్తి ఎక్కడ కనిపిస్తుంది. తెలంగాణలో 119 ఎమ్మెల్యేలు ఉంటే బి.సి లు కేవలం 22 మంది మాత్రమే ఉన్నారు. తెలంగాణ రాష్టంలో 33 జిల్లాలు ఉండగా 18 జిల్లాల నుంచి ఒక్క బి.సి శాసనసభ్యులు లేరు. ఆంధ్రప్రదేశ్ 175 మంది ఎమ్మెల్యేలు ఉండగా బీసీ 40 మంది దాటడం లేదు 50శాతం జనాభాలో ఎంత తక్కువ ప్రాతినిధ్యమా ఇదేనా ప్రజాస్వామ్యం. రాష్ట్రంలో 112 బి సి కులాలు ఉండగా 104 కులాలు ఇంతవరకు అసెంబ్లీ గడప తొక్కలేదు.

ఇంత తక్కువ ప్రాతినిధ్యం చూస్తే ఇదెలా ప్రజాస్వామ్యమవుతుంది. 52 శాతం జనాభా గల బి.సి లకు ప్రాతినిధ్యం ఏది? బి.సిలు ఓట్లు వేయడానికేనా. ప్రజాస్వామ్యం ధనస్వామ్యంగా మారింది. డబ్బుల ప్రభావం ఎన్నికల మీద విపరీతంగా వుంది. ఇలాంటి పరిస్తితులలో డబ్బులు లేని బి.సి లు ఎన్నికలలో గెలవలేరు. పార్లమెంటులో బి.సి. బిల్లు ప్రవేశపెట్టి, చట్ట సభల్లో బీసీ లకు 50 శాతం రాజకీయ రిజర్వేషన్లు కల్పించాలని. బి.సి ఉద్యోగులకు ప్రమోషన్లను రిజర్వేషన్లు కల్పించాలి. ఇందుకు రాజ్యాంగ సవరణ చేయాలని, కేంద్ర విద్యా, ఉద్యోగ రిజర్వేషన్లు బి.సి.ల జనాభా ప్రసాదం 27శాతం నుండి 56 శాతంకు పెంచాలని కోరారు. బీసీల అభివృద్ధికి ప్రత్యేక స్కీములను రూపొందించాలని, ఎస్సి,ఎస్టీ అట్రా సిటీ యాక్ట్ మాదిరిగా బి.సి.లకు సామాజిక రక్షణ, భద్రత కల్పించడానికి బి.సి. యాక్టు తీసుకురావాలని, ప్రపంచీకరణ సరళీకృత, ఆర్థిక విధానాలు రావడం పారిశ్రామికీకరణ వేగవంతంగా జరగడం ప్రైవేటు రంగంలో పెద్ద ఎత్తున పరిశ్రమలు వచ్చాయి. అందుకే ఎస్సీ,ఎస్టీ,బి.సి.లకు ప్రైవేటు రంగంలో రిజర్వేషన్లు పెట్టాలని కోరారు. సుప్రీంకోర్టు- హై కోర్టు జడ్జీల నియామకాలలో ఎస్సీ, ఎస్టీ బి.సి.లకు రిజర్వేషన్లు పెట్టాలని, కేంద్రంలో బి.సి.లకు పోస్ట్ మెట్రిక్స్ స్కాలర్ షిప్, ఫీజు రియంబర్స్మెంట్ స్కీం విధానం సాచురేషన్ పద్ధతిలో ప్రవేశపెట్టాలి. రాష్ట్రాలకు 80 మ్యాచింగ్ గ్రాంట్ ఇవ్వాలని, కేంద్ర ప్రభుత్వ శాఖలలో, ప్రభుత్వ రంగ సంస్థలలో ఖాళీగా ఉన్న 16 లక్షల ఉద్యోగ ఖాళీలను భర్తీ చేయాలని కోరారు.

కేంద్ర స్థాయిలో 2 లక్షల కోట్ల బడ్జెట్ బి.సి సబ్ ప్లాన్ ఏర్పాటు చేయాలని, జనాభా లెక్కలలో బి.సి. కులాల వాది లెక్కలు సేకరించాలని కోరారు. ఈ సమావేశంలో గుజ్జ కృష్ణ, నందా గోపాల్, నీల వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

న్యాయావాదుల రక్షణ చట్టం అమలు చేయడంలో

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలం

ఐఏఎల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొమ్మగాని ప్రభాకర్

విశాలాంధ్ర - హైదరాబాద్ : రాష్ట్రంలో న్యాయవాదులపై దాడులు జరుగుతున్నా కూడా నేటికీ వారి రక్షణ చట్టం తీసుకురావడంలో పాలకవర్గాలు వెనుకంజ వేస్తున్నారని ఐఏఎల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొమ్మగాని ప్రభాకర్ ఎద్దేవా చేశారు. ఆదివారం మహబూబ్ నగర్ ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్‌లో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా ఇండియన్ అసోసియేషన్ లాయర్స్ యూనియన్ మహాసభలు జిల్లా అధ్యక్షులు బి.పరమేశ్ గౌడ్ అధ్యక్షతన జరిగింది. ఈ మహాసభలకు ముఖ్య అతిథిగా ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొమ్మగాని ప్రభాకర్ మాట్లాడుతూ దేశ స్వాతంత్ర పోరాట కాలం నుంచి మొన్న జరిగిన తెలంగాణ పోరాటంలో కూడా న్యాయవాదుల పాత్ర అమోఘమైనది, కానీ వారిపై జరుగుతున్న దాడులకు రక్షణ లేకుండా పోయిందని వాపోయారు. నేటికి న్యాయవాదులు తమ వృత్తిని నిర్వహిస్తూనే సామాజిక అంశాల పట్ల వారి కృషి అమోఘమైనదని అన్నారు. భారత రాజ్యాంగాన్ని అమలు చేయడంలో పాలకులు వెనుకంజ వేస్తున్నారని పేర్కొన్నారు. సెక్షన్ 41 సిఆర్పిసి ని తక్షణ ఎత్తేయాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. దీంతో ప్రజలు భయాందోళన గురవుతున్నారని వారన్నారు, జూనియర్ న్యాయవాదులకు 5000 రూపాయలు ప్రతినెల ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. హెల్త్ డెత్, బెనిఫిట్ స్కీమ్స్ ను 20 లక్షల పెంచాలన్నారు. ప్రతి జిల్లాలో ఇండ్లు లేని న్యాయవాదులకు ఇండ్లు కేటాయించే టట్లు చర్యలు చేపట్టాలని ప్రభుత్వాన్ని కోరారు. హైదరాబాద్‌లో సుప్రీంకోర్టు బెంచ్ ఏర్పాటు చేయాలని వారు అన్నారు, రాష్ట్రంలో జిల్లా కోర్ట్ కు నూతన భవనాలను తక్షణ నిర్మించాలని వారు ప్రభుత్వం డిమాండ్ చేశారు, న్యాయవాదుల వృత్తి రక్షణకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని అన్నారు.

ఐఏ ఎల్ సంఘం ప్రజాస్వామిక వాదులతో ఏర్పడిన సంఘమని స్థాపించిన వారిలో జస్టిస్ కృష్ణ అయ్యర్, జస్టిస్ పిఎన్ భగవతి, జస్టిస్ డిఎన్ దేశాయ్, జస్టిస్ చిన్నపరెడ్డి, సి పద్మనాభరెడ్డి, ముఖ్యులు, వారి ఆశయ సాధనలో ఐఏఎల్ సంఘాన్ని బలపరితం చేయాలని ఉమ్మడి జిల్లా నుంచి పెద్ద ఎత్తులో పాల్గొన్న న్యాయవాదులను ఉద్దేశించి వారు అన్నారు. మాజీ పబ్లిక్ ప్రాసిక్యూటర్ బెక్కం జనార్దన్ మాట్లాడుతూ జూనియర్ న్యాయవాదులు తమ వృత్తి పట్ల నిబద్ధతతో ఉండి వృత్తిలో నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని అన్నారు. కార్యక్రమంలో బిర్ విల్సన్, బి రాము, దత్తాత్రేయ, రమేష్, ఆర్ఆర్ మన్యం, శేఖరయ్య, జేసీ కుర్మయ్య, నిరంజన్, సలీం, వెంకట్రావు, జగదీష్, రాజు, చేతను, ఎన్ వి మహేష్, నరసింహ, రామకృష్ణ గౌడ్, ఉబేద్, సజ్జత్ అమేద్, వేణుగోపాల్ గౌడ్, శివరాం తదితర న్యాయవాదులు పాల్గొన్నారు.

గ్రూప్-3 పరీక్ష నిర్వాహణ పరిశీలించిన కలెక్టర్

విశాలాంధ్ర బ్యూరో, మేడ్చల్ - మల్కాజిగిరి : తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహిస్తున్న గ్రూప్ 3 పరీక్షల నేపథ్యంలో ఆదివారం కూకట్ పల్లిలోని డిగ్రీ ప్రభుత్వ కళాశాల, అవినాష్ డిగ్రీ కళాశాలలో జరుగుతున్న గ్రూప్ 3 పరీక్షలను మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్ పొట్రు తనిఖీ చేశారు ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పరీక్షలు ప్రశాంతంగా జరుగుతున్నాయని సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. పరీక్షల గదులలో తిరిగి పరీక్ష నిర్వహణను కలెక్టర్ పరిశీలించారు.

ప్రజలకిచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలి

సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి, ఎన్.బాల మల్లేష్

విశాలాంధ్ర - కాప్రా : ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను తక్షణమే అమలు చేయాలని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎన్. బాల మల్లేష్ పేర్కొన్నారు. సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు రొయ్యల కృష్ణమూర్తి అధ్యక్షతన నీలం రాజశేఖర్ రెడ్డి భవన్‌లో జరిగిన సీపీఐ మేడ్చల్-మల్కాజ్గిరి జిల్లా కార్యవర్గ సమావేశంలో సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎన్.బాల మల్లేష్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. బాల మల్లేష్ తన ప్రసంగంను కొనసాగిస్తు కాంగ్రెస్ ప్రభుత్వం 6 గ్యారెంటీ పథకాలను అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మూసి పరివాహక ప్రాంతంలో పేదల ఇండ్లు కూలగొట్టడం అప్రజాస్వామికం అని అన్నారు. పేదల ఇండ్లకు ప్రత్యామ్నాయం చూపకుండ పేదల ఇండ్లను కూలగొట్టడం చేయకూడదని పేర్కొన్నారు. ఈ సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి డిజి. సాయిలు గౌడ్, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శులు జి.దామోదర్ రెడ్డి, ఉమా మహేష్, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు రొయ్యల కృష్ణమూర్తి, సి.ఎచ్ దశరథ్, తోటపల్లి శంకర్, శంకర్ రావు, ఏసు రత్నం, హరినాథ్ రావు, కె.దర్మేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ సమస్యతో నిత్యం అవస్థలు

విశాలాంధ్ర - ఆమనగల్లు : ఆమనగల్లు పట్టణ కేంద్రంలో హైదరాబాద్ -శ్రీశైలం జాతీయ రహదారి వాహనాల పార్కింగ్‌కు అడ్డాగా మారింది. వాహనదారులు రహదారులపై ఎక్కడపడితే అక్కడ వాహనాలు పార్కింగ్ చేస్తున్నారు. జాతీయ రహదారిపై ద్విచక్ర వాహనాల పార్కింగ్‌తో ప్రజల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయి. అనేక సార్లు ప్రమాదాలు చోటు చేసుకున్న సంఘటనలు ఉన్నాయి. ట్రాఫిక్ సిగ్నల్స్‌ను ఏర్పాటు చేసినప్పటికీ అది అలంకార ప్రాయంగానే ఉంది. ఆదివారం సాయంత్రం పట్టణ కేంద్రంలోని జాతీయ రహదారిపై బస్టాండ్ మూలమలుపు వద్ద నిలిచిన కారును బస్టాండ్ నుండి బయటకు వస్తున్న బస్సు ఢీకోనడం ప్రమాదాలకు కారణాలని స్థానికులు పేర్కొంటున్నారు. గంటల తరబడి వాహనాల పార్కింగ్ తో దుకాణదారులు సైతం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బస్టాండ్ ఎదుట ప్రైవేట్ వాహనదారులు ప్రయాణికుల కోసం ప్రధాన రహదారి మధ్యలోనే వాహనాలు నిలుపుతున్నారు. రాజీవ్ చౌక్ నుంచి మార్కెట్ యార్డ్ వరకే ఎక్కువ దుకాణాలు, హెూటల్లు వ్యాపార, వాణిజ్య సముదాయాలు ఉండటంతో ఇక్కడ రద్దీ ఎక్కువగా ఉంటుంది. దీంతో వందల ద్విచక్ర వాహనాలు రోడ్డుకు ఇరువైపులా పార్కింగ్ చేస్తున్నారు. కొందరు వాహనదారులు రోడ్డు మధ్యలోనే వాహనాలను నిలిపి పనుల మీద ఇతర ప్రాంతాలకు వెళ్లి వస్తుండడంతో, పాదాచారులకు వాహనదారులకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. స్థానికంగా పార్కింగ్ స్థలాలు ఏర్పాటు చేసి రోడ్లపై వాహనాలు నిలపకుండా చూడాలని స్థానికులు సంబంధిత అధికారులను కోరుతున్నారు.

గ్రూప్-3 పరీక్షా కేంద్రాలను పరిశీలించిన కలెక్టర్

విశాలాంధ్ర - హైదరాబాద్ : ఆదివారం రంగారెడ్డి జిల్లా, తట్టి అన్నారంలోని శ్రేయాస్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాల, హయత్ నగర్‌లోని వర్డ్ అండ్ డీడ్ ఎడ్యుకేషనల్ అకాడమీలో ఏర్పాటు చేసిన గ్రూప్-3 పరీక్షా కేంద్రాలను జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ పరీక్ష నిర్వహణ గదులను, పరీక్ష కేంద్రాలోసౌకర్యాలను కలెక్టర్ తనిఖీ చేశారు. పరీక్షా సమయంలో ఎటువంటి పొరపాట్లకు తావులేకుండా పకడ్బందీగా పరీక్షలు నిర్వహించాలన్నారు. కలెక్టర్ వెంట ఇబ్రహీంపట్నం ఆర్డీఓ అనంత్ రెడ్డి, తహసీల్దార్ సంబంధిత అధికారులు తదితరులు ఉన్నారు.

కనీస మద్దతు ధరతో పాటు బోనస్ జమ

రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ సుంకెట అన్వేష్ రెడ్డి

విశాలాంధ్ర - హైదరాబాద్ : రైతులకు ఇచ్చిన హామీ మేరకు కనీస మద్దతు ధరతో పాటు బోనస్ కూడా వెంటనే రైతుల ఖాతాల్లో జమ చేస్తున్నామని తెలంగాణ రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ సుంకెట అన్వేష్ రెడ్డి తెలిపారు. ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నట్లు ధాన్యం డబ్బుల చెల్లింపులో ఎలాంటి జాప్యం జరగడం లేదని, కాంటా పెట్టిన మూడు రోజుల్లోపే ఎమ్మెస్పీ, బోనస్ కలిపి చెల్లిస్తున్నామని స్పష్టం చేశారు. ధాన్యం సేకరణ కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ. 30 వేల కోట్లు కేటాయించినట్లు తెలిపారు. ప్రభుత్వం బోనస్ ప్రకటించడంతో సన్నాల ధర అమాంతం పెరిగిందని, క్వింటాలుకు రూ. 2,800 నుంచి రూ. 3 వేల వరకు ధాన్యం ధర పలుకుతుందని తెలిపారు. మంత్రివర్గ ఉప సంఘం ఏర్పాటు చేసి, రైతులు రైతు సంఘాలు రైసుమిల్ల నుంచి అభిప్రాయాలు తీసుకొని కొత్త ధాన్యం సేకరణ పాలసీని తయారుచేసి పకడ్బందీగా ధాన్యం సేకరణ చేపడుతున్నట్లు తెలిపారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రొక్యూర్మెంట్ లో అంతులేని అక్రమాలు జరిగాయని, బీఆర్ఎస్ నేతలు రైస్ మిల్లర్లు కలిసి రైతులను అడ్డగోలుగా దోచుకున్నారని అన్నారు. కేసిఆర్ అధికారంలో ఉన్నప్పుడు సన్నా రకం పెట్టమని సన్నలకు బోనస్ ప్రకటించి ఎగ్గొట్టారని అన్వేష్ రెడ్డి గుర్తు చేశారు. బోనస్ కోసం రైతుల నిలదీస్తే బోనస్ ఇవ్వడానికి కేంద్ర ప్రభుత్వ నిబంధనలు అంగీకరించడం లేదని, అందుకే బోనస్ ఇవ్వడం కుదరదని చెప్పి రైతులను మోసం చేశారని అన్నారు. సన్నాలకు బోనస్ ఇవ్వాలని రైతులు అడిగితే బీఆర్ఎస్, బిజెపి ప్రభుత్వాలు ఒకరిపై ఒకరు నెపం వేసుకొని రైతులకు అన్యాయం చేశారని అన్నారు. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు మేలు చేస్తుంటే చూసి ఓర్వలేక పోతున్నారని అన్నారు. బిజెపి, బీఆర్ఎస్ పార్టీలు తోడు దొంగలని, ఇద్దరి కుట్రలను ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. ఎఫ్‌సీఐ నిబంధనలు అంగీకరించకపోయినా కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు బోనస్ చెల్లిస్తున్నదని తెలిపారు. బోనస్ కోసం ఇప్పటికే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం వేయి కోట్ల ను కేటాయించిందని, ఇప్పటికే సుమారు రూ.33 కోట్ల బోనస్ రైతుల ఖాతాల్లో జమ అయ్యిందని చెప్పారు. నిన్నటి వరకు 12.29 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని మా ప్రభత్వం కొనుగోలు చేసింది ఇందులో 2.76 లక్షల మెట్రిక్ టన్నుల సన్న ధాన్యాన్ని కొన్నామన్నారు. గత ప్రభుత్వం పోయిన ఖరీఫ్ లో నిన్నటి వరకు కొన్నది 11. 45లక్షల మెట్రిక్ టన్నులే ఈ లెక్కన గత ప్రభుత్వం కంటే మా ప్రక్కుత్వమే ఎక్కువ కొన్నదని వివరించారు. సివిల్ సప్లైస్ కార్పొరేషన్ నుంచి ఎం ఎస్పీ, ఆర్థికశాఖ నుంచి బోనస్ చెల్లించటానికి ప్రత్యేక సాఫ్ట్వేర్ వినియోగిస్తున్నట్లు అన్వేష్ రెడ్డి తెలిపారు. రైతులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ప్రతి చివరి గింజ వరకు ధాన్యం కొనుగోలు చేస్తామని భరోసా ఇచ్చారు. రాష్ట్రంలో రికార్డు స్థాయిలో ఈ వానా కాలం సీజన్లో 155 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం ఉత్పత్తి జరిగిందని తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్టు తోనే గతంలో పంటలు పండాయని కేసిఆర్ ప్రగల్బాలు పలికారని, ఈ వానాకాలంలో కాలేశ్వరం ప్రాజెక్టు మూడు లిఫ్టుల నుంచి ఒక్క చుక్క నీరు విడుదల చేయకపోయినా కోటిన్నర మెట్రిక్ టన్నుల ధాన్యం ఉత్పత్తిని రైతులు చేశారని అన్వేష్ రెడ్డి స్పష్టం చేశారు.

కార్యసిద్ధి గణపతి విగ్రహ ప్రతిష్ఠాపన

విశాలాంధ్ర-కుత్బుల్లాపూర్ : గణపతి ఆరాధనతో కార్యసిద్ధి లభిస్తుందని ఎమ్మెల్యే కేపీ వివేకానంద, ఎమ్మెల్సీ శంభిపూర్ రాజు పేర్కొన్నారు. నియోజకవర్గం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి బాచుపల్లి దేవి హోమ్స్ నందు ఆదివారం నూతనంగా నిర్మించిన కార్యసిద్ధి గణపతి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమానికి ఎమ్మెల్యే కెపి.వివేకానంద్, ఎమ్మెల్సీ శంబిపూర్ రాజు కలిసి ముఖ్య అతిథులుగా హాజరై స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కేపీ వివేకానంద, ఎమ్మెల్సీ శంభిపూర్ రాజు మాట్లాడుతూ కార్యసిద్ధి గణపతిని కొలవడం ద్వారా చేపట్టిన పనులలో విజయం చేకూరుతుందని తెలియజేశారు. అనంతరం కాలనీ ప్రజలు ఎమ్మెల్యే కేపీ వివేకానంద, ఎమ్మెల్సీ శంభిపూర్ రాజుని శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ ధనరాజ్ యాదవ్, బిఆర్ఎస్ పార్టీ ఎస్ఎంసి అధ్యక్షులు రంగరాయ ప్రసాద్, జిహెచ్ఎంసి కి చెందిన నాయకులు, స్థానిక నాయకులు, దేవి హోమ్స్ కమ్యూనిటీ సభ్యులు సందీప్ గౌడ్, ప్రకాష్ రెడ్డి, రాజ్ కుమార్, కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

ఎన్యుమరేటర్లకు కుటుంబ వివరాలు వెల్లడించినకలెక్టర్

విశాలాంధ్ర - హైదరాబాద్ : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ కుల సర్వే (సమగ్ర ఇంటింటి సర్వే)లో భాగంగా బంజారాహిల్స్ రోడ్ నెంబర్ 13 బంగ్లా నెంబర్ 33 లో గల హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ఇంటికి జిహెచ్ఎంసి ఎన్యుమరేటర్లు వెళ్లగా కలెక్టర్ తన కుటుంబ వివరాలను వెల్లడించి సర్వే ఫారంలో సంతకం చేశారు. ఈ సర్వే కార్యక్రమంలో ఎన్యుమరేటర్ శాంతి లక్ష్మి, సూపర్వైజర్ ఎల్. బాన్ సింగ్ పాల్గొన్నారు.

డిసెంబర్ 15న గో మరథాన్ '5కె రన్ ఫర్ గోమాత' నిర్వహణ

విశాలాంధ్ర-బషీర్ బాగ్ : గోమాతకు జాతీయ తల్లి హోదా ఇవ్వాలనే డిమాండ్‌తో, శ్రీ దక్షిణేశ్వర్ కేదారనాథ్ టెంపుల్ ట్రస్ట్, మెడ్చల్ ఆధ్వర్యంలో 5కె రన్ 'రన్ ఫర్ గోమాత' డిసెంబర్ 15న 6కు నెక్లెస్ రోడ్‌లో నిర్వహించనున్నట్లు శ్రీ దక్షిణేశ్వర్ కేదారనాథ్ టెంపుల్ ట్రస్ట్, మెడ్చల్ సర్వదళ గో రక్షణ మండలి జాతీయ అధ్యక్షులు జయపాల్ సింగ్ నయాల్ పేర్కొన్నారు. ఆదివారం బషీర్ బాగ్ ప్రస్తుతంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ కార్యక్రమం గో సంరక్షణను ప్రోత్సహించి, గోమాతకు జాతీయ తల్లి హోదా పొందించేందుకు ఒక బలమైన ఉద్యమాన్ని నిర్మించడమే లక్ష్యంగా ఉందన్నారు. ఈ కార్యక్రమానికి ప్రధాన నిర్వాహకులు, సర్వదళ గో రక్షణ మండలి జాతీయ అధ్యక్షులు జయపాల్ సింగ్ నయాల్ హైదరాబాద్ ప్రజలను ఈ రన్‌లో ఎక్కువ సంఖ్యలో పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.

విద్యార్థులు క్రీడల్లో రాణించాలి

విశాలాంధ్ర-దుండిగల్: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని కౌన్సిలర్ శంభిపూర్ క్రిష్ణ పేర్కొన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దుండిగల్ మున్సిపాలిటీ పరిధి బౌరంపేట్ లోని ఆదివారం బ్లూ వేవ్స్ స్విమ్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఫిన్ స్విమ్మింగ్ స్టేట్ ఫెరరేషన్ కప్ 2024 చాంపియన్ షిప్ కార్యమానికి నియోజకవర్గ బీఆర్ఎస్ నేత, కౌన్సిలర్ శంభీపూర్ క్రిష్ణ ముఖ్యఅతిధులుగా హాజరైయ్యారు. ఈ సందర్భంగా శంభిపూర్ క్రిష్ణ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడా పోటీల్లో కూడా రాణించాలని ఆయన తెలిపారు. అనంతరం స్విమ్మింగ్ పోటీ కార్యక్రమంలో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు మెడల్స్, సర్టిఫికెట్లను వారికి అందజేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు సురేందర్ రెడ్డి, బౌరంపేట పీఏసీఎస్ డైరెక్టర్ మహిపాల్ రెడ్డి, నిర్వాహకులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బొంతు శ్రీదేవి యాదవ్ జన్మదిన వేడుకలు

విశాలాంధ్ర - కాప్రా : నిరంతరంప్రజాసేవ ప్రజా సంక్షేమ కోసం పరితపిస్తూ పుష్కర కాలంగా అనేక పోరాటాలు సాగిస్తూ గెలుపోటములకు సంబంధం లేకుండా ప్రజలతో నా జీవితం అంటూ ప్రజల మధ్య చర్లపల్లి డివిజన్ కార్పొరేటర్ బొంతు శ్రీదేవి యాదవ్ జన్మదిన వేడుకలను ఇంటింటి చెత్త సేకరించే స్వచ్ఛ ఆటో కార్మికుల సమక్షంలో మేడ్చల్ మల్కాజిగిరి వ్యవసాయ అండ్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ నాగిళ్ల బాల్ రెడ్డి ఆధ్వర్యంలో వాసవి శివనగర్‌లో స్వచ్ఛ ఆటో కార్మిక సోదర, సోదరీమణుల సమక్షంలో ఘనంగా జరుపుకున్నారు. కార్మిక నాయకుల సమక్షంలో కేక్ కట్ చేశారు. అనంతరం కార్మికులకు దుస్తులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బత్తుల శ్రీకాంత్ యాదవ్, గోపాల్ యాదవ్, బిక్షపతి, బాల నరసింహ, తాండ్ర యాదగిరి, చందు, వెంకట్ రెడ్డి, భాను నేత, రామారెడ్డి, నిర్మల, అరుణ, మున్ని, గిరిజ, శిరీషలి, స్వచ్ఛ ఆటో కార్మికుల అధ్యక్షుడు ఎం.వీరేష్, బ్రహ్మయ్య లక్ష్మన్న మునుస్వామి నరసింహ ఆదిలక్ష్మి వీరమ్మ వెంకటేశ్వరమ్మ ఆదిలక్ష్మి జ్యోతి నర్సమ్మ భాగ్యమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఎన్ని కుట్రలు పన్నినా...

మూసీ ప్రక్షాళన చేసి తీరుతాం

టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్

విశాలాంధ్ర - హైదరాబాద్ : రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మూసీ ప్రాజెక్టు ఆపేందుకు బీజేపీ, బీఆరెస్ కుమ్మక్కై ఆపేందుకు కుట్ర చేస్తున్నారని టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ ఆరోపించారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఫోటో షూట్ కోసం మాత్రమే మూసీ నిద్ర చేశారని, బస చేసే ముందు ఆ ప్రాంతంలో దోమల మందు, ఈగల మందు కొట్టారని చెపుకొచ్చారు. వాస్తవంగా మూడు నెలలు అక్కడ ఉంటే ప్రజల అవస్థలు తెలుస్తాయని చెపుకొచ్చారు. ఆదివారం గాంధీభవన్ లో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఎంపీ.బలరాం నాయక్ తో కలిసి మాట్లాడారు. ఈ సందర్భంగా మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ మూసీ పక్కన మూడు నెలల బస చేయండి అని మా సీఎం సవాల్ చేశారని దానికి ఎవ్వరైనా సిద్ధం అయితే నేను కూడా వస్తానని తెలిపారు. మీరు నేను ఇద్దరం కలసి మూడు నెలలు అక్కడ బస చేద్దాం రండి అంటూ సవాల్ విసిరారు. అక్కడి ప్రజలు అనారోగ్యాల పలు అవుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. బీఆరెస్ గ్రాఫ్ పడిన ప్రతీ సారి కిషన్ రెడ్డి బయటకి వస్తాడని, దాని కాపాడేందుకు కిషన్ రెడ్డి ప్రయత్నం చేస్తున్నాడని విమర్శించారు. ఒక్కరోజు నిద్ర చేసి ఏం సాధించారని నిలదీశారు. తెలంగాణ అభివృద్ధికి అసలు ఎందుకు అడ్డుపడుతున్నారని ప్రశ్నించారు. సబర్మతి రివర్ ఫ్రంట్ కి ఒక న్యాయం, మూసీ రివర్ కి ఒక న్యాయమా అంటూ ధ్వజమెత్తారు. మూసీ నిర్వాసితులకు డబుల్ బెడ్ రూమ్ ఇచ్చి ఆదుకుంటామని, వారి పిల్లలకు విద్య అవకాశాలు కల్పిస్తున్నామని భరోసా ఇచ్చారు. బీజేపీ నాయకులు గుజరాత్ గులాం లా ఎందుకు వ్యవహరిస్తున్నారని, ప్రపంచంతో తెలంగాణ పోటీ పడుతుంది అనగానే వీళ్లకు భయం పట్టుకుందన్నారు. గుజరాత్‌ను ఎక్కడ తెలంగాణ వెనక వేస్తుందో అన్న భయం బీజేపీ వెంటాడుతుందని దుయ్యబట్టారు. ప్రళయాలు వచ్చే అవకాశాలు ఉన్నాయని హెచ్చరిస్తున్నారు కానీ ముందు ఒక్కరోజు నిద్రతో అక్కడి ప్రజల అవస్థలు ఏం తెలుసుకున్నారో అది చెప్పాలన్నారు. డీపీఆర్ వచ్చాక ఎక్కడ రిటర్నింగ్ వాల్ కట్టలో తెలుస్తుందని, ఎవరికి అన్యాయం జరగకుండా చూసుకునే భాధ్యత మా ప్రభుత్వం తీసుకుంటుందని తెలిపారు. పదేళ్ల తెలంగాణ అభివృద్ధి కుంటూ పడిందని, కచ్చితంగా వచ్చే ఐదేళ్లలో అభివృద్ధిలో తెలంగాణ మార్పు చూస్తారన్నారు. తెలంగాణ రైజింగ్‌గా ముందుకు వెళ్తుందని ఎవ్వరు ఎన్ని అడ్డంకులు సృష్టించిన మూసీ ప్రక్షాళన చేసి తీరుతామని స్పష్టం చేశారు. అక్కడ కిషన్‌రెడ్డి కాళ్ళకు సాక్సులు వేసుకొని నిద్రపోయారు, అంటే అక్కడ ఎన్ని దోమలు ఉన్నాయో అర్థం అవుతుందని అన్నారు.

ప్రజా సమస్యలపై నిత్యం పోరాడేది కమ్యూనిస్టులే

సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు

విశాలాంధ్ర- హనుమకొండ : ప్రజా సమస్యలపై నిత్యం పోరాడేది కమ్యూనిస్టులేనని, సమ సమాజ నిర్మాణానికి మార్క్సిజమే దిక్సూచని, సిపిఐ ది నూరేళ్ళ చరిత్ర కలిగిన పార్టీ అని రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం హనుమకొండ బాలసముద్రంలోని సిపిఐ జిల్లా పార్టీ కార్యాలయంలో పార్టీ జిల్లా సమితి ఆధ్వర్యంలో నిరంతర రాజకీయ పాఠశాలను సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి అధ్యక్షతన జరిగిన రాజకీయ పాఠశాల సమావేశంలో శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రజా ఉద్యమాలు నిర్మించి ప్రజల మధ్య ఉండి ప్రజలను చైతన్యం చేస్తూ ప్రశ్నించే గొంతుకగా ఉన్న సిపిఐ శత సంవత్సరాలు కలిగిందని, శతాబ్ద కాలంగా ఎన్నో పార్టీలు వారి స్వార్థ ప్రయోజనాల కోసం ప్రారంభించి కనుమరుగయ్యాయని అన్నారు. 1925 డిసెంబర్ 26న ఆవిర్భవించిన సిపిఐ భారతదేశ స్వాతంత్ర్య పోరాటంలో సిపిఐ కార్యకర్తలు, నాయకులపై అనేక కుట్రకేసులు బనాయించినా కూడా, జైల్లో పెట్టి చిత్రహింసలు పెట్టినా కూడా స్వాతంత్రం సిద్ధించే వరకు ప్రజలను చైతన్యం చేస్తూ విశ్రమించని పోరాటం చేసిన చరిత్ర భారత కమ్యూనిస్టు పార్టీదన్నారు. అంతరాలు లేని సమాజ అభివృద్ధికి మార్క్సిజమే ప్రత్యామ్నాయమని, ఈ పెట్టుబడి దారి సమాజంలో అంతరాలు లేకుండా పేదవాడు, ధనికుడు తేడా లేకుండా అందరూ సమానంగా బతకాలని, సమ సమాజ స్థాపన కోసం మార్క్సిజం చూపినా సైద్ధాంతిక సిద్ధాంతంతో నిరంతరం ప్రజలను చైతన్యం చేస్తూ ప్రజా ఉద్యమాలలో కీలక పాత్ర పోషిస్తూ అనేక సమస్యల పరిష్కారం కోసం పోరాటాలు గావించాలని పిలుపునిచ్చారు. పాలక ప్రభుత్వాలు ప్రజల సంక్షేమం మరిచి కార్పొరేట్ పెట్టుబడిదారి వ్యవస్థకు అనుకూలంగా దేశంలో ఉన్న ప్రజలు సాధించుకున్న ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేస్తూ లక్షలాది కోట్ల రూపాయలను వారికి రాయితీల పేరు మీద కట్ట బెడుతున్నాయని మండిపడ్డారు.ఈ సందర్భంగా కమ్యూనిస్టులు ఏమి తెలుసుకోవాలి అనే అంశంపై రిటైర్డ్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ మార్క శంకర్ నారాయణ బోధిస్తూ కమ్యూనిస్టులు దేశంలో నెలకొని ఉన్న ప్రజా సమస్యలు పరిష్కారం కోసం ఉద్యమాలు చేస్తూనే మరోవైపు మతోన్మాద శక్తులకు వ్యతిరేకంగా పోరాటాలు చేయాలని అన్నారు. ఈ రాజకీయ పాఠశాల కార్యక్రమానికి సిపిఐ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి అధ్యక్షత వహించగా రాష్ట్ర సమితి సభ్యులు ఆదరి శ్రీనివాస్, మండ సదాలక్ష్మి,ఎన్.అశోక్ స్టాలిన్, జిల్లా సహాయ కార్యదర్శులు తోట బిక్షపతి, మద్దెల ఎల్లేష్, నాయకులు కర్రె లక్ష్మణ్, మునిగాల బిక్షపతి, మంచాల రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

నేడు ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

విశాలాంధ్ర - ఆమనగల్లు : కడ్తాల సింగల్ విండో సబ్ సెంటర్ ఆవరణలో ఆమనగల్లు సింగల్ విండో ఆధ్వర్యంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సోమవారం నుండి ప్రారంభించనున్నట్లు డిసిసిబి డైరెక్టర్, ఆమనగల్లు సింగల్ విండో చైర్మన్ గంప వెంకటేష్ గుప్తా తెలిపారు. ఆదివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, ఉమ్మడి మహబూబ్నగర్ డిసిసిబి చైర్మన్ మామిళ్లపల్లి విష్ణువర్ధన్ రెడ్డి హాజరవుతున్నారని స్థానిక, మండల ప్రజా ప్రతినిధులు, మండల అధికారులు, వ్యవసాయ అధికారులు, ప్రత్యేక అధికారులు హాజరు కావాలని ఆయన కోరారు. రైతన్నలు మధ్య దళారులను నమ్మి మోసపోవద్దని ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధరకు వరి ధాన్యంను కొనుగోలు కేంద్రాలకు తీసుకొచ్చి మద్దతు ధర పొందాలని సూచించారు. ఆమనగల్లు ప్రాథమిక సహకార సంఘం ఆధ్వర్యంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయడం జరుగుతుందని వరి క్వింటాలుకు రూ. 2330 మద్దతు ధర పొందాలని ఆయన రైతులకు సూచించారు. రెండో రకం వరి ధాన్యానికి ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధర రూ. 2300 పొందాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం సన్న రకం వడ్లకు గాను ప్రోత్సాహకంగా రూ.500 అందివ్వడం జరుగుతుందని, వరి ధాన్యం కొనుగోలుకు వచ్చే రైతన్నలకు అన్ని రకాల ఏర్పాట్లను చేయడం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. రైతులు ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధరకు వరి ధాన్యం అమ్మి లబ్ధి పొందాలని సింగిల్ విండో చైర్మన్ వెంకటేష్ గుప్తా సూచించారు. ఈ సమావేశంలో సింగిల్ విండో వైస్ చైర్మన్ ధోనాదుల సత్యం, జోగు వీరయ్య, సిఈఓ దేవేందర్ ఉన్నారు.

సీపీఐది త్యాగాల చరిత్ర

సీపీఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్

విశాలాంధ్ర - పెనుబల్లి : భారత కమ్యూనిస్టు పార్టీ పోరాట చరిత్ర అజరామరమని సిపిఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్ అన్నారు.ఆదివారం మండల పరిధిలోని లింగగూడెం గట్టు గూడెం గ్రామాల్లో సిపిఐ శతజయంతి సందర్భంగా పార్టీ సభ్యత్వ కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా పోటు ప్రసాద్ మాట్లాడుతూ దేశంలో పురాతన పార్టీ సిపిఐ అని డిసెంబర్ 25 నాటికి 100వ సంవత్సరంలో అడుగుపెట్టనుందని తెలిపారు .ఇంత చరిత్ర కలిగిన పార్టీ దేశంలో మరొకటి లేదని అన్నారు. లౌకిక ప్రజాతంత్ర ఉద్యమాలకు సిపిఐ బీజం వేసిందని,దేశంలో సెక్యులర్ వామపక్ష ఐక్యత కోసం దేశవ్యాపిత పార్టీలను ఏకం చేసి దేశ ప్రజానీకానికి ఎనలేని మేలు చేకూర్చిందని పేర్కొన్నారు. పార్టీ శతజయంతి ఉత్సవాలను 2025 సంవత్సరం మొత్తం దేశవ్యాప్తంగా నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు సింగు నరసింహారావు,సిపిఐ మండల కార్యదర్శి కొమ్మినేని సుధాకర్, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర నాయకులు ఇటికాల రామకృష్ణ,పెనుబల్లి సొసైటీ డైరెక్టర్ పద్దం జోగయ్య, పద్దం పుల్లయ్య, వట్టం శ్రీను,శివ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక ఫలితాలను ప్రకటించిన ఐస్ మేక్

విశాలాంధ్ర - శేరిలింగంపల్లి : శీతలీకరణ పరిష్కారాలలో ప్రముఖ ఆవిష్కర్త, భారతదేశంలో 50 కు పైగా రకాల రిఫ్రిజిరేషన్ పరికరాల ప్రముఖ తయారీదారు అయిన ఐస్ మేక్ రిఫ్రిజిరేషన్ లిమిటెడ్ ఆర్థిక సంవత్సరం 2025 రెండవ త్రైమాసిక (క్యూ2) ఆర్థిక ఫలితాలను ప్రకటించింది. కీలక ఆర్థిక కొలమానాలలో ఆకట్టుకునే వృద్ధి, స్థిరమైన పనితీరును ప్రదర్శిస్తుంది. స్వతంత్ర ఆర్థిక పనితీరు క్యూ2 ఎఫ్‌వై 2025లో కంపెనీ కార్యకలాపాల ద్వారా ఆదాయంలో చెప్పుకోదగ్గ పెరుగుదల నమోదు చేసి రూ. 101.38 కోట్లకు చేరుకుంది. గత త్రైమాసంతో పోలిస్తే ఈ త్రైమాసికానికి 21.89శాతం ఇయర్ ఆన్ ఇయర్ 33.87శాతం పెరిగి, రూ. 101.65 కోట్లకు మొత్తం ఆదాయం చేరింది. త్రైమాసికానికి రూ. 8.51 కోట్ల వద్ద నమోదు చేయబడింది, పన్ను తర్వాత లాభం (పీటీఏ) రూ. 4.89 కోట్లుగా ఉంది. అయినప్పటికీ ఇది క్యూ2, ఎఫ్‌వై 2024లో నమోదైన 6.05శాతం కంటే తక్కువగా ఉంది.ఆర్థిక పనితీరుపై ఐస్ మేక్ రిఫ్రిజిరేషన్ లిమిటెడ్ సిఎండి చంద్రకాంత్ పటేల్ మాట్లాడుతూ, మార్కెట్ సవాళ్లను ఎదుర్కొంటున్నప్పటికీ కంపెనీ పథంపై విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. కంపెనీ ఈ త్రైమాసికంలో స్థిరత్వం, బలమైన పనితీరును ప్రదర్శించింది. ఇది మార్కెట్ విస్తరణలో మా ప్రయత్నాలను, మా విభిన్న ఉత్పత్తి ఆఫర్‌లకు పెరుగుతున్న డిమాండ్‌ను ప్రతిబింబిస్తుంది. స్వతంత్ర, ఏకీకృత స్థాయిలలో మా ఆదాయ వృద్ధి మా వ్యూహాత్మక కార్యక్రమాల ప్రభావాన్ని వెల్లడి చేస్తుంది. మార్జిన్‌లలో త్రైమాసిక మెరుగుదలలు, మెరుగైన కార్యాచరణ సామర్థ్యాన్ని ప్రదర్శిస్తాయి." అని పటేల్ అన్నారు.

30న మాలమహానాడు ఆధ్వర్యంలో సదస్సు

విశాలాంధ్ర-బషీర్ బాగ్: మాలమహానాడు తెలంగాణ రాష్ట్ర జనరల్ కౌన్సిల్ సదస్సును విజయవంతం చేయాలని సంస్థ జాతీయ అధ్యక్షులు డాక్టర్. వి.ఎల్.రాజు పిలుపునిచ్చారు. మాలమహానాడు కేంద్ర కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో రేవంత్ రెడ్డి కాంగ్రెస్ సర్కార్ ఎస్సీ వర్గీకరణ, క్రిమిలేయర్ అమలు కోసం ఇప్పటికే రిటైర్డ్ హైకోర్ట్ జడ్జి షమీర్ అక్తర్ ఏక సభ్య కమిషన్‌ను నియమించి ప్రక్రియ వేగవంతం చేసారని తెలిపారు. మాల, మాల ఉపకులాలకు చెందిన మంత్రులు ఏమ్మెల్యే, ఏమ్మెల్సీలు పట్టించికోలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటుకు ప్రధాన కారణం మాల జాతే నని, అధికారం వచ్చిన తరువాత మాలలకు వెన్నుపోటు పొడిచి ద్రోహం చేసారని ఆరోపణలు చేశారు. జాతికి అన్యాయం చేసిన మాల ఎమ్మెల్యేలు సీఎం రేవంత్‌రెడ్డికి పాలేర్లుగా ఉండటం సిగ్గుచేటన్నారు. తమ పదవులకు రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఒక పక్క వర్గీకరణను వేగవంతం చేస్తూనే మరో పక్క మాల ఆత్మీయ సభలు నిర్వహిస్తూ.. రాజకీయ డ్రామాలు కాంగ్రెస్ ప్రభుత్వం, మాల ఎమ్మెల్యేలు ఆడుతున్నారని తెలిపారు. ఈ సందర్భంగా మాలమహానాడు రాష్ట్ర స్థాయి సదస్సును డిసెంబర్ 30న బషీర్ బాగా ప్రెస్‌క్లబ్‌లో మధ్యాహ్నం 2 గంటలకు సదస్సు నిర్వహిస్తున్నామని తెలిపారు. సదస్సు కరపత్రంను విడుదల చేశారు. ఈ సమావేశంలో మాలమహానాడు తెలంగాణ రాష్ట్ర శాఖ అధ్యక్షులు జె. ఎస్.రావు, జాతీయ ఉపాధ్యక్షులు జొన్నల గడ్డ భాస్కర్ రావు, సుప్రీంకోర్ట్ న్యాయవాది వడ్లమూరి కృష్ణ స్వరూప్, ఆర్పీఐ రాష్ట్ర అధ్యక్షులు ఎస్.అశోక్ తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా గ్రూప్-3 పరీక్ష

విశాలాంధ్ర - మొయినాబాద్ : నగర శివారులో గ్రూప్-3 పరీక్ష మొదటి రోజు ప్రశాంతంగా జరిగింది. తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్సీ) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పరీక్షలకు మండలంలో 10 కేంద్రాలను ఏర్పాటు చేయగా మొదటి రోజు అదివారం 6726 మంది గాను 1733 అభ్యర్థులు పరీక్ష రాసినట్లు మొయినాబాద్ ఎమ్మార్వో గౌతమ్ కుమార్ తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 వరకు మొదటి పేపర్, మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు రెండవ పేపర్ పరీక్షలను రాసినట్లు తెలిపారు. మూడో పేపర్ పరీక్ష సోమవారం ఉదయం జరగనున్నట్లు ఆయన చెప్పారు. పరీక్ష వివరాలను రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి ఎప్పటికప్పుడు ఆడిగి తెలుసుకున్నట్లు చెప్పారు. కాగా ఆయా పరీక్ష కేంద్రాల వద్ద పోలీసులు పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేశారు. కేంద్రాల చుట్టూ 200 మీటర్ల పరిధిలో 5 మంచి ఎక్కువ మం ది గుమికూడకుండా స్థానికంగా జిరాక్స్, ఇంటర్ నెట్ సెంటర్లను మూసివేయించారు.

సమైక్యత కోసమే కార్తీక వనభోజనం

విశాలాంధ్ర - కుత్బుల్లాపూర్: సమైక్యత చాటడానికి కార్తీక మాస వనభోజనాలు చక్కగా తోడ్పడుతాయని మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ పేర్కొన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధి హెచ్ఎంటి కాలనీలోని వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో ఆదివారం వి.ఎమ్.ఆర్ కాపు సేవా సమితి వారి ఆధ్వర్యంలో కార్తీకమాస వనభోజన మహోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కూన శ్రీశైలం గౌడ్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ మాట్లాడుతూ కార్తీక వనభోజనం కాపు కులసంఘం ఐక్యతను చాటిందని, ఇతర కులాల మాదిరి కాపు కులస్థులు అన్ని రంగాలలో ముందుండాలని పిలుపునిచ్చారు. ఏ సమస్య వచ్చిన అందరు కలిసికట్టుగా పోరాటం చేయాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు లింగం రవి బిఎస్ఎన్ మూర్తి, వైస్ ప్రెసిడెంట్, ఎస్ అర్జున్, చిన్న మణికంఠ, కోట సుధాకర్, కోట రామ్మోహన్, సతీష్, కిషోర్, వెంకట్, కాపు సంఘ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

ఏస్ మండి, బిర్యాని రెస్టారెంట్ ప్రారంభం

విశాలాంధ్ర-శేరిలింగంపల్లి : లింగంపల్లి డివిజన్, గచ్చిబౌలి గ్రామంలో డీ.ఎల్. ఎఫ్ రోడ్ గేట్ నెంబర్ 3 ఎదురుగా నూతనంగా ఏర్పాటు చేసిన ఏస్ మండి & బిర్యాని రెస్టారెంట్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో యాజమాన్యం వారి ఆహ్వానం మేరకు మాదాపూర్ కంటెస్టెడ్ కార్పొరేటర్ రాధాకృష్ణ యాదవ్, బిజేవైఎం రాష్ట్ర నాయకులు భరత్‌తో కలిసి ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభించిన బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, శేరిలింగంపల్లి అసెంబ్లీ ఇంఛార్జి రవికుమార్ యాదవ్, ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అందరికీ రుచికరమైన భోజనం అందిస్తూ వ్యాపారాభివృద్ధి చెంది అనేక శాఖలు ఏర్పాటు చేయాలని కోరుకోవడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో వెంకటేష్, జగదీశ్, కృష్ణ, వంశీ, వారి కుటుంబ సభ్యులు, సన్నిహితులు పాల్గొన్నారు.

జర్నలిజానికి వన్నెతెచ్చిన యోధుడు రామోజీరావు

విశాలాంధ్ర - శేరిలింగంపల్లి : తెలుగు జర్నలిజానికి అత్యంత వన్నె తీసుకొచ్చిన మహోన్నత జర్నలిజం శిఖరం పద్మ విభూషణ్ రామోజీరావు అని పిఏసి చైర్మన్ ఆరెక పూడి గాంధీ అన్నారు. వివేకానంద నగర్ డివిజన్ పరిధిలోని వివేకానంద నగర్ కాలనీ కమ్యూనిటీ హాల్‌లో జరిగిన పద్మ విభూషణ్ రామోజీరావు జయంతి సందర్భంగా ప్రజా ఆలోచన వేదిక ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సంస్మరణ సభ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. సంస్మరణ సభ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ప్రజా ఆలోచన వేదిక అధ్యక్షులు విద్య వెంకట్ మాట్లాడుతూ సమాజంలో సామాజిక స్పృహను పెంపొందించేందుకు అసమానతలను తొలగించేందుకు ప్రజా ఆలోచన వేదిక పనిచేస్తుందన్నారు. తెలుగు జర్నలిజం అక్షర దిగ్గజం రామోజీరావు జయంతి సందర్భంగా నిర్వహించిన సంస్మరణ సభ కార్యక్రమానికి విచ్చేసిన అతిథులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా పీఏసీ చైర్మన్ గాంధీ మాట్లాడుతూ రామోజీరావు భారతదేశంలోనే అతిపెద్ద ఫిలిం సిటీ నిర్మించడం సాహసం అని చెప్పక తప్పదు అన్నారు. వేల కోట్ల వాళ్లు కూడా సాహసం చేయలేదు సాహసం ఆయన నైజం అని అన్నారు. రామోజీరావును చూసి నేర్చుకున్న తాను రాజకీయాల్లో నీతి నిజాయితీగానే కొనసాగుతానన్నారు. ఈనాడు గ్రూపు సంస్థల అధినేత చెరుకూరి రామోజీ రావు మృతి తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసింది అని, ఆయన మరణం చాలా బాధాకరమని. తెలుగు ప్రజలకే కాదు దేశానికి తీరని లోటు అని ఎమ్మెల్యే గాంధీ పేర్కొన్నారు. జీవితంలో ఎన్నిఒడిదొడుకులు ఎదురైన తాను ఎంచుకున్న ప్రతి రంగంలో విజయం సాధించిన పద్మ విభూషణ్ అవార్డు గ్రహీత చెరుకూరి రామోజీ రావును ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని ఎమ్మెల్యే గాంధీ అన్నారు. ఎన్నో సామాజిక కార్యక్రమాలు నిర్వహిస్తూనే తన సంస్థల ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా లక్షలాది మందికి జీవనోపాధి కల్పించిన ఘనత రామోజీరావుకే దక్కుతుంది అని, దేశానికి అన్నం పెట్టే రైతులకు అన్ని విధాలుగా చేదోడువాదోడుగా ఉంటూ వారికి సలహాలు ఇచ్చేందుకు అన్నదాత పత్రిక ను స్థాపించి కోట్లాది రైతుల జీవితాల్లో వెలుగులు నింపిన మహోన్నత వ్యక్తి అని కొనియాడారు. రామోజీ ఫిలిం సిటీని నిర్మించి ప్రపంచ స్థాయి గుర్తింపు తీసుకురావడం తెలుగు వారందరికీ గర్వకారణమన్నారు. సాధారణ వ్యక్తిగా ప్రారంభమైన ఆయన జీవితం అందరికీ ఆదర్శం. నిరంతర శ్రమ, నిత్యం కొత్తదనం కోసం తపన, చెదరని ఆత్మస్థైర్యం, నిబద్ధత, క్రమశిక్షణ కలగలిసిన గొప్ప వ్యక్తి రామోజీ రావు అని అన్నారు. జనసేన సీనియర్ నాయకులు ముమ్మారెడ్డి ప్రేమ కుమార్ మాట్లాడుతూ ఆయన నమ్మిన సిద్ధాంతం కోసం పనిచేస్తారన్నారు. టిడిపి సీనియర్ నాయకులు కంకణాల వెంకట సుబ్బయ్య, జనసేన నాయకులు కొల్లా శంకర్, జర్నలిస్టులు సముద్రాల జగదీశ్వర్ గుప్తా, కళ్యాణ్, సముద్రాల కిరణ్ ,కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ శిరీష సత్తూర్, సీనియర్ జర్నలిస్ట్ విద్య వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

అటకెక్కిన డిజిటల్ విద్య

అలంకారప్రాయంగా స్మార్ట్ టీవీలు, ఐఎఫ్‌పీలు

విశాలాంధ్ర బ్యూరో–ఏలూరు: విద్యావ్యవస్థలో విప్లవాత్మక సంస్కరణల పేరుతో ప్రవేశపెట్టిన డిజిటల్ విద్య ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా తయారైంది. ప్రభుత్వ బడులు కార్పొరేట్ బడులతో పోటీ పడటం కాదు... కార్పొరేట్ బడులే... ప్రభుత్వ బడులతో పోటీ పడాలి... అన్న లక్ష్యంతో ఎంతో ఆర్భాటంగా సర్కారీ స్కూళ్లకు సరఫరా చేసిన బైజూస్ ట్యాబ్‌లు, ఐఎఫ్‌పీలు (ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్), స్మార్ట్ టీవీలు ఇప్పుడు ఎందుకూ కొరగాకుండా పోతున్నాయి. ఏడాది కూడా తిరగకుండానే ఆయా పరికరాలు అటకెక్కాయి. దీంతో సుమారు రూ.వెయ్యి కోట్ల ప్రజాధనం బూడిదలో పోసిన పన్నీరైందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గత ఏడాది మార్చిలో ఎనిమిదో తరగతి విద్యార్థులకు బైజూస్ కంటెంట్ తో కూడిన ఉచిత ట్యాబ్‌లు అందజేశారు. ఆరవ తరగతి పైబడి ప్రతి క్లాస్ రూమ్ లో ఉండేలా రాష్ట్ర వ్యాప్తంగా ఒక్కొక్కటి సుమారు రూ.3.50 లక్షల విలువైన 30,213 ఐ ఎఫ్ పిలు(ఇంటర్ ఆక్టివ్ ఫ్లాట్ ప్యానెల్), ఒక్కొక్కటి సుమారు రూ.70 వేల విలువైన 10,038 ఫౌండేషన్, ఫౌండేషన్ ప్లస్ స్కూళ్లలో స్మార్ట్ టీవీలు అందజేశారు. వీటి వినియోగంపై గత ఏడాది జూలై నెలలో రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో ఉపాధ్యాయులకు శిక్షణ తరగతులు నిర్వహించారు. నాడు–నేడు ఫేజ్ -1 పనులు పూర్తయిన ప్రభుత్వ బడుల్లో 6-10 వరకు ప్రతి తరగతి గదిలో ఒక్కొక్కటి చొప్పున ఐ.ఎఫ్.పి. ప్యానల్, ప్రతి తరగతి గదిలో సుమారు రూ.70 వేల విలువైన స్మార్ట్ టీవీ ఏర్పాటు చేశారు. వీటిని వినియోగించడానికి ప్రతి క్లాస్ రూమ్ కి సాకెట్లు,స్విచ్‌లు, స్విచ్ బోర్డులు, కన్సీల్డ్ వైర్లు, పీవీసీ పైపులు, ఆండ్రాయిడ్, రోటర్లు, కేబుల్, కేబుల్ బాక్సులను ఏర్పాటు చేసుకోవడానికి ఆయా పాఠశాలలకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసినట్లు తెలుస్తోంది. ఐఎఫ్‌పి ప్యానల్, స్మార్ట్ టీవీ లకు రెండు వైపులా తరగతి గదులో 4 ఇ4 సైజులో రెండు గ్రీన్ చాక్ బోర్డులు ఇస్తామని ప్రకటించినా సరఫరా కాలేదని తెలుస్తోంది. అప్పటికే తరగతి గదుల్లో బిగించి ఉన్న 8ఇ4సైజు గల గ్రీన్ చాక్ బోర్డులను తీసేసి పక్కన పెట్టేసారని ఉపాధ్యాయులు అంటున్నారు. ఇలా తొలగించిన 8ఇ4 సైజు గ్రీన్ చాక్ బోర్డులను నాడు–నేడు ఫేజ్ 2, 3 పాఠశాలకు ఇస్తామని చెప్పినా కార్యాచరణకు నోచుకోలేదని అంటున్నారు. ప్రస్తుతం ఫేజ్ -1 పాఠశాలల్లోనే ఐఎఫ్‌పి ప్యానల్సు, 8ఇ4 గ్రీన్ చాక్ బోర్డులు అడ్డదిడ్డంగా, నిరుపయోగంగా ఉన్నాయంటున్నారు. 2023-24 విద్యా సంవత్సరంలో ఏలూరు జిల్లాలో 392 స్కూళ్లలో డిజిటల్ విద్యను అందించాలని విద్యాశాఖ అధికారులు అప్పట్లో నిర్ణయించారు. ఏలూరు జిల్లాలో 213 హై స్కూల్‌లకు 1216 ఐ.ఎఫ్.పి లు, 3094 స్మార్ట్ టీవీలు పంపిణీ చేశారు. అప్పట్లో పరికరాలనైతే బిగించారు గాని నిధులు లేకపోవడం వల్ల చాలా స్కూళ్లలో ఇంటర్నెట్ కనెక్షన్ ఇవ్వలేదని తెలిసింది. కొన్ని స్కూళ్లలో నేటికీ అదే పరిస్థితి. గత విద్యా సంవత్సరంలో ఉన్నతాధికారుల ఒత్తిడి వల్ల ఉపాధ్యాయులే తమ సెల్ ఫోన్ లలో వాట్సాప్, వైఫై ద్వారా స్మార్ట్ టీవీలు, ఐఎఫ్‌పి లకు కనెక్షన్ ఇచ్చి బోధన జరిపారని ఉపాధ్యాయ సంఘాల నాయకులు చెబుతున్నారు. తదనంతర కాలంలో చాలా స్కూళ్లలో స్మార్ట్ టీవీలు, ఐ.ఎఫ్ .పి.లు గోడలపై నిరుపయోగంగా,అలంకారప్రాయంగా మిగిలాయని తెలియవచ్చింది. వాటి టూల్స్ పత్తా లేకుండా పోయినట్లు తెలుస్తోంది. ఇప్పటికైనా విద్యార్థులకు మేలు కలిగేలా, బోధనలో ఆచరణ సాధ్యమయ్యే కార్యక్రమాలను ప్రభుత్వాలు అమలు చేయాలని విద్యారంగా నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

బలమైన నాయకత్వానికే మద్దతు

మహారాష్ట్రలో పవన్ కల్యాణ్ పిలుపు

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: బలమైన నాయకత్వానికి మహారాష్ట్ర ప్రజలు మద్దతు పలకాలని ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కోరారు. మహారాష్ట్ర బల్లార్‌పూర్‌లో ఆదివారం జరిగిన బహిరంగ సభలో మహాయతి కూటమి అభ్యర్థుల విజయాన్ని కాంక్షిస్తూ ఆయన ప్రసంగించారు. మరాఠీ, హిందీ, తెలుగు భాషల్లో మాట్లాడిన ఆయన, రెండు రోజుల్లో మరాఠీ భాషను కొంత వరకు నేర్చుకున్నానన్నారు. అయోధ్య రామమందిర నిర్మాణంలో మహారాష్ట్ర ప్రజల పాత్రను పవన్ ప్రత్యేకంగా ప్రస్తావించారు. 500 ఏళ్ల నిరీక్షణ తర్వాత రాముడికి తన స్థానం దక్కిందని అన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ, అమిత్ షా, నితిన్ గడ్కరీల నాయకత్వంలో మహారాష్ట్రలో అభివృద్ధి తారా స్థాయికి చేరిందని ప్రశంసించారు. తన ఈ పర్యటన ఓట్లు అడగటానికి కాదని, మహారాష్ట్ర అభివృద్ధికి తన గౌరవం తెలపడానికి వచ్చానన్నారు. ప్రపంచ ఆర్థిక వ్యవస్థల్లో భారత్ ఐదో స్థానంలో ఉన్నా, మూడో స్థానానికి చేరుకునే లక్ష్యంతో కృషి చేస్తున్నామని వివరించారు. ప్రాంతీయతను ప్రోత్సహించడంలో జాతీయతను విస్మరించకూడదన్నారు. స్థానిక వనరులు, మానవ వనరులు పరిరక్షించాలన్న తపనతో తాను తెలంగాణకు కూడా మద్దతు తెలిపినట్లు వివరించారు. మహారాష్ట్రను 2028 నాటికి 1 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడమే ఎన్డీఏ లక్ష్యమని పవన్ తెలిపారు. మరాఠా గడ్డపై తన హోదాను మరింత సమర్థవంతంగా వినియోగించి, ఎన్డీఏ విజయానికి మద్దతు తెలపడం తన లక్ష్యమని స్పష్టం చేశారు. మహారాష్ట్ర ప్రజల సహకారంతో మహాయుతీ సర్కార్ అవతరణ సాధ్యం అవుతుందని పవన్ అన్నారు.

నటి కస్తూరికి రిమాండ్... జైలుకు తరలింపు

చెన్నై: తమిళనాడులోని తెలుగువారిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేసులో ప్రముఖ సినీ నటి కస్తూరిని చెన్నై పోలీసులు హైదరాబాద్‌లో అరెస్ట్ చేసిన విషయం విదితమే. తాజాగా ఈ కేసులో కస్తూరికి ఎగ్మోర్ కోర్టు రిమాండ్ విధించింది. ఈ కేసులో కోర్టు కస్తూరికి ఈ నెల 29 వరకు 12 రోజులపాటు రిమాండ్ విధిస్తూ తీర్పునిచ్చింది. ఈ మేరకు పోలీసులు కస్తూరిని చెన్నైలోని ఎగ్మోర్ పుళల్ సెంట్రల్ జైలుకు తరలించారు. కాగా, తీర్పు అనంతరం బయటకు వచ్చిన కస్తూరి అక్కడే ఉన్న విలేకర్లను చూసి... "అధికార దుర్వినియోగానికి ముగింపు పలకండి. న్యాయాన్ని గెలిపించండి" అని వ్యాఖ్యలు చేశారు. కస్తూరి శంకర్ నవంబరు 3న చెన్నైలో జరిగిన ఓ కార్యక్రమంలో మాట్లాడుతూ తమిళనాడులోని తెలుగువారిపై అనుచిత వ్యాఖ్యలు చేశారు. దీనిపై తీవ్ర దుమారం రేగడంతోపాటు తమిళనాడులోని అనేక ప్రాంతాల్లో ఆమెపై కేసులు నమోదయ్యాయి.

ఏ క్షణమైనా కూలొచ్చు!

శిథిలావస్థలో దళితవాడ పాఠశాలలు



విశాలాంధ్ర - పెనుమంట్ర: విద్యారంగానికి ప్రభుత్వం ఏటా రూ. కోట్లలో వెచ్చిస్తున్నా క్షేత్రస్థాయిలో విద్యార్థులను సమస్యలు వెంటాడుతూనే ఉన్నాయి. పశ్చిమ గోదావరి జిల్లా పెనుమంట్ర మండలం సత్యవరం, కోమటి చెరువు, తాళ్ళచెరువు, మార్టేరు, నత్త రామేశ్వరం గ్రామాల్లోని దళితవాడల్లో ఏర్పాటు చేసిన ప్రభుత్వ పాఠశాల్లో మౌలిక సౌకర్యాలు మృగ్యమయ్యాయి. కొన్ని గ్రామాల్లో నేటికీ విద్యార్థులు తమ చదువులు శిథిలమైన పాఠశాలల్లోనే కొనసాగిస్తున్నారు. నాడు–నేడు పథకం కింద నూతన పాఠశాల భవన నిర్మాణాలు కేవలం కాగితాలకే పరిమితం కావడంతో ఇటు విద్యార్థులు అటు ఉపాధ్యాయులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఏ క్షణాన ఏం ప్రమాదం సంభవిస్తుందోనని తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. సత్యవరం చిన్నపేటలో పాఠశాల భవన నిర్మాణాన్ని సుమారు ఎనిమిదేళ్ల క్రితం ప్రారంభించారు. పిల్లర్ల దర్శనం తప్ప ఒక్క అడుగు ముందుకు పడలేదు. ప్రస్తుతం ప్రాథమిక ఉన్నత పాఠశాల అదనపు తరగతి గదిలో తరగతులు నిర్వహిస్తున్నారు. ఆలమూరు చివర కోమటి చెరువు అరుంధతి పేటలో ప్రాథమిక పాఠశాల భవనంపై కప్పు పిచ్చులూడి వర్షం కురుస్తున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యారని చిన్నారుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎప్పుడు ఎలాంటి దుర్వార్త వినాల్సి వస్తుందోనని ఆందోళన చెందుతున్నారు. శిథిలమైన ఈ భవనాల్లోనే విద్యార్థులు విద్యాభ్యాసం చేస్తున్నా... అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు. ప్రమాదం పొంచి ఉన్న పాఠశాల భవనాలను గుర్తించే వారే కరువయ్యారు. ఎందరో మేధావులను అందించిన ప్రభుత్వ పాఠశాలలు నేడు విద్యార్థులేక మూతపడే దశకు చేరుకున్నాయి. హాజరుశాతం బాగా తగ్గడం తో మార్టేరు, నత్తా రామేశ్వరం, తాళ్ళచెరువు పాఠశాలలు ఇప్పటికే మూతపడ్డాయి. ఆర్థిక స్తోమత లేని తల్లిదండ్రులు తమ పిల్లల విద్యాభ్యాసం అగమ్య గోచరంగా మారిందని ఆవేదన చెందుతున్నారు. అధికారులు, తల్లిదండ్రుల కమిటీ, నాయకులు... సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్లి మూతబడుతున్న దళితవాడ పాఠశాలలను అభివృద్ధి చేయాలని ఆయా గ్రామస్తులు కోరుతున్నారు.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం

మండలంలో పాఠశాలల దుస్థితిపై ఉన్నతాధికారులు, రాజకీయ నేతల దృష్టికి తీసుకెళ్లాం. వారి ఉత్తర్వుల కోసం ఎదురు చూస్తున్నాం. వారి సహకారం మేరకు సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాం.

ఉంగరాల నాగేశ్వరరావు,
ఎంఈవో- పెనుమంట్ర

వక్ఫ్ సవరణలు రద్దు చేయాలి

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

విశాలాంధ్ర–విజయవాడ : కేంద్రంలోని మోదీ ప్రభుత్వం ఇటీవల తీసుకువచ్చిన వక్ఫ్ సవరణల బిల్లును రద్దు చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ డిమాండ్ చేశారు. స్థానిక హనుమాన్‌పేట దాసరి భవన్‌లో ఆదివారం ఇన్సాఫ్ రాష్ట్ర కార్యదర్శి సయ్యద్ అఫ్సర్ అధ్యక్షతన జరిగిన ఇన్సాఫ్ రాష్ట్ర సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వక్ఫ్ సంస్థ లక్ష్యాలకు, ముస్లింల అస్థిత్వానికి తీవ్ర నష్టదాయకమైన ఈ బిల్లును వెంటనే ఉపసంహరించుకోవాలన్నారు. వక్ఫ్ ఆస్తులు దేవునికి సంబంధించినవని, ఒక్కసారి వక్ఫ్‌కు అప్పగించిన తరువాత వాటిని వెనక్కు తీసుకునే అధికారం దాతలకు కూడా లేదన్నారు. ఆస్తులపై వచ్చే ఆదాయం పేద ముస్లిం ఆడపిల్లల వివాహాలకు, వితంతువులకు, చదువులకు వినియోగించాలే తప్ప వాటిని అమ్ముకునే అధికారం ఎవరికీ లేదన్నారు. కేంద్రం తీసుకువచ్చిన సవరణల వల్ల వక్ఫ్ ఆస్తులు ఆక్రమణ దారులకు కట్టబెట్టే విధంగా ఉందని విమర్శించారు. దాదాపు 300 ఏళ్లుగా ఉన్న మసీదు, ఖబరస్తాన్, దర్గాలకు సంబంధించిన ఆస్తి పత్రాలను చూపించటం ఇప్పుడు సాధ్యం కాదన్నారు. ఈ సవరణలు ఎన్ఆర్‌సీ, సీఏఏ కంటే ప్రమాదకరమని, వీటి రద్దు కోసం అన్ని వర్గాల వారు పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు, మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్, ముస్లిం ప్రముఖ న్యాయవాది అబ్దుల్ మతీన్, సీనియర్ పాత్రికేయులు షఫీ అహ్మద్, ముస్లిం సంఘాల నాయకులు షేక్ బాజి, మున్నీర్ అహ్మద్, బాబా సాహెబ్, మహబూబ్ ఆజం, ఎంఏ సలార్, జిలాన్ బాషా, ఎస్‌డీ బాషా, ఎస్‌డీ బాబు, ఎస్‌కే బాజి తదితరులు పాల్గొన్నారు.

బీరేన్ సర్కార్‌కు షాక్!

మద్దతు ఉపసంహరించుకున్న ఎన్‌పీపీ

షిల్లాంగ్/ఇంఫాల్: మణిపూర్‌లో బీజేపీ సర్కార్‌కు షాక్ తగిలింది. రాష్ట్రంలో జాతి ఘర్షణలు మరింత పెరగడంతో రాజకీయ పరిణామాలు మారుతున్నాయి. ముఖ్యమంత్రి ఎన్.బీరేన్ సింగ్ నేతృత్వంలోని ప్రభుత్వానికి నేషనల్ పీపుల్స్ పార్టీ (ఎన్‌పీపీ) ఆదివారం మద్దతు ఉపసంహరించుకుంది. 'ఈశాన్య రాష్ట్రంలో సంక్షోభాన్ని పరిష్కరించడంలో, సాధారణ స్థితిని పునరుద్ధరించడంలో బీరెన్ సింగ్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని' పేర్కొంది. 60 మంది సభ్యులున్న మణిపూర్ అసెంబ్లీలో ఎన్‌పీపీకి ఏడుగురు ఎమ్మెల్యేలు ఉన్నారు. గత కొన్ని రోజులుగా మణిపూర్‌లో పరిస్థితి మరింత దిగజారింది. చాలా మంది అమాయకులు ప్రాణాలు కోల్పోయారు. రాష్ట్రంలో ప్రజలు 'అపారమైన బాధలను అనుభవిస్తున్నారు' అని ఎన్‌పీపీ ఆదివారం బీజేపీ జాతీయ అధ్యక్షుడు జెపి నడ్డాకు రాసిన లేఖలో పేర్కొంది. 'బీరెన్ సింగ్ నాయకత్వంలోని మణిపూర్ రాష్ట్ర ప్రభుత్వం సంక్షోభాన్ని పరిష్కరించడంలో, సాధారణ స్థితిని పునరుద్ధరించడంలో పూర్తిగా విఫలమైందని మేము గట్టిగా భావిస్తున్నాం. ప్రస్తుత పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని నేషనల్ పీపుల్స్ పార్టీ మణిపూర్ రాష్ట్రంలోని బీరెన్ సింగ్ ప్రభుత్వానికి మద్దతును ఉపసంహరించుకోవాలని నిర్ణయించుకుంది, తక్షణమే అమలులోకి వస్తుంది' అని లేఖలో పేర్కొంది. 37 మంది శాసనసభ్యులతో కూడిన సభలో బీజేపీకిమెజారిటీ ఉన్నందున, అధికార సంకీర్ణం నుంచి వైదొలగాలని పార్టీ తీసుకున్న నిర్ణయం ప్రభుత్వానికి ముప్పు కలిగించే అవకాశం లేదు. కాగా, బీజేపీకి ఐదుగురు నాగా పీపుల్స్ ఫ్రంట్ (ఎన్‌పీఎఫ్) ఎమ్మెల్యేలు, ఒక జేడీ(యూ) శాసనసభ్యుడు, ముగ్గురు స్వతంత్ర ఎమ్మెల్యేల మద్దతు కూడా ఉంది.

ఆప్ గూటికి బీజేపీ మాజీ ఎమ్మెల్యే

న్యూఢిల్లీ: బీజేపీ మాజీ ఎమ్మెల్యే అనిల్ ఝా ఆదివారం ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్)లో చేరారు. పార్టీ అధ్యక్షుడు అరవింద్ కేజ్రీవాల్ సమక్షంలో ఆప్ కండువా కప్పుకున్నారు. క్షేత్రస్థాయిలో దళితుల కోసం కేజ్రీవాల్ చేసిన పనిని చూసి స్ఫూర్తి పొంది ఆమ్ ఆద్మీ పార్టీలో చేరాలని నిర్ణయించుకున్నట్లు ఝా తెలిపారు. ఈయన గతంలో దిల్లీలోని కిరారీ అసెంబ్లీ స్థానానికి రెండుసార్లు ప్రాతినిధ్యం వహించారు. ఝాను తమ పార్టీకి కేజ్రీవాల్ సాదరంగా ఆహ్వానించారు. పూర్వాంచల్ (తూర్పు యూపీ-పశ్చిమ బీహార్) ప్రముఖ నేతల్లో అనిల్ ఝా ఒకరన్నారు. మంచి విద్య, ఉపాధి కోసం పూర్వాంచల్ ప్రజలు దిల్లీకి వస్తుంటారని, వీరిలో చాలా మంది మురికివాడల్లో ఉంటూ ఎన్నో సమస్యలు ఎదుర్కొంటారని కేజ్రీవాల్ చెప్పారు. 2015లో ఆప్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి నీళ్లు, విద్యుత్, పారిశుద్ధ్యం, రోడ్లు వంటి కనీస వసతులను నాన్-నోటిఫై కాలనీల ప్రజలకు అందుతున్నాయని కేజ్రీవాల్ అన్నారు. అనంతరం ఝా మాట్లాడుతూ బీజేపీని విమర్శిస్తూ కేజ్రీవాల్‌ను ప్రశంసించారు. బీజేపీకి చెందిన కొందరు దిల్లీ నేతలు చెడిపోయిన కొడుకుల వంటి వారని, బీజేపీ అధిష్ఠానం వృద్ధ తండ్రి లాంటిదని, ఆ కొడుకులను నియంత్రిస్తూ ఉంటుందని ఝా వ్యాఖ్యానించారు. దిల్లీ పూర్వాంచలీ వర్గం కోసం పనిచేసిన ఏకైక నాయకుడు అరవింద్ కేజ్రీవాల్ అని అన్నారు. అరకొర వసతులతో, అనధికారిక నీటి పైపులు, మురుగు నడుమ బతికే ఈ ప్రాంతం ప్రజలకు పదేళ్లుగా తాగు నీరు ఇస్తున్నారన్నారు. కేజ్రీవాల్ నాయకత్వంలో అక్కడి ప్రతి ఇంటికి తాగు నీరందుతోందని ఝా చెప్పారు.

మణిపూర్‌ను తగులబెట్టాలన్నదే బీజేపీ కోరిక

కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే



న్యూఢిల్లీ/నాగపూర్: మణిపూర్‌లో తాజా హింస చెలరేగడంతో కాంగ్రెస్ అధ్యక్షుడు కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఆదివారం బీజేపీ తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. పాలకపక్షం ఉద్దేశపూర్వకంగా సరిహద్దు రాష్ట్రాన్ని 'వారి ద్వేషపూరిత విభజన రాజకీయాలకు ఉపయోగించుకోవాలని' కోరుకుంటోందని విమర్శించారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ తమను తాము రక్షించుకోవడానికి వదిలిపెట్టడాన్ని, ప్రజల కష్టాలను తీర్చడానికి మణిపూర్‌లో అడుగుపెట్టకపోవడాన్ని రాష్ట్ర ప్రజలు ఎప్పటికీ క్షమించరు లేదా మరచిపోరని ఖర్గే అన్నారు. 'నరేంద్ర మోదీ జీ, మీ డబుల్ ఇంజిన్ ప్రభుత్వాల హయాంలో, 'మణిపూర్ ఒకటి కాదు, మణిపూర్ కూడా సురక్షితం కాదు' అని కాంగ్రెస్ అధ్యక్షుడు 'ఎక్స్' లో పోస్ట్ చేశారు. 2023 నుంచి ఊహకందని బాధ, విభజన, హింస రాష్ట్ర ప్రజల భవిష్యత్‌ను నాశనం చేసిందని తెలిపారు. 'మణిపూర్‌ను తగులబెట్టేయాలని బీజేపీ ఉద్దేశపూర్వకంగా భావిస్తున్నట్లు కనిపిస్తోంది. ఎందుకంటే అది తన ద్వేషపూరిత విభజన రాజకీయాలకు ఉపయోగపడుతుందని మేము చాలా బాధ్యతతో చెబుతున్నాం' అని కాంగ్రెస్ అధ్యక్షుడు అన్నారు. నవంబరు 7 నుంచి కనీసం 17 మంది ప్రాణాలు కోల్పోయారని, కొత్త జిల్లాలను కలహాలతో దెబ్బతిన్న ప్రాంతాల జాబితాలో చేర్చుతున్నారని, ఈశాన్య రాష్ట్రాల సరిహద్దులకు ఈ మంటలు వ్యాపిస్తున్నాయని ఖర్గే ఆందోళన వ్యక్తం చేశారు. 'మీరు అందమైన సరిహద్దు రాష్ట్రం మణిపూర్ విషయంలో విఫలమయ్యారు. మీరు భవిష్యత్‌లో మణిపూర్‌ని సందర్శించినా రాష్ట్ర ప్రజలు ఎప్పటికీ క్షమించరు లేదా మరచిపోలేరు. మీరు తమను తాము రక్షించుకోవడానికి వదిలిపెట్టారు. వారి కష్టాలను నయం చేయడానికి, పరిష్కారాన్ని కనుగొనడానికి వారి రాష్ట్రంలో ఎప్పుడూ అడుగుపెట్టలేదు' అని అన్నారు. కాగా, లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ కూడా మణిపూర్‌లో ఇటీవలి హింసాత్మక ఘర్షణలు, రక్తపాతం కొనసాగడం 'తీవ్రంగా కలవరపరిచేది' అని పేర్కొన్నారు. ప్రధాని మోదీ రాష్ట్రంలో పర్యటించి ఈ ప్రాంతంలో శాంతిని నెలకొల్పేందుకు కృషి చేయాలని కోరారు. 'ఒక సంవత్సరానికి పైగా విభజన, బాధల తరువాత, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సయోధ్య కోసం అన్ని ప్రయత్నాలు చేసి, పరిష్కారాన్ని కనుగొంటాయని ప్రతి భారతీయుడి ఆశ' అని కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు 'ఎక్స్' పోస్ట్‌లో పేర్కొన్నారు. మణిపూర్‌లో మిలిటెంట్ల చేతిలో బందీలుగా ఉన్న ఆరుగురిలో ముగ్గురి మృతదేహాలను నది నుంచి బయటకు తీసిన ఒక రోజు తర్వాత నిరసనకారులు శనివారం ముగ్గురు రాష్ట్ర మంత్రులు, ఆరుగురు ఎమ్మెల్యేల నివాసాలపై దాడులు చేశారు. మరోవైపు మణిపూర్‌లో హింసాత్మక ఘటనలు చోటుచేసుకుంటున్న నేపథ్యంలో మహారాష్ట్రలో జరగాల్సిన ఎన్నికల ర్యాలీలను కేంద్ర హోం మంత్రి అమిత్ షా రద్దు చేసుకున్నారు.

రామ్మూర్తి నాయుడుకు కన్నీటి వీడ్కోలు

సోదరుడి పాడె మోసిన సీఎం చంద్రబాబు

తరలివచ్చిన అభిమానులు, రాజకీయ, సినీ ప్రముఖులు

విశాలాంధ్ర–చంద్రగిరి: చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సోదరుడు నారా రామ్మూర్తి నాయుడు అంత్యక్రియలు అధికార లాంఛనాలతో ముగిశాయి. సోదరుడు రామ్మూర్తినాయుడుకు అన్న చంద్రబాబు నాయుడు కన్నీటి వీడ్కోలు పలికారు. అంతిమయాత్రలో నారా, నందమూరి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. సీం చంద్రబాబు సోదరుడి పాడెమోశారు.

మహారాష్ట్ర గవర్నర్ సి.పి. రాధాకృష్ణన్ రామ్మూర్తి నాయుడు భౌతికదేహానికి శ్రద్ధాంజలి ఘటించి సీఎం చంద్రబాబుకు తన ప్రగాఢ సంతాపాన్ని తెలిపారు. తండ్రి రామ్మూర్తికి కుమారుడు నారా రోహిత్ తలకొరివి పెట్టారు. రామ్మూర్తి నాయుడు అభిమానులు, సినీ, రాజకీయ ప్రముఖులు, అధికారులు, టీడీపీ శ్రేణులతో నారావారిపల్లి కిటకిట లాడింది. పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. సోదరుడి కుమారులు నారా గిరీష్, నారా రోహిత్, మరదలు ఇందిరను సీఎం చంద్రబాబు ఓదార్చారు. 'మీకు అండగా నేనుంటా అధైర్య పడకండి అంటూ' ఓదార్చారు. రామ్మూర్తి నాయుడు భౌతికదేహాన్ని రాష్ట్ర మంత్రి నారా లోకేశ్, నందమూరి రామకృష్ణ ప్రత్యేక విమానంలో రేణిగుంట విమానాశ్రయానికి తీసుకొచ్చారు. రేణిగుంట విమానాశ్రయం నుండి స్థానిక శాసనసభ్యులు పులివర్తి వెంకటమణి ప్రసాద్ (నాని), టీడీపీ శ్రేణులు, అధికారులు ప్రత్యేక వాహనంలో నారావారిపల్లెలోని స్వగృహానికి తీసుకొచ్చారు. అక్కడ సీఎం చంద్రబాబు, ఆయన కుటుంబ సభ్యులు, రామ్మూర్తినాయుడు కుమారులు నారా రోహిత్, నారా గిరీష్, ఇతర కుటుంబ సభ్యులతో పాటు పెద్ద సంఖ్యలో మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, మాజీ ఎమ్మెల్యేలు, సినీ ప్రముఖులు, టీడీపీ శ్రేణులు, అభిమానులు రామ్మూర్తినాయుడు భౌతిక దేహానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. రామ్మూర్తి నాయుడు భౌతిక దేహాన్ని సందర్శించి అంతిమ వీడ్కోలు పలికేందుకు సామాన్య ప్రజలకు, వీఐపీ లకు వేరువేరుగా క్యూలైన్లు ఏర్పాటు చేశారు. అంతిమ సంస్కారాల కార్యక్రమంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా తిరుపతి జిల్లా ఎస్పీ ఎల్ సుబ్బరాయుడు గట్టి పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. మహారాష్ట్ర గవర్నర్ సి.పి.రాధాకృష్ణన్, చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాద్ రావు, చంద్రగిరి, సత్యవేడు, పలమనేరు, చిత్తూరు, శ్రీకాళహస్తి, వెంకటగిరి, పూతలపట్టు, నగరి, ఎమ్మెల్యేలు పులివర్తి నాని, కె.ఆదిమూలం, ఎస్.అమరనాథ్‌రెడ్డి, గురజాల జగన్మోహన్, బొజ్జల సుధీర్ రెడ్డి, కె.రామకృష్ణ, కె.మురళీమోహన్, గాలి భాను ప్రకాష్, మాజీ రాజ్యసభ సభ్యులు డాక్టర్ ఎం.మోహన్ బాబు, మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు, టీటీడీ అదనపు ఈఓ వెంకయ్య చౌదరి, మాజీ ఎమ్మెల్యేలు సుగుణమ్మ, మోహన్, శ్రీనినాథ్‌రెడ్డి. ఏఎస్.మనోహర్, చదలవాడ కృష్ణమూర్తి, ఎస్ సి వి.నాయుడు, సినీ ప్రముఖులు రాజేంద్రప్రసాద్, మంచు మనోజ్, నాగ సౌర్య, టీటీడీ పాలక మండలి సభ్యుడు బాను ప్రకాష్ రెడ్డి, ఎమ్మార్పీఎస్ అధ్యక్షులు మంద కృష్ణ మాదిగ, టీటీపీ, బీజేపీ, జనసేన పార్టీల నాయకులు, చుట్టుపక్కల గ్రామస్తులు నారా రామ్మూర్తి నాయుడు భౌతిక దేహాన్ని సందర్శించి ఆయన ఆత్మకు శాంతి కలగాలని నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు.

మట్టిని రక్షిస్తేనే మనుగడ

భూమి క్షేమాన్ని కాంక్షిస్తూ విజయవాడలో మరథాన్

విశాలాంధ్ర–విజయవాడ: భూమి క్షేమంగా ఉంటేనే జీవరాశులు సంతోషంగా ఉంటాయన్నది ప్రతి ఒక్కరూ గుర్తించాలని ప్రముఖ సివిల్ ఇంజనీర్ చల్లా సుబ్రహ్మణ్య శర్మ (సీఎస్ శర్మ) అన్నారు. విషతుల్య రసాయనాలతో కలుషితం అవుతున్న మట్టిని రక్షిస్తేనే మనుషులకు మనుగడ ఉంటుందని తెలియజేస్తూ నగరంలో ఆదివారం 21 కిటోమీటర్ల మరథాన్ నిర్వహించారు. సీఎస్ శర్మ మాట్లాడుతూ ప్రజలకు మట్టి ప్రత్యేకతపై అవగాహన కల్పించేందుకే మరథాన్ చేపట్టినట్లు చెప్పారు. 2022 , మార్చి 21న ఈశా ఫౌండేషన్ వ్యవస్థాపకులు ఈ ఉద్యమాన్ని ప్రారంభించారని అన్నారు. ఆరు శాతం సేంద్రీయ పదార్థాలు ఉండాల్సి భూమిలో కేవలం 0.5 శాతం ఉన్నాయన్నారు. ఈ ధోరణి ఇలాగే కొనసాగితే సమృద్ధి నేలలు బీడు భూములుగా మారి ప్రపంచ ఆహార భద్రత ప్రమాదంలో పడుతుందని పేర్కొన్నారు. అధిక సేంద్రీయ పదార్థాలు ఉన్న మట్టి ఎక్కువ పోషకాలు గల పంటలను ఇవ్వటంతో పాటు నీటి నిల్వలను మెరుగుపరస్తుంద, వాతావరణ మార్పులను తగ్గిస్తుందని వివరించారు. ప్రజల్లో అవగాహన కల్పించడానికి తాను 'మట్టి రక్షించు' జెండా పట్టుకుని విశాఖపట్నం, విజయవాడ, కాకినాడ, హైదరాబాద్, బెంగళూరు, గోవా, రాయపూర్, సంబల్పూర్, భువనేశ్వర్ వంటి ప్రాంతాల్లో ఇప్పటి వరకు 5,433 కిలోమీటర్లు పరిగెత్తినట్లు చెప్పారు. వారంలో రెండుమూడు రోజులు పరిగెత్తే కార్యక్రమం నిర్వహిస్తానని పేర్కొన్నారు.

విశ్వసుందరి మిస్ డెన్మార్క్ విక్టోరియా

మెక్సికో: విశ్వ సుందరి కిరీటాన్ని అందుకోవడానికి వివిధ దేశాల యువతులు ఉవ్విళ్లూరుతూ ఉంటారు. ఎన్నో కలలుగంటారు. ప్రపంచవ్యాప్తంగా అందాల పోటీల్లో మిస్ యూనివర్స్‌కు ఎంతో ప్రాధాన్యత ఉంది. తాజాగా మెక్సికో వేదికగా జరిగిన పోటీల్లో డెన్మార్క్‌కు చెందిన విక్టోరియా కెజార్ హెల్విగ్ (21) మిస్ యూనివర్స్-2024 పోటీల్లో గెలుపొందారు. విశ్వసుందరి కిరీటాన్ని అందుకున్నారు. 125 మంది పోటీ పడగా విక్టోరియా కెజార్ విజయాన్ని సొంతం చేసుకున్నారు. నైజీరియాకు చెందిన చిడిమ్మ అదెట్షినా, మెక్సికోకు చెందిన మరియా ఫెర్నాండా బెల్‌ట్రాన్ మొదటి, రెండో రన్నరప్‌గా నిలిచారు. షెన్నిస్ పలాసియోస్ (మిస్ యూనివర్స్-2023)... విజేతకు కిరీటాన్ని అందజేశారు. 'కొత్త శకం మొదలైంది. 73వ విశ్వ సుందరిగా గెలుపొందినందుకు అభినందనలు. ప్రపంచవ్యాప్తంగా మహిళల్లో స్ఫూర్తి నింపేలా మీ ప్రయాణం సాగాలని కోరుకుంటున్నాం' అని మిస్ యూనివర్స్ టీమ్ పేర్కొంది. ఆమెకు ఫ్యాషన్ అభిమానులు అభినందనలు తెలిపారు. కాగా, ఈ పోటీలకు భారత్ తరపున రియా సింఘా హాజరయ్యారు. మొదటి ఐదు స్థానాల్లో ఆమె నిలవలేకపోయారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2024-26, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.